





www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★


డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లపై.. చురుకుగా భారత న్యాయవ్యవస్థ

సిజెపికి రాజకీయ లక్ష్యాలు ఉండొచ్చు..

ప్రధాని నరేంద్ర మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పురస్కారం

07


సంపుటి 09, సంచిక: 271 | సోమవారం | 31-08-2026 | ఖమ్మం
Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar
పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## కాంగ్రెస్ ప్రజాపాలనకు 1000 రోజులు



- సంక్షేమం నుంచి ప్రపంచ-స్థాయికి తెలంగాణ
- సంక్షేమం, విస్తరణ, సామాజిక న్యాయానికి పెద్దపీట
- రైతులు, మహిళలు, యువతకు భరోసా
- రాష్ట్రానికి భారీ పెట్టుబడులు ప్రభుత్వ వర్గాల వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల మైలురాయిని చేరుకుంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలనను పునర్నిర్మించడం, సంక్షేమాన్ని విస్తరించడం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేయడం, రైతులు మహిళలు యువతకు భరోసా కల్పించడం, రాష్ట్రానికి భారీ పెట్టుబడులను తీసుకురావడం, భవిష్యత్తు తెలంగాణకు ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు నిర్మించడంలో ఈ వెయ్యి రోజుల పాలన చరిత్రలో కొత్త అధ్యాయాన్ని నమోదు చేసింది. ఈమేరకు ప్రభుత్వ వర్గాలు వివరాలు వెల్లడించాయి. 2025–26లో తెలంగాణ తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరింది. దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే దాదాపు 91 శాతం అధికం. సంక్షేమాన్ని కొనసాగిస్తూనే పెట్టుబడులు, ఉపాధి, మౌలిక సదుపాయాలు, సాంకేతిక రంగాల విస్తరణతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు లభించింది. రైతులు, మహిళలు, యువత, కార్మికులు, ఉద్యోగులు, అధికారులు, పారిశ్రామికవేత్తలు, ప్రజల భాగస్వామ్యంతో సమష్టి ప్రగతి సాధించింది.

**రైతులకు అండ.. వ్యవసాయంలో నంబర్1**

దేశంలోనే ఎక్కడా లేని విధంగా రూ.2 లక్షల వరకు పంట రుణాల మాఫీతో 25 లక్షలకు పైగా రైతు కుటుంబాలకు రుణభారం నుంచి విముక్తిల భించింది. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకుపైగా పెట్టుబడి సాయాన్ని ఒకే విడతలో 9 రోజుల్లో దాదాపు రూ.9 వేల కోట్ల జమ చేసింది. సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్. వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, రైతు బీమాతో నిరంతర భరోసా కల్పించింది. గడిచిన 32 నెలల కాలానికి సంబంధించిన లెక్కల ప్రకారం వ్యవసాయం, రైతు సంక్షేమానికి దాదాపు రూ.1.68 లక్షల కోట్ల వ్యయం జరిగింది. వరి సాగు, ఉత్పత్తిలో పంజాబ్‌ను అధిగమించి దేశంలో మొదటి స్థానంలో తెలంగాణ నిలిచింది. గత యాసంగిలో 81.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి కొత్త రికార్డు సృష్టించింది. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటా కోసం రాజీలేని పోరాటం చేస్తున్నది.

**మహిళా సాధికారతలో కొత్త అధ్యాయం**

మహాలక్ష్మి పథకం తరువాయి 8లో

# మా వాళ్లెక్కడ?

## నేపాల్ వరదల్లో గల్లంతయిన వారి బంధువుల వెతుకులాట

- శిథిలమైన మృతదేహాలు, కొందరి భౌతిక దేహాల్లో కనిపించని అవయవాలు
- 788కి చేరిన మృతులు
- ఇప్పటి వరకు 17 మృతదేహాలే గుర్తింపు
- 2,500 మందికి పైగా లభించని ఆచూకీ
- మళ్లీ ఉప్పొంగుతున్న భోటేకోషి నది







**ఖాట్మండు:** నేపాల్–చైనా సరిహద్దుల్లో సంభవించిన జలప్రళయంలో నేపాల్‌లో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. నేపాల్‌లో మృతుల సంఖ్య 788కు చేరిందని నేపాల్ పోలీసులు ఆదివారం తెలిపారు. తాజా గణాంకాల ప్రకారం, చిత్వాన్ జిల్లాలో అత్యధికంగా 264 మంది మరణించారు. నవల్పరాసి ఈస్ట్‌లో 194, నవల్పరాసి వెస్ట్‌లో 120, గూర్ఖాలో 58, నువాకోట్‌లో 52, ధాడింగ్‌లో 50, తునహూన్‌లో 37, రుసువాలో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. తప్పిపోయిన తమ బంధువుల కోసం వెతుకుతూ భారీ సంఖ్యలో ప్రజలు ఆసుపత్రులకు తరలివస్తున్నారు. ఆసుపత్రుల గోడల బయట ఫోటోలను అతికించగా, ఆ ఫొటోలు, వివరాలతో జాబితాలను పరిశీలిస్తున్నారు. అయితే, ఇప్పటివరకు లభించిన మృతదేహాలలో కేవలం 17 మాత్రమే గుర్తించబడ్డాయని పోలీసులు తెలిపారు. చాలా మృతదేహాల పరిస్థితి కారణంగా గుర్తింపు కష్టంగా మారింది. భారీ విధ్వంసాన్ని సృష్టించిన ఈ విపత్తు తరువాత ఆదివారం నాడు భోటెకోషి నదిలో నీటి మట్టాలు మళ్లీ పెరిగాయని అధికారులు హెచ్చరించారు. వరద ప్రభావిత జిల్లాల్లోని ప్రజలు, సహాయక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వారు కోరారు. నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ తరువాయి 12లో

## భారత్‌లో ఇదే మాట్లాడతారా!

- భాగవత్ 'హిందూ–ముస్లిం' వ్యాఖ్యలపై డి.రాజా సవాల్
- ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతంపై వస్తున్న ప్రశ్నల నుంచి దృష్టి మళ్లించేందుకేనని వ్యాఖ్య



**న్యూఢిల్లీ :** హిందూముస్లిం ఐక్యత గురించి అమెరికాలో కాదు భారత్‌లో ప్రకటన చేయాలంటూ ఆర్‌ఎస్‌ఎస్ అధ్యక్షుడు మోహన్ భాగవత్‌కు సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా సవాల్ విసిరారు. భాగవత్ నిజాయతీగా, సత్యసంధుడిగా వ్యవహరించారు. అయితే, అదే మాటలను భారతదేశంలోనూ మాట్లాడాలని అన్నారు. న్యూయార్క్‌లో జరిగిన 'వన్ వరల్డ్ వన్ హ్యూమానిటీ' కార్యక్రమంలో భగవత్ వ్యాఖ్యలపై డి.రాజా ఆదివారం స్పందించారు. విదేశాల్లో కాదు భారత గడ్డపై ఈ వ్యాఖ్యలు చేయగలరా తరువాయి 12లో

విద్యార్థులు ప్రశ్నలు సంధిస్తే

## శిక్షాత్మకచర్యతో బెదిరింపులా?

- ఈ విధానం రాజ్యాంగ విరుద్ధం
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఉజ్జల్ భుయాన్



**న్యూఢిల్లీ :** భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసే లేదా ప్రశ్నలు అడిగే విద్యార్థులను శిక్షాత్మక చర్యలతో బెదిరించకూడదని, అటువంటి విధానం రాజ్యాంగ విరుద్ధమని, అధికార దుర్వినియోగం అవుతుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఉజ్జల్ భుయాన్ అన్నారు. విశ్వవిద్యాలయం అనేది 'స్థాపిత అభిప్రాయాలను' పరిశీలించి ప్రశ్నించగలిగే ప్రదేశంగా ఉండాలని విభేదాలను శత్రుత్వంతో ఎదుర్కోకూడదని జస్టిస్ భుయాన్ హితవు పలికారు. స్వేచ్ఛగా ఆలోచించే అలవాటు విశ్వవిద్యాలయంలోనే మొదలవ్వాలని, విద్యార్థి కష్టమైన ప్రశ్నలు అడగడానికి సంకోచించకూడదని తరువాయి 12లో

# స్కీమ్ వర్కర్లు బానిసలా?

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని మండిపాటు
- కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు చేయకపోవడం దుర్మార్గమని విమర్శ



ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలవుతున్న వివిధ స్కీమ్‌లలో పనిచేస్తున్న సుమారు 2.15 లక్షల మంది కార్మికులను ప్రభుత్వాలు బానిసలుగా చూస్తున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, ఎన్‌హెచ్‌ఎం, సిఆర్‌పి, వివఓ, మిషన్ భగీరథ, సెర్ప్, ఉపాధి హామీ తదితర స్కీమ్‌లలో పనిచేస్తున్న వారికి తరువాయి 12లో

## 40 స్టేషన్లు.. రూ.2000 కోట్లు

- 'అమృత్ భారత్' పథకం కింద తెలంగాణలో రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్



అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద తెలంగాణలో 40 రైల్వే స్టేషన్లను రూ.2,000 కోట్లకు పైగా వ్యయంతో పునరాభివృద్ధి చేస్తున్నామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 12 ఏళ్లుగా తెలంగాణ రైల్వే నెట్‌వర్క్‌లో భారీ మార్పులు చోటుచేసుకున్నాయని చెప్పారు. కొత్త రైల్వే లైన్లు, డబ్లింగ్, థర్డ్ లైన్లు, బైపాస్ లైన్లు, స్టేషన్ల పునరాభివృద్ధి, విద్యుదీకరణ, భద్రతా చర్యలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. రూ.24.35 కోట్ల వ్యయంతో చేపడుతున్న స్టేషన్ పునరాభివృద్ధి పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించడంతో పాటు ప్రయాణికులకు కల్పించనున్న తరువాయి 12లో

## ప్రశాంతంగా నీట్ పిజి పరీక్ష

రాజస్థాన్‌లోని జైపూర్‌లో 2 పరీక్ష కేంద్రాల్లో వాయిదా



**న్యూఢిల్లీ :** దేశ వ్యాప్తంగా నీట్ పిజి పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. పరీక్షకు 2.63 లక్షల మంది హాజరయ్యారు. ఈ పరీక్షను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్(ఎన్‌బిఇఎంఎస్) సంస్థ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహించింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్ష నిర్వహించారు. అయితే, తరువాయి 12లో



చెన్నై



బిహార్

## ఢిల్లీకి ఎర్ర సైన్యం



హనుమకొండ

అరుణ సైన్యం పిడికిలి బిగించింది. దృఢ సంకల్పంతో 'బద్లావ్ జరూరీ హై' కోసం ఐక్య స్వరం వినిపించేందుకు ఎర్ర సైన్యం దేశం నలుమూలల నుంచి ఢిల్లీకి పయనమైంది. కొత్త కలలతో, నూతనోత్సాహంతో నవ భారతావని దిశగా కొత్త అవకాశాల కోసం జెన్ జీ సైతం 'బద్లావ్' (మార్పు)కు జైకొట్టింది. ఢిల్లీలో సెప్టెంబరు 1న జరగబోయే బద్లావ్ జరూరీ హై ర్యాలీ కోసం చరిత్రాత్మక రాంలీలా మైదానం ముస్తాబైంది. సిపిఐ నాయకులు ఆదివారం క్షేత్రస్థాయిలో పర్యటించి, ఏర్పాట్లు సమీక్షించారు. ర్యాలీకి వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.




## కార్పొరేట్లకు ఇచ్చిన రుణాలు ఎక్కడికి వెళ్లాయి?

ప్రజాపక్షం/హైదరాబాద్

సామాన్యుడు బ్యాంకులో రూ.10 లక్షల రుణం తీసుకుంటే ప్రతి నెలా ఇఎంఐ చెల్లించాల్సిందే.. ఒక్కటి రెండు వాయిదాలు ఆలస్యమైనా బ్యాంకు నోటీసులు, జరిమానాలు, క్రెడిట్ స్కోర్‌పై ప్రభావం.. మరి వేల కోట్ల రూపాయల రుణాలకు హామీ ఇచ్చిన కార్పొరేట్ పెద్దల విషయంలో రుణం ఎక్కడికి వెళ్లింది? ఆస్తులు ఏమయ్యాయి? రికవరీ ఎంత జరిగింది? తరువాయి 8లో

**క్లెయిమ్‌లు రూ.22 వేల కోట్లు.. చెల్లించింది రూ.6.25 కోట్లే**


- జీ గ్రూప్ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్ర వ్యక్తిగత దివాళాపై జెన్‌జీల మన్‌కీబాత్
- సామాన్యుడిపైనేనా బ్యాంకుల ప్రతాపమని ప్రశ్నలు



# మూలాలు వెతికిన 'రూట్స్'

కాలాతీత రచన

అలెక్స్ హేలీ రచించిన 'రూట్స్: ది సెగా ఆఫ్ యాన్ అమెరికన్ ఫ్యామిలీ' నవల కుటుంబ కథను చెప్పడాన్ని, సమాజ చరిత్రను వివరించడాన్ని అధిగమించి, ఒక ప్రజాసమూహం తన గతాన్ని వెతుక్కునే ప్రయత్నాన్ని, సాంస్కృతిక ప్రక్రియను మన కళ్ల ముందు ఆవిష్కరిస్తుంది. 1976 ప్రచురితమైన ఈ నవలలో కథ విస్తారమైన అనుభవాలను ప్రోదిచేసుకుంటూ ముందుకు సాగుతుంది. ఆఫ్రికాలోని గాంబియా నుంచి అమెరికా బానిస వ్యవస్థ వరకు ఎన్నో అంశాలను ప్రస్తావిస్తుంది. అం తర్యుద్ధాన్ని పలకరిస్తుంది. బానిసత్వ నిర్మూలకు సాగిన పోరాటాన్ని పరిచయం చేస్తుంది. జీవితాలను పేర్చుకుంటూ, ఒడిదుడుకులు ఎదుర్కొంటూ సాగిన ఒక కుటుంబ ప్రయాణాన్ని సమకాలీన సమాజానికి ఆపాదించి వివరిస్తుంది. మాండికా వ్యక్తి కుంటా కింటా అమెరికాలో స్థిరపడతాడు. ఆ తర్వాత అతని వారసులు అనేక తరాలు అ మెరికా నేలపైనే జీవిస్తారు. బానిసత్వ బాధల నుంచి హక్కుల కోసం జరిగిన పోరాటాల వరకూ ఆ కుటుంబం ఎన్నో ఒడిదిడుకులు ఎదుర్కొంటుంది. అయితే, 'రూట్స్'ను బానిసత్వంపై రాసిన నవలగా చూడడం సరికాదు. ఎందుకంటే, అది నిష్కళంకమైన కుటుంబ చరిత్రగా కూడా నిలుస్తుంది. ఆ కోణంలో చదివితేగానీ దాని లోతులు అర్థం కావు. ఆఫ్రికా నుంచి అమెరికా చేరిన నల్లజాతి కుటుంబాల్లో హేలీ కుటుంబం కూడా ఒకటి. మిగతా వారి మాదిరి కాకుండా, హేలీ తన తన కుటుంబ సంప్రదాయాలను విశ్లేషిస్తాడు. వారసత్వ సంపదగా నిలిచే పత్రాలను లోతుగా పరిశీలిస్తాడు. వంశ వృక్షాన్ని సిద్ధం చేసే ప్రయత్నం చేస్తాడు. ఆ పరిశోధనా క్రమంలోనే చరిత్రను తవ్వితీస్తాడు. ఏడు తరాల చరిత్రనే సాహిత్య గాథగా నిర్మిస్తాడు. ప్రతిష్టాత్మక సాహిత్య పురస్కారం 'పులిట్జర్' (1977)కు ఎంపికైన ఈ నవల, 46 వారాల పాటు న్యూయార్క్ టైమ్స్ బెస్ట్ సెల్లర్ జాబితాలో అగ్రస్థానాన్ని ఆక్రమించింది. గాంబియా నదికి సమీపంలోని జుఫ్యూర్ గ్రామంలో పుట్టిపెరిగిన కుంటా బాలాన్ని తన మాండింకా కుటుంబం, గ్రామ సంప్రదాయాలు, మతం, వ్యవసాయం, సామాజిక క్రమం వంటి అంశాలు శాసిస్తాయి. తన తండ్రి పదేపదే వంశ గౌరవం గురించి ఘనంగా చెప్పడంతో, కుంటా కింటేలో ఒక రకమైన గర్వం పెరుగుతుంది. బానిసత్వ దుష్ట సంప్రదాయాన్ని బానిసగా ఉన్న ఒక వ్యక్తి కళ్లతోనే చూపడించడం హేలీ గొప్ప ఎత్తుగడ. బానిసత్వ నిర్మూలన అనంతరం జన్మించిన వారంతా తమ స్వేచ్ఛను అనుభవిస్తారు. భాష, మతం, భూమి, పేరు అన్నింటినీ తనవిగా భావిస్తారు. ఇలాంటి భావాలే జీర్ణించుకుపోయిన ఒక యువతరాన్ని హేలీ ఒక్కసారిగా బానిసత్వ వ్యవస్థలోకి నెట్టేస్తాడు. అంతేకాదు, బానిసత్వం అంటే కేవలం శారీరకంగా ఒకరి ఆధీనంలో ఉండడమే కాదని, పేరు నుంచి భాష వరకు, కుటుంబ సంబంధాల నుంచి సామాజిక స్థానం వరకూ, గతం నుంచి భవిష్యత్తు వరకూ అడుగడుగునా జరిగే అణచివేత అని గుర్తిస్తాడు. పాఠకులు అదే కోణంలో ఆలోచించేలా కథను






ముందుకు తీసుకెళ్లడంలో హేలీ అద్భుత ప్రతిభ కనబరిచాడు. కథ విషయానికి వస్తే, చెక్కతో డ్రమ్ తయారు చే యడానికి అడవిలోకి వెళ్లిన కుంటా అనుకోకుండా బానిస వ్యాపారుల చేతిలో బందీ అవుతాడు. అక్కడి నుంచి అతని జీవితం పూర్తిగా మారిపోతుంది. అతనిని మానసికంగా అవమానించి, శారీరకంగా హింసించి, సంకెళ్లతో కట్టేసి అట్లాంటిక్ మహాసముద్రాన్ని దాటిస్తారు. ఆ సమయంలో అతను పడిన బాధను, ఎదుర్కొన్న దుర్భర పరిస్థితులు బానిస వ్యవస్థ దుర్మారాన్ని హేలీ కళ్లకు కడతాడు. మనిషిని సరుకుగా మార్చిన ఆర్థిక వ్యవస్థను ఒక శరీరం అనుభవించే బాధగా చూపిస్తాడు. ఎవరూ ప్రవేశించలేని ఓ ఇరుకైన ప్రదేశం, దుర్వాసన, ఆకలి, దా హం, వ్యాధి, నగ్నత్వం, హింస, మరణ భయం కలగలిసిన బానిస వ్యాపార వ్యవస్థ చెక్కిన అమానుష ఆధిపత్యా న్ని పాఠకుల ముందుకు తెస్తాడు. ఈ అనుభవాన్ని విస్తృతంగా అమెరికా పాఠక వర్గానికి చేరువ చేసిన తొలి నవలగా, అత్యంత ప్రజాదరణ పొందిన రచనగా 'రూట్స్' నిలుస్తుంది. ఇక, అమెరికా చేరుకున్న తర్వాత, బానిస వ్యాపారులు కుంటాను జాన్ వాలెర్ అనే వ్యక్తికి అమ్మేస్తారు. అతను కుంటాకు 'టోబీ' అని పేరు పెడతారు. అయితే, కుంటా తన అసలు పేరును కాపాడుకోవడానికి ప్రయత్నిస్తాడు. తనను టోబీ అని పిలవడాన్ని తిరస్కరిస్తాడు. ఎందుకంటే పేరు మార్చడం ద్వారా యజమాని అతని వ్యక్తిత్వంపై తన అధికారం ప్రకటిస్తున్నాడు. కుంటా ప్రతిఘటనను కొనసాగిస్తాడు. పారిపోవడానికి పలు మార్లు ప్రయత్నిస్తాడు. చివరకు బానిస వేటగాళ్లు అతని కుడి పాదంలో కొంత భాగాన్ని తొలగిస్తారు. యజమాని తన బానిస శరీరాన్ని నియంత్రించగలడుగానీ,నీ అతని జ్ఞాపకాన్ని పూర్తిగా నియంత్రించలేడనే ఒక శక్తివంతమైన ప్రతీకను కుంటా ప్రతిఘటన రూపంలో హేలీ నిర్మిస్తాడు. యజమాని తాను కొనుగోలు చేసిన బానిస పేరు మార్చగలడేమోగానీ, అతని పూర్వీకుల జ్ఞాపకాన్ని మాత్రం తుడిచివేయలేడు. కాగా, కుంటా తన కుమార్తె కిజ్జీకి తన మూలాలను చెప్పే ప్రయత్నం చేస్తాడు. ఆ జ్ఞాపకమే తరువాత తరాలుగా కథల రూపంలో ప్రయాణించి హేలీ వద్దకు చేరుతుంది. కుంటా వివాహం బెల్‌తో జరుగుతుంది. వారికి కిజ్జీ పుడుతుంది. కిజ్జీ బాల్యం తల్లి దండ్రుల ప్రేమతో కొంత సురక్షితంగా సాగుతుంది. ఆమెకు మిస్సీ యాన్ అనే తెల్లజాతి యువతితో స్నేహం ఏర్పడుతుంది. చదవడం, రాయడం నేర్చుకోవడానికి ఆమెకు అవకాశం వస్తుంది. కానీ బానిస వ్యవస్థలో వ్యక్తిగత సంబంధాలకు కూడా యజమాన్య హక్కు అడ్డుపడుతుంది. కిజ్జీ ఒక బానిస యువకుడు నోహ్‌కు పారిపోవడానికి నకిలీ ప్రయాణ పత్రం తయారు చేస్తుంది. విష యం బయటపడటంతో ఆమెను కుటుంబం నుంచి వేరు చేసి అమ్మేస్తారు. ఆమెకు అప్పటికి పదహారేళ్లు. 'రూట్స్' నవలలో 'కుటుంబ విభజన' అనే అత్యం త విషాదాన్ని వివరిచే ఘట్టం ఇది. బానిస వ్యవస్థ ఒక వ్యక్తినేగాక అతని లేదా ఆమె కుటుంబాన్ని కూడా ఛిద్రం చేస్తుందని, తల్లి, తండ్రి, కుమార్తె, భార్య, భర్త అనే సం బంధాలనూ మార్కెట్‌లో వస్తువులుగా మార్చేస్తుందని అర్థమైనప్పుడు పాఠకుడి గుంటె బాధతో బరువెక్కుతుంది. కిజ్జీ 'కొనుగోలు' చేసిన టామ్ లీ, ఆమెపై అత్యాచారం చేస్తాడు. అతను శారీరక సంబంధాన్ని కొనసాగించడంతో, ఆమె జార్జికి జన్మనిస్తుంది. జార్జి పెరిగిపెద్దవాడై పందెపు కోళ్ల శిక్షకుడిగా మంచి పేరు సంపాదిస్తా డు. అందరూ అతనిని 'చికెన్ జార్జి' అని పిలస్తారు. ఈ పాత్ర ద్వారా, బానిసత్వంలో బతికిన ప్రతి ఒక్కరూ ఒకే రకంగా ప్రతిఘటించరని, కొందరు పారిపోవడానికి ప్ర యత్నిస్తే, మరి కొందరు కుటుంబాన్ని రక్షించుకోవడానికి యజమానితో రాజీ పడతారని ఒక సంక్లిష్టమైన అం శాన్ని హేలీ ప్రస్తావిస్తాడు. కొంత మంది తమకు దొరికిన చిన్న ఆర్థిక అవకాశాలను ఉపయోగించుకుని స్వేచ్ఛ కు దారి వెతుకుతారని కూడా చెప్తాడు. చికెన్ జార్జి కోడి పందేల ప్రపంచంలో తనకంటూ ఒక స్థానాన్ని నిర్మించుకోవడం ద్వారా, కుటుంబానికి కొంత స్వేచ్ఛను కొనుక్కునేందుకు ప్రయత్నిస్తాడు. అతని కుమారుడు టామ్ ము ర్రే కమ్మరిగా ఎదుగుతాడు. అంతర్యుద్ధం ముగియడం తో బానసత్వ నిర్మూలనా చట్టం అమల్లోకి వస్తుంది. కా నీ, ఆ వ్యవస్థ ఒక్కసారిగా అంతమైపోదు. ఇదే విషయా న్ని హేలీ ప్రస్తావిస్తాడు. అందుకే, ఆ కుటుంబం ఉత్తర కొరోలినా నుంచి టె న్నెసికి వలసవెళ్లి, అక్కడ కొత్త జీవితాన్ని ప్రారంభిస్తుంది. బానిసత్వం ముగిసి, బానిస కు టుంబాలకు కొత్త జీవితం లభించడంతో కథ ముగుస్తుందని అంతా అనుకుంటారు. కానీ, హేలీ వాస్తవ పరిస్థితులను మరింత దగ్గర గా చూపే ప్రయత్నం చేస్తాడు. బానిసత్వం నుంచి విము క్తి తర్వాత కూడా ఆఫ్రికన్–అమెరికన్ కుటుంబాలు భూమి, విద్య, ఉపాధి, సామాజిక గౌరవం కోసం పోరాడాల్సి వచ్చింది. టామ్ కుమార్తె సింథియా విల్ పాల్మర్‌ను వివాహం చేసుకుంటుంది. వారి కుమార్తె బెర్తా కళాశాల కు వెళ్లే కుటుంబంలోని తొలి వ్యక్తిగా ఎదుగుతుంది. అ నంతర కాలంలో హేలీని బెర్తా సైమన్ వివాహం చేసుకుంటుంది. వారి కుమారుడే అలెక్స్ హేలీ. అంటే కుం టా కథ ఒక వ్యక్తి బానిసత్వంలో పడిపోవడంతో ప్రారంభమై, అతని వారసుల్లో ఒకరు తన కుటుంబ చరిత్రను రాయడానికి కూర్చోవడంతో ముగుస్తుంది. ఇది వలయాకార నిర్మాణం. బానిసత్వం కుంటా నుంచి అతని పేరు తీసుకుంది. రచన మాత్రం ఆ పేరు ను తిరిగి చరిత్రలోకి తీసుకొచ్చింది. బానిస కుటుంబాల మూలాలు వెతకడం, అందునా, అనేకానేక పేర్లు మారిన ఒక కుటంబ వివరాలను సేకరించడం అనుకున్నంత సు లభం కాదు. ఆ పనిని హేలీ సమర్థంగా నిర్వహించాడు. వాస్తవాల ఆధారంగా కథను సిద్ధం చేసుకొని, 'రూట్స్'ను పూర్తి చేశాడు. ఒక రకంగా ఇది చరిత్ర మూలాల్లోకి వెళ్లే రచన.

– సత్యశ్రీ

# 'అవాస్తవం, నిందాపూర్వకం'

**'జనచంద్రోదయం' పాటల సంపుటి రచయితపై వ్యాఖ్యలు ఖండన**

కమ్యూనిస్టు పార్టీకి వందేళ్ళు నిండిన సందర్భంలో దేశవ్యాపితంగా సభలు, సమావేశాలు, ఉత్సవాలు జరుపుకుంటున్న సందర్భంలో నేను వందపాటలతో ''జనచంద్రోదయం'' పేరుతో పుస్తకం ప్రచురించాను. ఆ పుస్తక ఆవిష్కరణ సభకు ప్రముఖులు చాలా మంది హాజరై, అభినందించారు.

కానీ, ఈ మధ్యనే ''అవును గేయ సంపుటి చంద్రోదయం'' అంటూ డాక్టర్ తంగెళ్ళ శ్రీదేవి అవాస్తవిక, నిందాపూర్వక వ్యాఖ్యలతో విమర్శను పత్రికలో రాశారు. అందులో డాక్టర్ ఎస్‌వి సత్యనారాయణ గారి పాటలను అనుసరించి, కాపీ కొట్టి పుస్తకంలో అచ్చు వేయించినట్లు రాయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. నేను కాపీ కొట్టినట్లు పేర్కొనినవి కొన్నింటి ప్రస్తావిస్తున్నాను.

పూల సీరే గట్టి ఎర్రా రైకే తొడిగి
సర్రు సర్రున రావే ఓ మర్దల్ పిల్లా
సరాసీసలు దేవే ఓ ముద్దులగుల్ల
ఎర్ర ఎర్రని ఒళ్ళు నల్లనల్లని కళ్ళు
జామపండ్లా పెదాలే మర్దల్ పిల్లా
పాడు పడవె పదాలే ముద్దుల గుల్లా

ఇది ఎస్.వి. సత్యనారాయణ గారి గీతం

పట్టు చీరేగట్టి పట్టురైకే తొడిగి
చెంగు చెంగున రావే నా మర్దల్ పిల్లా
బోనమెత్తగా రావా నా ముద్దుల పిల్లా

అందమైన ఒళ్ళు నల్లనల్లని కళ్ళు
దొండపండు పెదాలే నా మర్దల్ పిల్లా
బిర్రుబిర్రున రావే నా మర్దల్ పిల్లా
ఇది గడ్డమీది చంద్రమోహన్ గౌడ్ (జన చంద్రోదయంలోనిది)

ఇంకోపాట
జాతరంటే జాతర మాంకాళి జాతర
మన గౌలిపురం కెళుదామే మాంకాళి జాతర–ఇది ఆచార్య ఎస్వీది

దీన్ని కాపీ కొట్టి
జాతరంటే జాతర మేడారం జాతర
సమ్మక్కసారక్కలు వెలసిన జనజాతర గీతం రాశాడంటూ... పొంతనలేని ఆరోపణ చేయడం తెలివిమాలిన పోలికలా ఉంది. ఎందుకంటే గౌలిపురం జాతరకు మేడారం జాతరకు ఏమైనా పోలిక పొంతన ఉందా?

అదేవిధంగా సాధారణంగా బోనాల పండుగకు మహిళలు పట్టు వస్త్రాలు ధరించి బోనం ఎత్తుకొని పోతురాజులు ఆడంగా ఆడుగులేస్తూ.... బోనం సమర్పించడానికి వెళ్ళుతారు. మన దేశంలో ఎవ్వరిని చూసినా మనుషుల కళ్ళు (నయనములు) నల్లగానే ఉంటాయి. అదేవిధంగా మర్దల్‌కు పర్యాయపదం ఏరేమంటారో మరి పరిశోధన చేసి చెప్పాలీ పెద్దావిడ.

నిజానికి మా మేనమామ కూతురు యాదిలో గీసుకున్న ప్రేమ గీతం చాలా అందంగా ఉంటుంది. ఎర్రని పెదవులు, నల్లని కళ్ళు కలిగి ఉన్నందుకు ఎర్రని దొండపండుతో పోల్చుకొని రాసుకున్నాను.

అదేవిధంగా
కలిసి పని చేద్దాం కామ్రేడా
గతమెంతో ఘనకీర్తి గలవోడా
కలిసి పని చేద్దాం కామ్రేడా
గతమెంతో ఘనకీర్తి గలవోడా
పెనుగాలి వీచింది పాపము పండింది
భవిష్యత్ మనదే కామ్రేడా
బాధలుండవిక కామ్రేడా

గతంలో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ చరిత్రను గొప్పతనాన్ని కీర్తిస్తూ... ఉద్యమ పాటను వేములపల్లి శ్రీ కృష్ణ గారు రాసిన చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా గతమెంతో ఘనకీర్తి గలవోడా అనే పాటను బాణీగా తీసుకొని రాశాడని పేర్కొనడం మతిలేని మేధస్సులా కనిపిస్తున్నది. సిపిఐ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఎస్వీ మరియు కందిమళ్ళ భారతి (అన్నా వదిన)లు ఆవిష్కరించిన శతారుణ గీతాంజలి అనే సంకలనంలో కలిసి పని చేద్దాం కామ్రేడా పాట 75వ పేజీలో 25 గీతంగా ప్రచురించబడింది.

బాణీ అనేది జాతి సంపద ఇక పదం ఎవరి సంపద కాదు. ఎవరు కూడా పరిశోధనలు చేసి పదాలను సృష్టించలేదు. తెల్లపువ్వులు, నల్లనవ్వులు, ఎర్ర రైకే, తెల్ల రైకే మనం పుట్టకముందు నుంచే ఉన్నాయి. సర్రున రా, బిర్రున రా అనే పదాలు మాండలిక భాష ఒక ప్రాంతాన్ని బట్టి వాడుతుంటారు.

డాక్టర్ శ్రీదేవి రెడ్డి, నేను కాపీ కొట్టి గేయాలను ప్రచురించానని పేర్కొడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. విమర్శలు చేయడానికి అందరికీ హక్కు వుంది. కాని, నిందాపూరిత, అవాస్తవాలను రాయడం క్షమించనది. ఇటువంటి నిందాపూరిత విమర్శలు చేయడం మానుకోవాలని డాక్టర్ శ్రీదేవి గారికి సలహా ఇస్తున్నాను.

**– గడ్డమీది చంద్రమోహన్ గౌడ్**
**అరసం హైదరాబాద్ శాఖ**
**ప్రధాన కార్యదర్శి**

చంద్రమోహన్ గౌడ్ పాటల సంపుటిపై సమీక్షను, కొన్ని గేయాలపై వచ్చిన వ్యాఖ్యానాలను ప్రచురించిన మేము, ఆవ్యాఖ్యలకు రచయిత సమాధానాన్ని పైన ప్రచురించాం. ఇంతటితో ఈ వివాదానికి ముగింపు పలుకుతున్నాం. పాఠకులు గ్రహించగలరు.

**– సంపాదకుడు**

# పరిచయం అవసరం లేని సాహితీ మూర్తి




నేడు ఆరుద్ర జయంతి...

ఆరుద్ర.. పరిచయం అవసరం లేని సాహితీ మూర్తి. 1925, ఆగస్టు 31న విశాఖపట్నంలో జన్మించిన భాగవతుల సదాశివశంకర శాస్త్రి, సాహితీ లోకంలో ఆరుద్రగా సుప్రసిద్ధుడు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని ఇతివృత్తంగా తీసుకొని రాసిన 'త్వమేవాహం' (1949) కావ్యం చదివి 'ఇక నేను పద్యాలు రాయక పోయినా పరవాలేదు' అని మహాకవి శ్రీశ్రీ ప్రశంసించాడంటే, ఆరుద్ర స త్తా ఏమిటో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రశం స శ్రీశ్రీ అనంతరం సమాజంపై తనదైన, బలమైన ముద్ర వేసిన కవిగా పేరు పొందిన ఆరు ద్ర అభ్యుదయకవి, పండితుడు, పరిశోధకు డు, నాటకకర్త, విమర్శకుడు. ఈయన భార్య కె.రామలక్ష్మి కూడా ప్రముఖ తెలుగురచయిత్రి. విశాఖపట్నం ఎవిఎన్ కాలేజీ ఉన్నత పాఠశాల, విజయనగరం ఎంఆర్ కళాశాలలో విద్యాభ్యాసం చేసిన ఆరుద్ర, క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో చదువుకు స్వస్తి పలికాడు. 1943–47 మధ్యకాలంలో రాయల్ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో గుమస్తాగా పనిచేశాడు. ఆ తర్వాత కొంతకాలం సంగీతంపై దృష్టిని నిలిపాడు. 1947–48లో చెన్నై నుంచి వెలువడే ప్రముఖ వారపత్రిక 'ఆనందవాణి'కి సంపాదకుడిగా వ్యవహరించాడు. అభ్యుద య రచయితల సంఘం (అరసం) వ్యవస్థాపకుల్లో ఒకడైన ఆరుద్ర ఆ సంస్థ అభివృద్ధికి ఎంతో కృషి చేశాడు. ఆరుద్ర మహాకవి శ్రీశ్రీకి మేనల్లుడి వరుస. ప్రముఖ రచయిత చాగంటి సోమయాజులు (చాసో) నుంచి మార్క్సిస్టు భావాలను, శ్రీశ్రీ నుంచి అత్యాధునిక కవితా రీతులను తనలో ఇముడ్చుకున్న ఆరుద్ర, చెన్నై వచ్చిన ఆరుద్ర కొంతకాలం పాటు చాలా కష్టాలు అనుభవించాడు. తినడానికి తిండిలేక పానగల్ పార్కులో నీళ్ళు తాగి కడుపు నింపుకోవల్సి వచ్చిన సందర్భాలున్నాయని స్వయంగా చెప్పుకున్నాడు. అయితే, ఇలాంటి సమస్యలేవీ ఆయన సాహిత్య సేవకు అడ్డం రాలేదు. నెలకొకటి చొప్పున రాస్తానని ప్రతిజ్ఞ చేసి డిటెక్టివ్ నవలలనుంచి మళ్ళీ అదే ప్రతిజ్ఞతో 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' సంపుటాల వరకు ఆవ్న్నో రచనలు చేశాడు. ఆయన స్పృశించని సాహిత్య ప్రక్రియగానీ, ఆయన అడుగుపెట్టని సాహితీ శాఖగానీ లేదు. వందలాదిగా గేయాలు , గేయ నాటికలు , కథలు, నవలలు, సాహిత్య పరిశోధక వ్యాసాలు, వ్యంగ వ్యాసాలు, పుస్తకాలకు పీఠికలు, పుస్తకాలపై విమర్శలు రాశాడు. సినీ గేయరచయితగా రాణించాడు. ఇంతటి వైవిధ్యంగల సాహిత్యోత్పత్తి చేసిన వారు అరుదు. తెలుగు సాహిత్య ప్రపంచానికి ప్రాపంచిక దృష్టితోపాటు భౌతిక దృక్పథాన్ని పరిచయం చేసిన సాహితీ ఉద్యమం అభ్యుదయ సాహిత్యం. అభ్యుదయ సాహిత్యంలో పరిచయం అవసరం లేని సాహితీ మూర్తుల్లో ఆరుద్ర ఒకడు. వివిధ రంగాల్లోనే కాక వివిధ ప్రక్రియల్లో ఆరితేరిన అరుదైన వ్యక్తి ఆరుద్ర. 'త్వమేవాహం', 'సినీవాలి', 'కూనలమ్మ పదాలు', 'ఇంటింటి పద్యాలు' వంటి అనేక కావ్యాలతో పాటు వెన్నెల వేసవి , దక్షిణవేదం, జైలుగీతాలు వంటి అనువాద రచనలు రాదారి బంగళా, శ్రీకృష్ణదేవరాయ , కాటమరాజు కథ వంటి అనేక రూపకాలుతో పాటు కొన్నికథలనూ, నవలలనూ కూడా రచించాడు. సమగ్ర ఆంధ్ర సాహిత్యం (14 సంపుటాలు) ఆరుద్ర పరిశోధనాదృష్టికి పరాకాష్ట. దీనికోసం మేధస్సును, ఆరోగ్యాన్ని పణంగా పెట్టాడు. 'వేమన వేదం', 'మన వేమన' వ్యాస పీఠం', 'గురజాడ గురు పీఠం', 'ప్రజాకళలో ప్రగతివాదులు' వంటి సాహిత్య విమర్శనా గ్రంథాలు వెలువరించాడు. 'రాముడికి సీత ఏమవుతుంది', 'గుడిలో సెక్స్' తదితర రచనలు ఆరుద్ర పరిశీలనా దృష్టికి తార్కాణాలు. సంగీతం పైనా, నాట్యం మీద రచించిన అనేక వ్యాసాలు ఇతర కళల్లో ఆరుద్ర అభినివేశాన్ని పట్టి చూపిస్తాయి. చదరంగంపైన కొన్ని దశాబ్దాలకు పూర్వమే ఒక గ్రంథాన్ని ప్రకటించడం ఆరుద్రలోని మరో ప్రత్యేకత. బహుముఖప్రజ్ఞతో తెలుగు సాహితీ వనాన్ని సుసంపన్నం చేసిన ఆరుద్ర, 1998 జూన్ 4వ తేదీన భౌతికంగా మన నుంచి దూరమయ్యాడు. తన రచనల ద్వారా ఎప్పటికీ మనతోనే ఉండిపోతాడు.

# 'యాజ్ ఐ లే డైయింగ్'

అమెరికన్ రచయిత విలియం ఫాక్‌నర్ రాసిన ప్రముఖ ఆధునిక నవల 'యాజ్ ఐ లే డైయింగ్'. ఈఏడాది పబ్లిక్ డొమైన్‌లోకి వచ్చిన ఈ నవల ఫాక్‌నర్‌ను ప్రపంచ స్థాయి రచయితగా నిలబెట్టిన ముఖ్య రచనలలో ఒకటి. ఈ నవలలో అతను వినియోగించిన ప్రయోగాత్మక కథన శైలి దీనికి ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. కథ అమెరికాలోని గ్రామీణ ప్రాంతమైన యోక్నాపటాఫా కౌంటీ నేపథ్యంలో సాగుతుంది.

బండ్రెన్ కుటుంబానికి చెందిన ఆడీ బండ్రెన్ అనే తల్లి మరణిస్తుంది. తన జన్మస్థలంలోనే తన అంత్యక్రియలు జరగాలన్నది ఆమె చివరి కోరిక. ఆ కోరికను నెరవేర్చేందుకు బండ్రెన్ కుటుంబం ఆమె శవాన్ని తీసుకొని ప్రయాసభరితమైన ప్రయాణం మొదలుపెడుతుంది. ఆ ప్రయాణమే ఈ నవల యొక్క కేంద్ర బిందువు. ఈ నవలలో ఒకే కథను అనేక పాత్రల మనోభావాల ద్వారా చెబుతారు. మొత్తం నవల చిన్నచిన్న మోనోలాగ్స్ రూపంలో ఉంటుంది. ప్రతి పాత్ర తన దృష్టి కోణం నుంచి సంఘటనలను వివరిస్తుంది. ఈ శైలి వల్ల పాఠకుడు కథనే కాకుండా, పాత్రల మానసిక స్థితిని కూడా అనుభవిస్తాడు. పాత్రల విషయానికి వస్తే, ఆడీ బండ్రెన్ – మరణించిన తల్లి, అన్సే బండ్రెన్ – తండ్రి (స్వార్థపరుడు), క్యాష్ – పెద్ద కుమారుడు (ప్రాక్టికల్ మనస్తత్వం), డార్ల్ – లోతైన ఆలోచనలు కలిగిన కుమారుడు, జ్యూవెల్ – ఆవేశపరుడు, డ్యూయీ డెల్ – కుమార్తె, వర్దమన్ – చిన్న కుమారుడు. ఈ పాత్రలే తమతమ కోణంలో సంఘటనను చూస్తాయి. పాఠకుడికి వివరిస్తాయి. కుటుంబ బంధాల సంక్లిష్టత, స్వార్థం, కర్తవ్యం, పేదరికం, గ్రామీణ జీవితాలను ఆవిష్కరించిన ఈ పుస్తకం, మనుషుల మనస్సు లోతులను కూడా చర్చిస్తుంది.




అయితే, సాధారణ కథనాన్ని ఆశించే వారికి ఇది కష్టంగా అనిపించవచ్చు. కానీ ఆధునిక సాహిత్యం, మానసిక విశ్లేషణ ఇష్టపడేవారికి ఇది ఒక గొప్ప అనుభవం. ఆధునిక ఇంగ్లీష్ సాహిత్యంలో ఈ పుస్తకం ఓ మైలురాయి. 'స్ట్రీమ్ ఆఫ్ కాన్సనెస్' శైలికి ప్రసిద్ధ ఉదాహరణ. ఈ పుస్తకానికి ఫాక్‌నర్‌కు నోబెల్ బహుమతి (1950) లభించింది. 'యాజ్ ఐ లే డైయింగ్' కేవలం ఒక కుటుంబ ప్రయాణ కథ మాత్రమే కాదు... ఇది మానవ జీవితంలోని బాధ, స్వార్థం, ప్రేమ, అర్థరహితతపై లోతైన అధ్యయనం. ఓపికతో చదివితే, ఈ నవల పాఠకుని ఆలోచనల్ని మార్చే శక్తి కలిగి ఉంటుంది.

## ఈ వారం కవితలు

### మార్పు కోసం ఢిల్లీ చలో




భగభగ మండే గుండెల నెత్తురు

పిడికిలి బిగించి ఇచ్చిన పిలుపు
బదలావ్ జరూరి హై... బదులావ్ జరూరి హై
ధగధగ మెరిసే ఎర్రని జెండా నెత్తి
భారత కమ్యూనిస్టు పార్టీ ఇచ్చిన పిలుపు..
చలో ఢిల్లీ చలో బదులావ్ జరోరీ హై.....

పల్లెలు పట్టనాల్ నగరాలన్నీ
వాడవాడలా మారుమోగగ
పాదయాత్రల పబ్బతి పట్టి
ఉరుములు మెరుపుల ఉగ్రరూపమై
దేశ రక్షణకు పిడికిలి బిగించి
మార్పు కోసమై కదం తొక్కుతూ
చలో... ఢిల్లీ చలో... బదులావ్ .. జరూరి హై.
ఢిల్లీ చలో బదులావ్ జరూరి హై...

॥ భగభగ మండే ॥

వేషం మార్చి భాషను మార్చి
దేవుడు పేరుతో ఓట్లను పొందిన
మోదీ షాల గోముఖ వ్యాగ్రం
మొండి మాటలు జగమొండి చేష్టలు
మంకీ బాతుల మర్మము తెలిసెను
రాజ్యాంగానికి దేశభవితకు గండి కొట్టగా

యువత గుండెలు బీటలువారేను
దేశ ప్రజల కలల ప్రపంచం కుప్పకూలెను
పాలన పేరుతో పీడన చేస్తూ
దేశమంతట మత చిచ్చు పెట్టెను
మనిషి మనసులో విషము నింపెను
ప్రజాస్వామ్యమును బర్బాత్ చేసెను...
చలో ఢిల్లీ చలో.. బదులావ్ జరూరి హై.....
బద్లావ్ జరూరి హై.......

॥ భగభగ మండే ॥

రెక్కలు తొడిగిన పాలకహింస
మానవ హక్కుల ఖననం చేసెను
రైతు కంటిలో మేకులు దింపెను
పంట భూమిలో కన్నీరు ఉబికెను
న్యాయం కోసం పోరాటం చేసిన
విద్యార్థులపైనే లాఠీలెత్తేను

కార్మిక కర్షక మహిళల కిచ్చిన
హామీలన్నీ కొయ్యగుర్రమై తోక చూపెను...
పాలన మాటలు షొందనుగుంటవి
ప్రజల బతుకులు రోడ్డున పడ్డాయి
శాస్త్రీయ వాదం పక్కనపెట్టి
ఆధునికతకు తలుపులు మూస్తూ
సనాతన ధర్మం ముందుకు తెచ్చెను
సెక్యులరిజాన్ని ప్రశ్నగా చెక్కెను...
చలో ఢిల్లీ చలో

॥ భగభగ మండే ॥

మేకిన్ ఇండియా స్లోగన్ ఇచ్చి
విదేశీ సరుకుల దిగుమతి చేస్తూ
రూపాయి విలువను బొంద పెట్టెను
ప్రశ్నించే గొంతుల వెంటాడుతూ
స్వేచ్ఛ హక్కుల నిర్బంధిస్తూ
అర్బన్ నక్సలైటంటు ముద్రవేసెను...

భారతదేశ ఆశయాలను హిందూ
మహా సముద్రములో కలిపి వేసెను...
మార్పునుకోరే శక్తులపైన నిర్బంధాలను
కురిపిస్తుంది దేశం ఇచ్చిన స్వేచ్ఛ హక్కుల
ఊపిరి తీస్తూ పాసవికంగా పాలిస్తుంది ...
చలో... ఎర్రసైన్యమై ఢిల్లీ చలో
చలో... కదం తొక్కుతూ ఢిల్లీ చలో
చలో ...మార్పును కోరుతూ ఢిల్లీ చలో
ఢిల్లీ చలో... బదలావ్.. జరూరి హై

– కెవిఎల్

### వఖ్త్ ఆయా...



నహీ చలేగా
నహీ చలేగా
యే నఫ్రత్ కా
సర్కార్
నహీ చలేగా

పదండి కామ్రేడ్స్
పదండి
రామ్ లీలా
మైదాన్‌లో
జంగ్ చేద్దాం
పదండి కామ్రేడ్స్ పదండి

ఆకాశాన్నంటే ధరలు
పాతాళంలోకి పడదోస్తున్నవి
పేదల బ్రతుకులు

ప్రశ్నిస్తే కమ్యూనిస్టులంటరు
ఉద్యమిస్తే అరెస్టులంటరు
రాజ్యాంగాన్ని నడుం విరుస్తున్నరు
ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నరు

చలో కామ్రేడ్ చలో

బస్ బర్ కే చలో
రైలు బర్ కే చలో
పైసా నహీ తో పైదల్ పే చలో

గల్లీ గల్లీ సే చలో
ఢిల్లీ తక్ చలో
నఫ్రత్... నా ఇన్సాఫ్.. ఫైలానే కా
యే సర్కార్ కో
బదలావ్ జరూరి హై
బదల్ నే తక్ చలో

– బొమ్మగాని నాగభూషణం

# పుష్కరాలు అంటే తెలంగాణ..
# తెలంగాణ అంటే గోదావరి పుష్కరాలు

- వైభవంగా గోదావరి పుష్కరాలు నిర్వహిస్తాం: మంత్రి కొండా సురేఖ
- ప్రజాభవన్‌లో ప్రత్యేక అధికారి కార్యాలయం ప్రారంభం.. రూ.1,000 కోట్లతో ఏర్పాట్లు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వచ్చే ఏడాది నిర్వహించనున్న గోదావరి పుష్కరాలలో తెలంగాణ ప్రత్యేకత దేశవ్యాప్తంగా చాటేలా ఏర్పాట్లు చేయాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. 'గోదావరి పుష్కరాలు అంటే తెలంగాణ.. తెలంగాణ అంటే గోదావరి పుష్కరాలు' అనేలా పుష్కరాలను వైభవోపేతంగా నిర్వహించాలని సూచించారు. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు తెలంగాణ ఆతిథ్యం, సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనం ప్రతిబింబించేలా అన్ని ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు.గోదావరి పుష్కరాల ఏర్పాట్ల సమన్వయం కోసం ప్రజాభవన్ మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన ప్రత్యేక అధికారి కార్యాలయాన్ని శనివారం మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించి, నూతన కాన్ఫరెన్స్ హాలులో దేవాదాయ శాఖ అధికారులు, ఇంజనీర్లు, ఆర్కిటెక్ట్‌లు, కాంట్రాక్టర్లతో పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.

**రూ.1,000 కోట్లతో పుష్కరాల ఏర్పాట్లు..**

వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు గోదావరి పుష్కరాలు నిర్వహించనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనలు, సలహాల మేరకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేపడుతోందని మంత్రి తెలిపారు. పుష్కరాల నిర్వహణకు సిఎం రూ.1,000 కోట్ల నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. గతంలో సరస్వతి నది ఆది, అంత్య పుష్కరాలను వైభవంగా నిర్వహించిన తరహాలోనే గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. వివిధ ప్రభుత్వ శాఖలు, జిల్లా యంత్రాంగం, స్థానిక సంస్థలు, దేవాదాయ శాఖల మధ్య సమన్వయానికి ప్రత్యేక అధికారి కార్యాలయం కేంద్ర బిందువుగా పనిచేస్తుందని సురేఖ తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఘాట్ల నిర్మాణం, మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీరు, రవాణా, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా వంటి అంశాలపై ఈ కార్యాలయం నిరంతరం సమన్వయం చేస్తుందని చెప్పారు.

**5 కిలోమీటర్లకు పైగా ఘాట్ల నిర్మాణం..**

గోదావరి పరివాహక ప్రాంతంలో ఇప్పటికే ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఘాట్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు మంత్రికి వివరించారు. టైర్ 1, టైర్ 2 పరిధిలో సుమారు 2 కిలోమీటర్ల మేర పనులు ప్రారంభమయ్యాయని, మొత్తంగా టైర్ 1, 2, 3 పరిధిలో 5 కిలోమీటర్లకు పైగా ఘాట్లు నిర్మించనున్నట్లు తెలిపారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ శాఖలకు నిధులు విడుదలయ్యాయని, మెడికల్, పోలీస్, టూరిజం శాఖలకు కూడా నిధులు మంజూరయ్యాయని అధికారులు వివరించారు. దశలవారీగా టెండర్లు నిర్వహిస్తూ నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పలు ఘాట్ల నమూనా చిత్రాలను మంత్రి పరిశీలించారు. గోదావరి పరివాహక ప్రాంతం తెలంగాణలో ఎక్కువగా ఉన్నందున పుష్కరాల ఏర్పాట్లను అత్యంత పకడ్బందీగా చేపట్టాలని మంత్రి ఆదేశించారు. పాత ఘాట్లను పటిష్టం చేయడంతో పాటు కొత్త ఘాట్లను కూడా నాణ్యతతో నిర్మించి, వచ్చే పుష్కరాల వరకు మన్నికగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌జెసి రామకృష్ణారావు, డిసి కృష్ణ ప్రసాద్, పలువురు దేవాదాయ శాఖ అధికారులు, ఉద్యోగులు, ఇంజనీర్లు, ఆర్కిటెక్ట్‌లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. ప్రజాభవన్‌కు చేరుకున్న మంత్రి సురేఖకు అర్చకులు, పండితులు వేదమంత్రోచ్ఛారణలతో ఘనస్వాగతం పలికారు.

# దివ్యాంగుల సంక్షేమంపై
# హామీలు అమలు చేయని బిఆర్ఎస్

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దివ్యాంగుల సంక్షేమానికి సంబంధించి 2014, 2018, 2023 ఎన్నికల మ్యానిఫెస్టోల్లో బిఆర్ఎస్ ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని మంత్రి, సిఎల్‌పి మీడియా సెంటర్ ప్రతినిధి అడ్లూరి లక్ష్మణ్ ఆరోపించారు. ప్రభుత్వం కోల్పోయిన తర్వాతే బిఆర్ఎస్ నేతలకు దివ్యాంగులు గుర్తుకొచ్చారని విమర్శించారు. దివ్యాంగుల సమావేశం ఏర్పాటు చేసి మాజీ మంత్రి హరీశ్‌రావు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మంత్రి మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఏకవచనంతో సంబోధిస్తూ విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. దివ్యాంగులను బలవంతంగా సమావేశాలకు పిలిపించి ప్రభుత్వంపై విమర్శలు చేయించారని ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగుల కోసం రూ.50 కోట్లతో వాహనాలు, బ్యాటరీ వాహనాలు, ఇతర అవసరమైన పరికరాలను అందించామని అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. వచ్చే ఏడాది మరో రూ.50 కోట్లతో వాహనాలు అందించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. దివ్యాంగులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించామని, కొత్తగా పింఛన్లు కూడా మంజూరు చేస్తున్నామని వెల్లడించారు. పూర్తి అంగవైకల్యంతో జన్మించే చిన్నారులకు బాల్ భరోసా పథకం ద్వారా ప్రభుత్వమే పూర్తి ఖర్చు భరించి వైద్యం అందిస్తోందన్నారు. ఆర్‌టిసిలో దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చిస్తున్నామని చెప్పారు. దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ అందించాలన్న హామీకి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఆర్థిక సమస్యల కారణంగా పింఛన్ల పెంపు కొంత ఆలస్యం అవుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని చెప్పారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని పేర్కొన్నారు. 2014, 2018 ఎన్నికల సమయంలో బిఆర్ఎస్ మ్యానిఫెస్టోలో ఇచ్చి అమలు చేయని హామీలపై కెసిఆర్ సమాధానం చెప్పాలని అడ్లూరి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు రూ.3 వేల భృతి ఇస్తామని హామీ ఇచ్చి పక్కన పెట్టారని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి లక్ష ఎకరాలకు నీళ్లు ఇస్తామని చెప్పి ఒక్క ఎకరానికీ నీరు అందించలేదని విమర్శించారు. కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య అందిస్తామని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కొత్త యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తామని చెప్పి, చివరకు ఉస్మానియా యూనివర్సిటీకి కూడా తగిన నిధులు ఇవ్వలేదన్నారు. అదే సమయంలో తమ పార్టీ నాయకుల ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చారని విమర్శించారు. ఎస్‌టిలకు 12 శాతం రిజర్వేషన్లు, చట్టసభల్లో మహిళలకు 30 శాతం రిజర్వేషన్లు, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి అమలు చేయలేదని ఆరోపించారు.

**పాలనపై చర్చకు సిద్ధం..**

రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని, ఇప్పటికే అనేక ప్రాంతాల్లో పనులు ప్రారంభమయ్యాయని అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. తమ ప్రభుత్వ 1,000 రోజుల పాలనపై పోరాటం చేస్తామని కెటిఆర్ అంటున్నారని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కెటిఆర్, హరీశ్‌రావులు అసెంబ్లీకి వచ్చి చర్చించాలని సవాల్ చేశారు. పదేళ్లపాటు దివ్యాంగుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ఏనాడూ ఆలోచించలేదని, ప్రభుత్వం కోల్పోయిన తర్వాతే ఆ వర్గం గుర్తుకొచ్చిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విమర్శించారు.

## 'ఇందిరమ్మ టవర్స్'లో 1920 మంది లబ్ధిదారుల ఎంపిక

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'ఇందిరమ్మ ఇల్లు టవర్స్' నిమిత్తం హైదరాబాద్‌లోని నాలుగు నియోజకవర్గాల్లో లాటరీ విధానంలో 1920 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. గృహ నిర్మాణ, రెవెన్యూ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో లబ్ధిదారుల సమక్షంలోనే లాటరీ ప్రక్రియను నిర్వహించారు. మూడవరోజు ఆదివారం శేరిలింగంపల్లి, మేడ్చల్, మలక్‌పేట, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో లాటరీ పక్రియ ముగియగా, సోవామరం నాడు మరో నాలుగు నియోజకవర్గాల్లో లాటరీ పక్రియను చేపట్టనున్నట్టు గృహ నిర్మాణ సంస్థ వెల్లడించింది. ఒక్కో నియోజకవర్గంలో 480 చొప్పున శేరిలింగంపల్లి, మేడ్చల్, మలక్‌పేట, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో మొత్తం 1920 ఇండ్లకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఇప్పటివరకు 12 నియోజక వర్గాల్లో ఇండ్ల కేటాయింపు లాటరీ ప్రక్రియ పూర్తయింది. సోమవారం సనత్‌నగర్, మహేశ్వరం, మల్కాజిగిరి, కార్వాన్ నియోజకవర్గాల్లో లాటరీ ప్రక్రియను చేపట్టనున్నట్టు గృహ నిర్మాణ సంస్థ అధికారులు తెలిపారు. 'ఇందిరమ్మ ఇల్లు టవర్స్' పథకంలో గోషామహల్, ఎల్.బి నగర్, ముషీరాబాద్, చంద్రాయణగుట్ట నియోజకవర్గాల ప్రజల నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు 'మీసేవ' ద్వారా దరఖాస్తులను సమర్పించవచ్చని గృహ నిర్మాణ సంస్థ అధికారులు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశానికి కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఉద్యోగుల శ్రమకు తగిన వేతనాలు అందించడంతో పాటు వారి హక్కులను ప్రభుత్వం పరిరక్షించాలని అన్నారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. నరసింహ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం జారీ చేసిన జిఓలు 1195, 1190, 1187 ప్రకారం పెంచిన కనీస వేతనాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేతన సవరణ చేపట్టి ఉద్యోగులకు పెరిగిన వేతనాలు అందించాలని కోరారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు, హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిఓ నంబర్ 60 ప్రకారం పెరిగిన వేతనాలను అర్హులైన ఉద్యోగులందరికీ వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం జక్కు పద్మ, ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సరికొండ సురేష్‌గౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) నిధులను సమాజ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు సమర్థవంతంగా వినియోగించాలని అధికార యంత్రాంగం సూచించింది. ముఖ్యంగా విద్య, వైద్యం, మౌలిక వసతులు, పర్యావరణ పరిరక్షణ రంగాల్లో సిఎస్ఆర్ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. సిఎస్ఆర్ కింద చేపట్టే పనులను సంబంధిత శాఖలు, స్థానిక సంస్థల సమన్వయంతో అమలు చేయాలని సూచించారు. పాఠశాలలు, ఆసుపత్రులు, తాగునీరు, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ వంటి ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగించే కార్యక్రమాలకు నిధులను వినియోగించాలని తెలిపారు. కంపెనీలు తమ సిఎస్ఆర్ నిధులను పారదర్శకంగా, నాణ్యతతో వినియోగించేలా పర్యవేక్షణ చేపట్టాలని, చేపట్టిన పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులకు సూచించారు. సిఎస్ఆర్ ద్వారా చేపట్టే కార్యక్రమాలు దీర్ఘకాలికంగా ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని స్పష్టం చేశారు.

# కొలువుల ఎర.. రూ.కోట్లల్లో దందా!

- భద్రాచలంలో రూ.10 కోట్ల ఉద్యోగాల కుంభకోణం ఆరోపణలు
- ఎమ్మెల్యే పాత్రపై అనుమానాలు..
- ఉన్నతస్థాయి విచారణకు బిఆర్ఎస్ డిమాండ్



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేశారంటూ భద్రాచలం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై బీఆర్ఎస్ నాయకులు సంచలన ఆరోపణలు చేశారు. సుమారు రూ.10 కోట్ల మేర వసూళ్లు జరిగినట్లు ఆరోపిస్తూ, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రావులపల్లి రాంప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక తెలంగాణ టూరిజం హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ నాయకుడు మానే రామకృష్ణతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా ఉండాల్సిన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం పైరవీలు, అక్రమ వసూళ్లకు కేంద్రంగా మారిందని ఆరోపించారు. ప్రభుత్వం, ప్రైవేటు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి (సిసి) నిరుద్యోగుల నుంచి భారీగా నగదు వసూలు చేసినట్లు బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. క్యాంప్ కార్యాలయంలోనే ఈ వ్యవహారం జరుగుతుంటే ఎమ్మెల్యేకు తెలియకుండా ఇంత పెద్ద మొత్తంలో వసూళ్లు ఎలా జరిగాయని వారు ప్రశ్నించారు. రూ.10 కోట్ల ఉద్యోగాల కుంభకోణం ఆరోపణలపై ఉన్నతాధికారులతో నిష్పక్షపాత విచారణ జరిపించాలని బిఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తితోపాటు సంబంధితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తనకు ఈ వ్యవహారంతో ఎలాంటి సంబంధం లేదని ఎమ్మెల్యే భావిస్తే, ఆరోపణలు ఎదుర్కొంటున్న సీసీపై స్వయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని రాంప్రసాద్ డిమాండ్ చేశారు. బాధితులకు డబ్బులు తిరిగి ఇప్పించే వరకు వారి తరపున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలు భద్రాచలం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యవహారంపై ప్రభుత్వం, పోలీసులు, ఎమ్మెల్యే ఏ విధంగా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

## నేపాల్ వరద విపత్తు నేపథ్యం
# అధికారులు నిరంతర సమన్వయం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నేపాల్ వరద విపత్తు నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన వ్యక్తుల ఆచూకీ, వారి సురక్షిత తరలింపు, పార్థివదేహాల గుర్తింపు, స్వదేశానికి తరలింపు అంశాలపై తెలంగాణ భవన్ అధికారులు నిరంతరం సమన్వయంగా వ్యవహరిస్తున్నారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, కాఠ్మాండూలోని భారత రాయబార కార్యాలయం, నేపాల్ పోలీసులతో నిరంతర సమన్వయం కొనసాగిస్తున్నట్టు తెలంగాణ భవన్ అధికారులు తెలిపారు. భారత విదేశాంగ శాఖ అధికారుల వివరాల ప్రకారం ఆగస్టు 29న 449 మంది భారతీయులు టిబెట్ నుంచి నేపాల్‌కు చేరుకున్నారు. ఆగస్టు 30న మరో 397 మందిని ఈ మార్గం ద్వారా తరలించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ జాబితాలో తెలంగాణకు చెందిన అల్లి ఐయిలేష్ పాస్‌పోర్ట్ వివరాలు తెలంగాణ భవన్ వద్ద ఉన్న రికార్డులతో సరిపోలాయి. ఆయన ఆదివారం రాత్రి వరకు హైదరాబాద్‌కు చేరుకునే అవకాశముందని ఐయిలేష్ కుటుంబ సభ్యులు తెలియజేసినట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి. నేపాల్‌లో మృతుల ఛాయాచిత్రాలు, ప్రాథమిక వివరాలను నేపాల్ పోలీసుల డిజాస్టర్ పోర్టల్‌లో అందుబాటులో పెట్టారు. రసువా, నువాకోట్, ధాదింగ్, చిత్వన్, గోర్ఖా, తనహూన్, నావల్పరాసీ తూర్పు, నావల్పరాసీ పశ్చిమ, కాఠ్మాండూ జిల్లాల్లో భద్రపరిచిన పార్థివదేహాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. నేపాల్ పోలీసుల ప్రకారం, కుటుంబ సభ్యులు ప్రత్యక్షంగా గుర్తించగలిగిన సందర్భాల్లో డిఎన్ఏ పరీక్ష తప్పనిసరి కాదని, మృతుడితో బంధుత్వాన్ని నిర్ధారించే ఆధారాల మేరకు పార్థివదేహాలను సంబంధిత కుటుంబాలకు అప్పగిస్తారు. ప్రత్యక్ష గుర్తింపు సాధ్యం కాని సందర్భాల్లో మాత్రమే తల్లిదండ్రులు, సోదరులు లేదా సోదరీమణులు వంటి తొలి స్థాయి బంధువుల డీఎన్ఏ ప్రొఫైల్‌ను సరిపోల్చే ప్రక్రియను చేపట్టనున్నారు. ఇందుకు బంధువులు తప్పనిసరిగా నేపాల్‌కు వెళ్లాల్సిన అవసరం లేదని, స్వస్థలంలో సిద్ధం చేసిన డీఎన్ఏ ప్రొఫైల్‌ను సమర్పించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీనికి సంబంధించిన ఈమెయిల్ విధానాన్ని నేపాల్ పోలీసులు సిద్ధం చేస్తున్నారు. పార్థివదేహాల గుర్తింపు, అప్పగింత, స్వదేశానికి తరలింపునకు సంబంధించిన సమగ్ర విధివిధానాలను నేపాల్ అధికారులు ఖరారు చేస్తున్నారు. దీనికి సంబంధించిన పూర్తి విధివిధానాలు ఖరారు కావాల్సి ఉన్నది. పరీక్షలు చేయించుకునే ముందు లేదా గుర్తింపు కోసం నేపాల్‌కు ప్రయాణించే ముందు తెలంగాణ భవన్, భారత రాయబార కార్యాలయంతో సంప్రదించి అవసరమైన సూచనలు పొందాలని అధికారులు సూచించారు.

# ఆటో డ్రైవర్లను మళ్లీ మోసం చేస్తే సహించం

- నిర్లక్ష్యం వహిస్తే అసెంబ్లీ, సచివాలయం, సిఎం ఇంటిని ఆటో క్యాబ్‌లతో దిగ్బంధిస్తాం
- తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం డిమాండ్ చేశారు. హామీల అమలులో కాలయాపన చేస్తూ గతంలో మాదిరిగా నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించి ఆటో డ్రైవర్లను మరోసారి మోసం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అవసరమైతే అసెంబ్లీ, సచివాలయం, ముఖ్యమంత్రి నివాసాన్ని ఆటోలు, క్యాబ్‌లతో దిగ్బంధిస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో ఆటోడ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్న బి.వెంకటేశం తదితర యూనియన్ నేతలను వివిధ ఆటో సంఘాల నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలను పెంచుతామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే రవాణా కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు, ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సహాయం, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆటో యాప్ నిర్వహణతో పాటు ఇతర సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ హామీలన్నింటినీ ప్రభుత్వం త్వరితగతిన అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రభుత్వం ఊహించని రీతిలో ఉద్యమాలను చేపడతామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు ఎ.బిక్షపతి యాదవ్, మున్నూరు కృష్ణ, సిహెచ్.జంగయ్య, ఎస్.అశోక్, భాస్కర్, ఘనీ, ఎండి.ఖాజా, ఎం.నరసింహ, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# భూమిని ప్రైవేటు వ్యక్తికి కట్టబెట్టేందుకు కుట్ర

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్, అజామాబాద్‌లో రూ.500 కోట్ల విలువ చేసే ఆయిల్‌ఫెడ్ భూమిని ఒక ప్రైవేటు వ్యక్తికి రూ.87 కోట్లకే కట్టబెట్టేందుకు భారీ కుట్ర జరుగుతోందని బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. ఈ భూమి కోసం రూ.87 కోట్లను చెల్లించేందుకు ప్రభుత్వ రంగ ఆయిల్ ఫెడ్ సంస్థ సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రైవేట్ వ్యక్తికి అప్పగించడం వెనుక ఉన్న కుంభకోణం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే అక్రమ భూకేటాయింపును రద్దు చేసి, ఆ భూమిని ఆయిల్‌ఫెడ్‌కు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు ఆదివారం బహిరంగ లేఖ రాశారు. రూ 500 కోట్ల విలువైన ప్రభుత్వ తెలంగాణ ఆయిల్‌ఫెడ్ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు దారాధత్తం చేయడాన్ని ఖండిస్తున్నామని, దశాబ్దాలుగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఆస్తులను కమీషన్ల కోసం ప్రైవేటుపరం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, రియల్ ఎస్టేట్ ఏజెన్సీగా మారిపోయిందన్నారు.

అజామాబాద్‌లో ఆయిల్ ఫెడ్ ఆధీనంలో ఉన్న 3 ఎకరాల 23 గుంటల (15,984 గజాలు) భూమిని లాక్కోవడం దుర్మార్గమన్నారు. ఈ భూమిపైన 1987లో సుప్రీం కోర్టు ప్రైవేట్ సంస్థకు మొట్టికాయలు వేసి ప్రభుత్వానికే హక్కు ఉన్నదని స్పష్టం చేసినప్పటికీ, తమ కమీషన్ల కోసం కాంగ్రెస్ నేతలు సుప్రీం కోర్ట్ తీర్పులను తుంగలో తొక్కారని ఆరోపించారు.

పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఏనాడూ ప్రైవేట్ శక్తులకు తలొగ్గకుండా వందల కోట్ల రూపాయాల ప్రభుత్వ ఆస్తిని చిత్తశుద్ధితో కాపాడామని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పొట్టగొట్టి పల్లీలు, బఠానీల విక్రయించినట్టుగా పెద్దలకు వేల కోట్ల రూపాయాల విలువ చేసే భూములను విక్రయిస్తోందన్నారు. ఒకవైపు సామాన్యుల ఇండ్లను 22ఎ జాబితాలో పెట్టి వేధింపులకు గురిచేస్తోందని, మరోవైపు ఖరీదైన ప్రభుత్వ భూములను కమీషన్ల కోసం కారుచౌకగా ప్రైవేట్‌కు ధారాదత్తం చేస్తున్నారన్నారు.

కోకాపేట, రాయదుర్గం, గచ్చిబౌలిలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ దందా చేస్తోందని, ఇలా స్వార్థం కోసం ఇష్టారాజ్యంగా ఆస్తులు అమ్ముకుంటూ పోతే.. భవిష్యత్తులో గుడికి, బడికి, చివరికి స్మశానానికి కూడా రాష్ట్రంలో స్థలం మిగలబోదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల సొత్తును ప్రైవేటు వ్యక్తులకు దోచిపెడితే బిఆర్ఎస్ చూస్తూ ఊరుకోబోదని, ఈ నిర్ణయం వెనక్కి తీసుకునే వరకు మహా పోరాటం చేస్తామని హరీశ్‌రావు హెచ్చరించారు.

## నాటిన ప్రతీ మొక్క బతికి ఎదగడమే
# వనమహోత్సవ అసలు విజయం

- మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నాటిన ప్రతి మొక్క కూడా బతికి ఎదగడమే వనమహోత్సవ అసలు విజయమని, మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించాలని, సంరక్షణ చర్యలు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని అధికారులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. ప్రతి ఇంట్లో పండ్ల మొక్క పెంచడమంటే కేవలం పచ్చదనం మాత్రమే కాదని, ఆ కుటుంబ ఆరోగ్యానికి పెట్టుబడి పెట్టడమని అన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాలలో 91 శాతం మొక్కలను నాటామని ఆమె వెల్లడించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమ పురోగతిపై మంత్రి సీతక్క హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనర్ దివ్య దేవరాజన్, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మితో కలిసి జిల్లాల వారీగా మొక్కలు నాటడం, ఇంటి ఆవరణల్లో మొక్కల పంపిణీ, గుంతల తవ్వకం, మొక్కల మనుగడ తదితర వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది 6.18 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు 5.61 కోట్లకు పైగా (91 శాతం) మొక్కలు నాటినట్లు అధికారులు మంత్రికి వివరించారు. గుంతల తవ్వకంలో కూడా 92 శాతం పురోగతి సాధించామని వివరించారు. జిల్లాల పనితీరును సమీక్షించిన మంత్రి సీతక్క, నిర్దేశించిన లక్ష్యాల సాధనలో అధికారులు చూపుతున్న చొరవపై సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన లక్ష్యాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వనమహోత్సవంలో భాగంగా ఇంటి ఆవరణల్లో నాటేందుకు పెద్ద ఎత్తున మొక్కలను పంపిణీ చేస్తున్నామని, ముఖ్యంగా పండ్ల మొక్కలను ప్రతి కుటుంబానికి చేరవేసే కార్యక్రమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని సీతక్క తెలిపారు. వనమహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా, పచ్చని తెలంగాణతో పాటు ఆరోగ్యకరమైన తెలంగాణ నిర్మాణానికి ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ ఏడాది 2.75 కోట్ల పండ్ల మొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు. మారుతున్న జీవనశైలిలో పోషకాహారం ఎంతో అవసరమని, ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందడం అత్యంత ముఖ్యమన్నారు. జామ, ఉసిరి, మామిడి, సీతాఫలం, మునగ వంటి పండ్ల మొక్కలను ఇంటి వద్ద పెంచుకోవడం ద్వారా కుటుంబ సభ్యులకు తాజా, సహజమైన పోషకాహారం అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రతి ఇంట్లో పండ్ల మొక్క, ప్రతి గ్రామంలో విస్తారమైన పచ్చదనం ఉండేలా ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు.

## క్రీడా స్ఫూర్తితో తెలంగాణ పరుగు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** క్రీడా స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రం ఉర్రూతలూగింది. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన క్రీడా, ఫిట్‌నెస్ కార్యక్రమాలకు విశేష స్పందన లభించింది. ఖేలేగా భారత్–జీతేగా భారత్ నినాదంతో చేపట్టిన కార్యక్రమాల్లో యువత, విద్యార్థులు, మహిళలు, క్రీడాకారులు, క్రీడాభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్రంలోని 32 జిల్లాల కేంద్రాలతో పాటు హైదరాబాద్‌లోని వివిధ క్రీడా మైదానాలు, స్టేడియంలలో క్రీడా పోటీలు, ఫిట్‌నెస్ కార్యక్రమాలు నిర్వహించారు. ఆగస్టు 28న భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఆయన సేవలను స్మరించడంతో పాటు క్రీడల ప్రాధాన్యం, క్రీడాస్ఫూర్తిపై అవగాహన కల్పించారు. ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఏక్ ఘంటా ఖేల్ కే మైదాన్ మేన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేడుకల ముగింపు సందర్భంగా ఆగస్టు 30న స్పెషల్ సండేస్ ఆన్ సైకిల్, రన్‌లు, వాక్‌థాన్‌లు నిర్వహించారు. ప్రజల్లో ఫిట్‌నెస్, ఆరోగ్యంపై అవగాహన పెంచడంతో పాటు శారీరక దృఢత్వం, క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడమే కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అధికారులు తెలిపారు.

# నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
రూ. 131.61 కోట్లతో
అభివృద్ధి పనులకు శంకుస్థాపన





ప్రజాపక్షం/ ఖమ్మం : మధిర నియోజక వర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన వనరుల శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. రహదారులు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన తెలిపారు. ఆదివారం మధిర నియోజకవర్గ పరిధిలోని చింతకాని, బోనకల్ మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. రూ. 131.61 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. చింతకాని మండలంలో కోదుమూరు ఎస్‌సి కాలనీ అంతర్గత సిసి రోడ్ల నిర్మాణానికి, లచ్చగూడెంలో నూతన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనాలకు ఆయన శంకుస్థాపన చేశారు. లచ్చగూడెం నుంచి నేరడ పంచాయతీరాజ్ రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. చింతకాని, వందనం, లచ్చగూడెం, అనంతారం గ్రామాల్లో లింకు రోడ్లు, సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. నాగిలిగొండ ఎస్‌సి కాలనీలో సిసి రోడ్లకు తూటికుంట్ల నుంచి నాగిలిగొండ వరకు రోడ్డు నిర్మాణానికి భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. బోనకల్ మండలం నారాయణపురంలో పిఎసిఎస్ గోదాంను ఆయన ప్రారంభించారు. మోటమర్రిలో 300 మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణానికి, రాయన్నపేటలో అంతర్గత రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. కలకోట నుంచి రాపల్లి మీదుగా లక్ష్మీపురం గ్రామానికి రూ. 57 కోట్లతో నిర్మిస్తున్న రహదారి పనులను ఆయన పరిశీలించారు. రాపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన పలు సభల్లో భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్లడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రతీ సంక్షేమ కార్యక్రమాన్ని ప్రజల దరికి చేర్చడంతో పాటు విద్య, వైద్య రంగాల్లో రాష్ట్రాన్ని ముందుకు నడిపించడమే లక్ష్యంగా ఈ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ముఖ్యంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు పోతున్నట్లు ఆయన తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతతో నిర్వహించి అభివృద్ధి పనులు పలు కాలాల పాటు మన్నేల చూడాలని సూచించారు.

### శ్రమజీవులతో మాట ముచ్చట..

అభివృద్ధి పనుల పర్యటనలో భాగంగా ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క బోనకల్ మండలం రాయన్నపేటలో పొలాల్లో పనిచేస్తున్న మహిళల వద్దకు చేరుకుని మాట్లాడారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత విద్యుత్, గ్యాస్, ఉచిత బస్సు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సన్న బియ్యాన్ని తీసుకుంటున్నారా అని ఆయన అడిగి తెలుసుకున్నారు. మహిళలతో ఉప ముఖ్యమంత్రి ముచ్చటించడంతో మహిళలు ఆనందపరవశులయ్యారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నేడు ప్రజావాణి, గిరిజన దర్బార్

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : నేడు ఐడిఓసిలో ప్రజావాణి ఐటిడిఏలో గిరిజన దర్బార్ నిర్వహించనున్నట్లు ఆయా కార్యాలయాల అధికారులు తెలిపారు. దూరప్రాంతాల నుంచి ప్రజలు వారి సమస్యలు విన్నవించుకునేందుకు వస్తున్న నేపథ్యంలో అధికారులు సకాలంలో హాజరై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అధికారులపై నమ్మకంతో ఇక్కడ దాకా వచ్చే ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయరాదని చెప్పారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఖమ్మంలో నీట్ పిజి పరీక్ష

642 మంది విద్యార్థులు హాజరు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మంజిల్లాలో నీట్ పిజి (2026) పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసిందని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఏర్పాటు చేసిన నీట్ పిజి పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నీట్ పిజి పరీక్ష నిర్వహణ కు రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పూర్తి పారదర్శకతతో నిర్వహించినట్లు తెలిపారు. రెండు పరీక్షా కేంద్రాల్లో 668 మంది విద్యార్థులకు గాను 642 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు 26 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అదనపు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, అధికారులు పాల్గొన్నారు.

## వైరాలో అరుదైన గుడ్లగూబ



ప్రజాపక్షం/వైరా: ఖమ్మం జిల్లా వైరా మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం గ్రామంలో ఓ ఇంటి వద్ద బార్న్ గుడ్లగూబ కనిపించడం స్థానికంగా ఆసక్తిని రేకెత్తించింది. గ్రామానికి చెందిన ఆవుల ప్రవీణ్ ఇంటి వద్ద ఈ పక్షి కనిపించడంతో కుటుంబ సభ్యులు దానిని గుర్తించి ఫొటోలు తీశారు. తెల్లటి గుండె ఆకారంలో ఉన్న ముఖం, బంగారు–గోదుమ రంగు రెక్కలు, రెక్కలపై తెలైటి మచ్చలు ఈ గుడ్లగూబకు ప్రత్యేక గుర్తులుగా ఉన్నాయి. టైట్ ఆల్బగా పిలిచే బార్న్ గుడ్లగూబ తెలంగాణలో కూడా నమోదైన పక్షి జాతుల్లో ఒకటి. బార్న్ గుడ్లగూబ ప్రధానంగా ఎలుకలు, చుంచులు వంటి చిన్న క్షీరదాలు వేటాడుతుంది. అప్పుడప్పుడు చిన్న పక్షులు, కప్పలు, బల్లులు, ఇతర జీవులను కూడా ఆహారంగా తీసుకుంటుంది. అందువలన వ్యవసాయ ప్రాంతాల్లో పంటలను నష్టపరిచే ఎలుకలను సహజంగా నియంత్రించడంలో ఇది కీలకపాత్ర పోషిస్తుంది. వైరా పరిసరాల్లో వ్యవసాయ భూములు, చెట్లతో కూడిన ప్రాంతాలు, పాత ఇళ్లు, గోదాములు, ఉండటం వలన ఇలాంటి గుడ్లగూబలు కనిపించే అవకాశం ఉంది. సోమవరం గ్రామంలో ఆవుల ప్రవీణ్ ఇంటి వద్ద కనిపించడం కూడా ఇలాంటి సహజ ఆవాసాలకు సమీపంలో ఉండటం వల్లే అయి ఉండవచ్చని భావిస్తున్నారు.

## 'తలసేమియా' నిర్మూలనకు కృషి

సిటిసి అడిషనల్ డిసిపి విజయ్‌బాబు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : తలసేమియా వ్యాధి నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని సిటిసి అడిషనల్ డిసిపి ఇ. విజయ్ బాబు తెలిపారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ 16వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఖమ్మంలో ఘనంగా నిర్వహించారు. సంస్థ ఫౌండర్ అనిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ డిసిపి విజయ్‌బాబు మాట్లాడుతూ తలసేమియా బాధితుల సంఖ్యను తగ్గించేందుకు సంకల్ప సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. 16 ఏళ్లుగా సంస్థ తలసేమియా చిన్నారులకు అందిస్తున్న సేవలు మార్గదర్శనీయమన్నారు. రక్తం కొరతతో ఏ ఒక్క తలసేమియా చిన్నారి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో పోలీస్ శాఖ తరుపున ఎల్లప్పుడు పూర్తి సహకారం అందిస్తున్నామని భవిష్యత్తులోనూ తమ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. రక్తదానం చేయడం వల్ల ఒక ప్రాణాన్ని కాపాడవచ్చుననే అవగాహనను ప్రతీ ఒక్కరిలోనూ పెంచాలన్నారు. ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలను అధిగమిస్తూ పిల్లలు ఉన్నతమైన భవిష్యత్తును సాధించాలని తెలిపారు. సొంత కుటుంబ సభ్యుల సమస్యలను పట్టించుకోని ప్రస్తుత సమాజంలో సంకల్ప సేవా సంస్థ నిర్వాహకులు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం దాతలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నారాయణమూర్తి, డాక్టర్ లక్ష్మి దీప, సంస్థ ఉపాధ్యక్షురాలు పి. పావని, భాగ్య, మమత, అనురాధ, పి. రవిచందర్, పి. ఉదయ్‌భాస్కర్, ఆర్. కస్తూరి, పి. వంశీకిరీటీ, సువర్ణకుమారి, ఎఆర్ కానిస్టేబుల్ కృష్ణ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు అర్చరీ క్రీడాకారులు ఎంపిక



ప్రజాపక్షం/వైరా: ఉమ్మడి ఖమ్మం జిల్లా అర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైరాలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి అర్చరీ ఎంపికలు విజయవంతంగా ముగిశాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 65 మంది క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. క్రీడాకారుల ప్రతిభను పరిశీలించిన అనంతరం వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 24 మందిని రాష్ట్రస్థాయి అర్చరీ పోటీలకు ఎంపిక చేసినట్లు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షుడు వైరా ఎసిపి ఎస్.సారంగపాణి, కార్యదర్శి పుట్టా శంకరయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ, ఎస్సై పుష్పాల రామారావు తెలిపారు. ఈ సందర్భంగా వైరా ఎసిపి సారంగపాణి మాట్లాడుతూ...అర్చరీ క్రీడలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులకు సరైన శిక్షణ, నిరంతర సాధన, ప్రోత్సాహం అందిస్తే రాష్ట్రం, జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అనేక మంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని, వారిని గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత క్రీడా సంఘాలు, తల్లిదండ్రులు, సమాజంపై ఉందన్నారు.అనంతరం ఎంపికైన క్రీడాకారులను అసోసియేషన్ ప్రతినిధులు అభినందించి రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## జర్నలిస్టుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించం

ఇండ్ల స్థలాలు, సంక్షేమం కోసం పోరాటం
సెప్టెంబర్‌లో సభలు, సమావేశాలు
అక్టోబర్‌లో పోరాట కార్యాచరణ
ఐజెయు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాటేటి వేణుగోపాల్



ప్రజాపక్షం/ ఖమ్మం : జర్నలిస్టుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జర్నలిస్టులను సమీకరించి పోరుబాట పడతామని టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాటేటి వేణుగోపాల్ హెచ్చరించారు. జర్నలిస్టులు ఎప్పుడు అడిగినా ప్రభుత్వం కాదనడం లేదని కానీ పని కూడా పూర్తి చేయడం లేదని ఖమ్మంలో ప్రభుత్వం కేటాయించిన స్థలం ఉండి అర్హులైన జర్నలిస్టుల జాబితా అధికారుల వద్ద ఉన్నా కూడా నిర్ణయం తీసుకోవడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) నగర కమిటీ సమావేశం ఆదివారం స్థానిక మాంగళ్య ఫంక్షన్ హాల్‌లో జరిగింది. నగర అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేణుగోపాల్ మాట్లాడుతూ సుదీర్ఘ పోరాట చరిత్ర ఐజెయు సొంత మని పూర్వపు ఆంధ్రప్రదేశ్‌లో కానీ ఇప్పటి తెలంగాణలో కానీ జర్నలిస్టులకు అమలవుతున్న ప్రతీ సంక్షేమ పథకం ఐజెయు పోరాట ఫలితంగానే వచ్చిందన్నారు. హెల్త్ కార్డుల విషయంలో ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారని ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా హెల్త్ కార్డుల ద్వారా జర్నలిస్టులకు వైద్యం అందే ఏర్పాటు చేస్తామన్న హామీని ప్రస్తుత ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 400 మంది జర్నలిస్టులు అనారోగ్య కారణాలతో చనిపోయారని ఇప్పటికైనా అనారోగ్యం బారీన పడిన జర్నలిస్టులను ఆదుకునేందుకు హెల్త్ కార్డులను తక్షణం జర్నలిస్టులకు అందించాలన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో ముఖ్యంగా తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల్లో జర్నలిస్టులకు పింఛన్ స్కీంను అమలు చేస్తున్నారని రాష్ట్రంలో కూడా అమలు చేయాలని ఐజెయు డిమాండ్ చేస్తుందన్నారు. ఖమ్మం జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్య రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉందని ఐజెయు పోరాట ఫలితంగా 23 ఎకరాల స్థలాన్ని సొసైటీకి ఇస్తూ గత కేబినెట్ తీర్మానం చేసిందని దానిని జర్నలిస్టులకు అందించేందుకు సత్వరం చర్యలు చేపట్టాలన్నారు. ఐజెయు మంత్రుల హామీ మేరకు కొంత సమయం ఇచ్చామని మరింత తత్సారం చేస్తే పోరాట బాట పడతామన్నారు. సెప్టెంబర్ మాసంలో అన్ని నియోజక వర్గాల సమావేశాలను పూర్తి చేసుకుని అక్టోబర్‌లో ప్రభుత్వ తీరును బట్టి పోరాట కార్యాచరణ ప్రకటిస్తామని వేణుగోపాల్ తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, ఇండ్ల స్థలాల సాధన పూర్తి భద్రత లక్ష్యంగా ఐజెయు పని చేస్తుందన్నారు. ఈ సమావేశంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు నలజాల వెంకట్రావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు, రాష్ట్ర నాయకులు నర్వనేని వెంకట్రావు, మురారి, హౌజింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి మహేందర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నామా పురుషోత్తం, వీడియో జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అప్పారావు, నగర కోశాధికారి ఏలూరి వేణుగోపాల్, నాయకులు మాధవరావు, వివిధ పత్రికల బ్యూరోలు ఎస్‌కె మోహినుద్దీన్, సత్యనారాయణ, నగర కమిటీ సభ్యులు, వివిధ చానెళ్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గౌడల చిరకాల ఆకాంక్ష సాకారం

మాజీ ఎమ్మెల్సీ బాలసాని



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం జిల్లాలో గౌడల చిరకాల ఆకాంక్ష సాకారం కాబోతుందని మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మి నారాయణ తెలిపారు. ఆదివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాలసాని లక్ష్మి నారాయణ మాట్లాడుతూ రఘునాథపాలెం మండల కేంద్రంలో ప్రభుత్వం మంజూరు చేసిన స్థలంలో ఖమ్మం జిల్లా గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ నిర్మాణ పనులకు సోమవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా శంకుస్థాపన నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ నిధులతో నిర్మించే ఈ కమ్యూనిటీ హాల్ గౌడల ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. గౌడల చిరకాల ఆకాంక్ష సాకారం అవుతుండడం సంతోషకరమన్నారు. గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ తదితరులు సాకారం అందించారన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా అత్యాధునిక సౌకర్యాలతో ఖమ్మంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో గౌడ సంఘం జిల్లా నాయకులు కత్తి నెహ్రూ, మార్కం లింగయ్య, డి. శ్రీనివాస్, ఊడుగు రమేష్, సైదులు, గోపా శ్రీనివాస్, చింతల పాటి వెంకటేశ్వర్లు, డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, బోయనపల్లి లక్ష్మణ్, బండి నాగేశ్వరరావు, రాజు పాల్గొన్నారు.

## మార్పు కోసమే ఢిల్లీ పోరు యాత్ర

భద్రాద్రి జిల్లా నుంచి 500 మంది తరలింపు
హక్కుల సాధనకు పోరాటాలు తప్పవు
ఢిల్లీ వేదికగా ఉద్యమ కార్యచరణ
సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : దేశంలో మార్పు కోసమే ఢిల్లీ వేదికగా భారీ పోరాట యాత్ర, బహిరంగ సభ జరుగుతోందని, ఇందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి 500 మంది కార్మికులు, రైతులు, విద్యార్థులు, మహిళలు, తరలివెళ్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా తెలిపారు. జిల్లా నుంచి ఢిల్లీకి తరలివెళుతున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల రోజులుగా జిల్లాలోని గ్రామాలు, బస్తీలలో నిర్వహించిన ప్రచార కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. ఈ నెల 6 నుంచి 14 వరకు నిర్వహించిన జన చైతన్య యాత్రలతో ప్రజల్లో చైతన్యం పెరిగిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై రైతాంగం, కార్మిక వర్గం, విద్యార్థులు, మహిళలు ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఢిల్లీలో జరిగే పోరాటంలో జిల్లా ప్రతినిధులు క్రియాశీలకంగా పాల్గొంటారని, అక్కడ తీసుకునే నిర్ణయాల అమలుకు భవిష్యత్తులో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, జిల్లా నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీ కుమారి, ఉప్పుశెట్టి రాహుల్, కంచర్ల జమలయ్య, మువ్వా వెంకటేశ్వరరావు, డి.సుధాకర్, రాజబాబు, సర్పంచులు, కార్పోరేటర్లు, సర్పంఛ్‌లు తదితరులు పాల్గొన్నారు.


## ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/ ఖమ్మం : సెప్టెంబర్ 8, 9, 10 తేదీలలో యాదగిరిగుట్టలో జరిగే అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆదివారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, చింతల రమేష్ మాట్లాడుతూ మహాసభల సందర్భంగా యాదగిరిగుట్టలో సెప్టెంబర్ ఎనిమిదిన యువజన ప్రదర్శన ఉంటుందని ఖమ్మం జిల్లా నుంచి పెద్ద ఎత్తున యువతను సమీకరించనున్నట్లు ఆయన తెలిపారు. మహాసభల్లో దేశవ్యాప్తంగా యువత ఎదుర్కొంటున్న సమస్యలు దాని పరిష్కార మార్గాలపై చర్చించి పోరాట కార్యాచరణను రూపొందించుకోనున్నట్లు తెలిపారు. యువజన సమస్యల పరిష్కారంతో పాటు యువత మత్తుకు గురవుతూ విలువైన జీవితాలను కోల్పోతున్నారని దీనికి వ్యతిరేకంగా ఎఐవైఎఫ్ చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తుందని శ్రీనాథ్ రెడ్డి, రమేష్ తెలిపారు. ము ఖ్యంగా గంజాయి, డ్రగ్స్ యువత జీవితాన్ని ఛిద్రం చేస్తున్నాయని దీనికి వ్యతిరేకంగా గ్రామస్థాయి నుంచి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం లో ఎఐవైఎఫ్ నాయకులు దండి శ్రీజ, యమున, కృష్ణప్రసాద్, శ్రీకాంత్, వెంకట్, సైదులు, మామిడాల కిరణ్, అశోక్, రఫీ, గోగుల వెంకన్న, పగడాల చంద్రశేఖర్, భరత్, సతీష్ పాల్గొన్నారు.

## నిజాయితీ, క్రమశిక్షణే ఉద్యోగికి నిజమైన సంపద

కలెక్టర్ దివాకర టిఎస్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రజాసేవలో నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావం ఉద్యోగికి నిజమైన సంపద అని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన సేవలు అందించడంలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమన్నారు. రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో 31 ఏళ్ల పాటు సేవలు అందించి తహసీల్దార్ క్యాడర్‌లో ప్రస్తుతం కలెక్టరేట్ పరిపాలన అధికారిగా కారుమంచి శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అభినందన, సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి పాల్గొని శ్రీనివాసరావు దంపతులను ఘనంగా సన్మానించి ఆయన అందించిన సేవలు అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం కేవలం జీవనోపాధి కోసం చేసే ఉద్యోగం మాత్రమే కాదని ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి లభించే ఒక గొప్ప అవకాశమన్నారు. కారుమంచి శ్రీనివాసరావు 31 సంవత్సరాల ఉద్యోగ ప్రస్థానంలో వివిధ హోదాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలను అందించారని తెలిపారు. ముఖ్యంగా కార్యాలయ నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన, బాధ్యతాయుతంగా సహచర ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించడం ఆయన ప్రత్యేకత అన్నారు. ఉద్యోగ జీవితంలో కుటుంబ సభ్యుల సహకారం ఎంతో ముఖ్యమన్నారు. శ్రీనివాసరావు సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో ఆయన కుటుంబ సభ్యులు అందించిన సహకారం అభినందనీయమన్నారు. కారుమంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ తన ఉద్యోగ జీవితంలో సహకరించిన ఉన్నత అధికారులు, సహచర అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు సేవ చేసే అవకాశం కలగడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ రామ్మూర్తి, డిఎస్‌డిఒ సునీల్ రెడ్డి, డిఆర్‌డిఒ శ్రీరామ్, మైనార్టీ సంక్షేమ శాఖాధికారి ముజాహీద్, జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ పురందర్, ఉప కార్మిక శాఖ కమిషనర్ కె. విజయ్‌భాస్కర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు, శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నా రు.

## ట్రాక్టర్–బైక్ ఢీ: ఇద్దరు మృతి



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం: మట్టి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన విషాద ఘటన మండలంలోని బుచ్చిరెడ్డిపాలెం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. కళ్ల ముందే ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తుల వివరాల ప్రకారం... బుచ్చిరెడ్డిపాలెంలోని దేవాలయం వెనుక రోడ్డులో మట్టి లోడుతో ట్రాక్టర్ వెళ్తోంది. అదే సమయంలో పెసరమల్లి నాగరాజు(34), కొరకొప్పుల రమేష్(42)బైక్‌పై ఎదురుగా వస్తున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాద దాటికి బైక్‌పై ఉన్న ఇద్దరూ ట్రాక్టర్ కింద పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఎం.రమేష్‌కుమార్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. జెసిబి సహాయంతో ట్రాక్టర్‌ను తొలగించి మృతదేహాలను వెలికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన నాగారాజుకు భార్య, కుమారుడు, కూమార్తె ఉన్నారు. రమేష్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబాలకు అండగా ఉన్న ఇద్దరూ ఒకేసారి మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులకు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అనుకోని ప్రమాదంతో బుచ్చిరెడ్డిపాలెంలో విషాద వాతావరణం నెలకొంది.

## సెప్టెంబర్ ఒకటి నుంచి బిఆర్ఎస్ నిరసనలు: మాజీ మంత్రి పువ్వాడ



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : బిఆర్ఎస్ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతుందని, కాంగ్రెస్ విఫల పాలనపై చేపట్టే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని బిఆర్ఎస్ శ్రేణులకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ ఒకటి నుంచి 10 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై బిఆర్ఎస్ పార్టీ ప్ర త్యేక కార్యాచరణలో భాగంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పువ్వాడ తెలిపారు. ఖమ్మ ం, భద్రాది కొత్తగూడెం జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ప్ర భుత్వ వైఫల్యాలపై బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పువ్వాడ పిలుపునిచ్చారు.

## మైనింగ్ స్టాఫ్ హక్కుల సాధనలో ఎఐటియుసి పోరాటం అభినందనీయం

పివికె-5 ఇంక్లైన్ మైనింగ్ స్టాఫ్



ప్రజాపక్షం/చుంచుపల్లి: సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) మైనింగ్ స్టాఫ్ సమస్యల పరిష్కారం కోసం చేసిన పోరాటం ఫలితంగానే పలు కీలక డిమాండ్లపై యాజమాన్యం సానుకూలంగా స్పందించిందని పివికె5 ఇంక్లైన్ మైనింగ్ స్టాఫ్ పేర్కొన్నారు. గతంలో మైనింగ్ స్టాఫ్ తరపున నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టి, గని మేనేజర్‌తోపాటు కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్‌కు వినతిపత్రాలు అందజేస్తూ పోరాటంలో ముందుండిన ఎఐటియుసి నాయకులు, హెడ్ ఓవర్‌మెన్ అనిల్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్‌ఎల్‌సీతో జరిగిన చర్చల్లో మైనింగ్ స్టాఫ్ సమస్యలకు అధిక ప్రాధాన్యత కల్పించి హక్కులు సాధించేందుకు కృషి చేసిన ఎఐటియుసికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్ మైనింగ్ స్టాఫ్‌కు ఒవర్‌మెన్ ప్రమోషన్లు కల్పించడం, మైనింగ్ స్టాఫ్‌లో ఎంఎస్‌గా పనిచేస్తున్న అర్హులైన ఉద్యోగులకు సకాలంలో ప్రమోషన్లు అందించేలా యాజమాన్యం అంగీకరించడం ఎఐటియుసి పోరాట ఫలితమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి సాయి పవన్, ఎద్దు అనిల్, చందులాల్, మురళీకృష్ణ, ధీరజ్, గోవర్ధన్, గడప రాజయ్య, ఎఐటియుసి పివికె5 ఇంక్లైన్ ఫిట్ సెక్రటరీ భూక్యా రమేష్, సేఫ్టీ కమిటీ సభ్యులు రామచందర్, సొసైటీ సభ్యులు ఈర్ప కృష్ణ, వెంకట్, సురేందర్ రెడ్డి, రామచందర్, నాగేంద్ర, హరికృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, రామారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఫిజియో థెరఫీ క్లినిక్ ప్రారంభించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ప్రజాపక్షం/ధర్మసాగర్ : ధర్మసాగర్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన రిలీఫ్ ఫిజియో థెరఫీ క్లినిక్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫిజియో థెరఫీ క్లినిక్ వైద్యులతో కలిసి రిబ్బన్ కట్ చేసి లాంచనంగా ప్రారంభించారు. క్లినిక్‌లోని వైద్య పరికరాలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడతూ... మారుతున్న జీవనశైలి కారణంగా ప్రస్తుత రోజుల్లో చిన్న వయసులోనే నడుము నొప్పులు, మెడ నొప్పులు, కీళ్ల నొప్పులు మరియు పక్షవాతం వంటి సమస్యలతో బాధపడేవారి సంఖ్య పెరుగుతోందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఫిజియోథెరపీ వైద్యసేవలు స్థానికంగా అందుబాటులోకి రావడం అభినందనీయమని పేర్కొన్నారు. తక్కువ ఖర్చులోనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, క్లినిక్ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండలో రౌడీ షీటర్ల బైండోవర్: సిఐ



ప్రజాపక్షం/హనుమకొండ : హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు సీఐ మచ్చ శివకుమార్ కౌన్సిలింగ్ నిర్వహించారు. వచ్చే నెల నుంచి పండుగలు, జాతరలు, ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా రౌడీషీటర్లను పోలీస్ స్టేషన్కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లు ఎలాంటి భూ వివాదాలు, గొడవలు, చిన్నచిన్న తగాదాల్లో జోక్యం చేసుకోరాదని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం రౌడీషీటర్లను బైండోవర్ చేసినట్లు సీఐ శివకుమార్ తెలిపారు. పండుగలు, ఉత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుల నిఘా కొనసాగుతుందని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ గ్రామ కమిటీల ఎన్నిక ఏకగ్రీవం



ప్రజాపక్షం/కాటారం: మండలంలోని విలాసాగర్,కొత్తపల్లి,మద్దులపల్లి,గ్రామాల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తెప్పల దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల అధ్యక్షులుగా పూసల శశికాంత్,యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షునిగా రాజునాల నాగరాజు,మల్లారం మహేష్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా అల్లెరా నాగరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తెప్పల దేవేందర్ రెడ్డి,డిసిసి అధికార ప్రతినిధి పంతకాని సమ్మయ్య మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క సభ్యుడు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని,ప్రజల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి అంగజాల అశోక్,కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వంశీ,మండల అధ్యక్షుడు మాదవ రెడ్డి,నాయకులు చిటూరి మహేష్,కుంభం రమేష్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## నూతన సిఐ సతీష్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



ప్రజాపక్షం/టేకుమట్ల: చిట్యాల సర్కిల్ పరిధిలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ సతీష్‌ను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిప్పిరెడ్డి క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్‌లతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ సతీష్‌కు శాలువా కప్పి, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి పోలీసింగ్ అందించే సేవలకు తమవంతు పూర్తి సహకారం ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం ప్రెసిడెంట్ వీరేశం, బొద్దు తిరుపతి, నరేష్ రామకృష్ణ, పేరుమాండ్ల చంద్రశేఖర్, మొగిలి, కర్రె మల్లయ్య, పల్లిక దిలీప్ రెడ్డి, జక్కుల కుమార్, అంబాల కిరణ్, వంగ మమత, శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు మోతె రాజమౌళి, మాజీ ఎంపిటిసి సంగి రవి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బండ రగోత్తం రెడ్డి, అంది కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హామీలపై సమరభేరీ

ప్రజాపక్షం/వెంకటాపురం(నూగూరు) : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ వెంకటాపురం మండల అధ్యక్షుడు గంప రాంబాబు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సమరభేరి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళలకు 2,500, వృద్ధులకు, బీడీ కార్మికులకు రూ. 4వేల పింఛను, నిరుద్యోగులకు రూ. 6 వేల భృతి, విద్యార్థులకు స్కూటీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు రైతు భరోసా, రూ.2 లక్షల రుణమాఫీ, వరికి రూ.500 బోనస్, కూలీలు, ఆటో కార్మికులకు ఆర్థికసాయం వంటి హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద తులం బంగారం హామీని కూడా అమలు చేయలేదన్నారు. 1000 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను లెక్కలతో సహా ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వాన్ని నిలదీస్తామని గంప రాంబాబు పేర్కొన్నారు. సెప్టెంబర్ 2 నుంచి జరిగే సమరభేరి కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే ప్రజా పాలన లక్ష్యం

ముత్తారం - గట్ల నర్సింగాపూర్ - లంబాడీ తండా రహదారి అభివృద్ధికి రూ.3.74 కోట్లు

రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/భీమదేవరపల్లి: హుస్నాబాద్ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న "పల్లె పల్లెకు పొన్నం అన్న పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా భీమదేవరపల్లి మండలం ముత్తారం, వీరభద్ర నగర్,ముస్తఫాపూర్ గ్రామాలలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు.ముత్తారం చౌరస్తా నుంచి గట్ల నర్సింగాపూర్ మీదుగా లంబాడీ తండా వరకు రూ.3.74 కోట్ల వ్యయంతో రహదారి అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. గ్రామానికి చేరుకున్న మంత్రి ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు.అనంతరం గ్రామ పంచాయతీ వద్ద నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామ ప్రజల నుంచి వ్యక్తిగత, సామాజిక సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, జల సిరి పథకం కింద ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. ఒక్కో ఇంకుడు గుంతకు ప్రభుత్వం రూ.6,500, పొలం కుంటకు రూ.1.30 లక్షలు అందిస్తుందని తెలిపారు.ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలని, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి గ్రామాల్లో స్టీల్ బ్యాంకులను వినియోగించాలని మంత్రి సూచించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

**కొత్త పెన్షన్లకు దరఖాస్తు చేసుకోవాలి**

ఈ నెల 31వ తేదీ వరకు పెన్షన్ల దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, బోదకాలు, తలసేమియా, హెచ్‌ఐవీ బాధితులు తదితర అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.గ్రామాల్లో నీటి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.14–15 సంవత్సరాల వయసున్న బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణకు అందించే టీకాను వేయించాలని మంత్రి సూచించారు. అంగన్వాడీ కేంద్రాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు గ్రామాల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని, ముత్తారం ప్రభుత్వ పాఠశాలకు పెయింటింగ్ వేయిస్తామని హామీ ఇచ్చారు.

**యువత క్రీడల్లో రాణించాలి**

యువత మొబైల్ ఫోన్లకు బానిసలు కాకుండా క్రీడా మైదానాలకు వెళ్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ తదితర క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే మంచి గుర్తింపు రావడంతో పాటు, క్రీడా సర్టిఫికెట్ల ద్వారా ఇండియన్ ఆర్మీ, పోలీస్ శాఖల్లో ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.హుస్నాబాద్ నియోజకవర్గంలో క్రీడలను ప్రోత్సహించేందుకు జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారుడు కృష్ణను నియమించామని, నియోజకవర్గంలోని 173 గ్రామాల్లో క్రీడా సామగ్రి అందించామని చెప్పారు. ముత్తారం గ్రామానికి క్రికెట్, వాలీబాల్ తదితర క్రీడా సామగ్రితో పాటు ఓపెన్ జిమ్ అందించినట్లు తెలిపారు. ఇటీవల హుస్నాబాద్ మినీ స్టేడియంలో కబడ్డీ అకాడమీ ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో గురవయ్య, జిల్లా, మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్ ఊరడి భారతి జైపాల్ రెడ్డి, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పీజీ-2026 పరీక్షా కేంద్రం తనిఖీ



ప్రజాపక్షం/నర్సంపేట:నర్సంపేటలోని బిట్స్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన నీట్ పీజీ2026 పరీక్షను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలు, పరీక్ష నిర్వహణ తీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ రోజు నిర్వహించిన నీట్ పీజీ2026 పరీక్షకు మొత్తం 132 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 127 మంది హాజరయ్యారని జిల్లా కలెక్టర్ తెలిపారు. పరీక్ష ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా విజయవంతంగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట డియార్వో విజయలక్ష్మి , నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, సెక్షన్ సూపర్డెంట్ రంజిత్ తదితరులు ఉన్నారు.

## వనం భాస్కర్ వైద్యానికి అయూబ్ ప్రత్యేక చొరవ



ప్రజాపక్షం/ఖిలా వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన సీనియర్ జర్నలిస్టు వనం భాస్కర్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్న వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ వెంటనే స్పందించి మెరుగైన వైద్యం అందేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఎల్ఓసి(లెటర్ ఆఫ్ క్రెడిట్) ద్వారా ఉచితంగా వైద్యం అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా అయూబ్ మాట్లాడుతూ వనం భాస్కర్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. సమాజానికి సేవలందిస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. భాస్కర్ ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అవసరమైన సహాయం అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

## మహబూబాబాద్ జిల్లా ఎఐటియుసి నూతన కమిటీ

జిల్లా అధ్యక్షుడిగా అజయ్ సారథి రెడ్డి



ప్రజాపక్షం/మహబూబాబాద్: ఎఐటియుసి మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా బి అజయ్ సారథి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా రేషపల్లి నవీన్, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా వెలుగు శ్రావణ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గార్లలో శనివారం జరిగిన ఏఐటీయూసీ మహబూబాద్ జిల్లా మూడవ మహాసభలలో ఎన్నికయ్యారు. ఈ మహాసభలలో ఏఐటిసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాస్ రావు మరియు సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానుకోట పట్టణం 36 వార్డ్ కృష్ణ కాలనీకి చెందిన బి అజయ్ సారథి రెడ్డి 1993 నుండి అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ లో ప్రారంభమైన రాజకీయ నేపథ్యం ఆనాటి నుండి ఈనాటి వరకు విద్యార్థి కార్మిక ప్రజా పోరాటాల్లో ఉద్యమాల్లో తనదైన శైలిలో ఉద్యమాలు చేశారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నేతగా నాడు విద్యార్థి ఉద్యమాలు నిర్మించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ గ్రూపులు కోసం ప్రత్యేకంగా ఉద్యమించారు. సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గా వరుసగా మూడు సార్లు ఎన్నికై మానుకోట ప్రజా సమస్యలు ఇటు మునిసిపల్ లో సమస్యలపై గళం ఎత్తడం జరుగుతుంది.

**జిల్లా ప్రధాన కార్యదర్శిగా రేషపల్లి నవీన్:** ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శిగా మానుకోట పట్టణంలోని షికార్ఖానా గడ్డ కు చెందిన రేశపల్లి నవీన్ ఎన్నికవ్వడం జరిగింది ఈ సందర్భంగా 20 ఏళ్లుగా సిపిఐ ఉద్యమంలో తన వంతు పాత్ర పోషిస్తూ అనేక పోరాటాల్లో భూ పోరాటాల్లో తెలంగాణ ఉద్యమంలో యువజన పోరాటాల్లో పాల్గొని ఉద్యమాలు నిర్వహించారు ఇటీవల జరిగిన ఎన్నికల్లో మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో మెజార్టీతో గెలిచి ఆ ప్రాంతంలో ప్రజలకు అండగా ఇటు మున్సిపాలిటీలో పోరాటం చేస్తూ ప్రజా సమస్యలపై గలమెత్తుతూ ముందుకు పోతున్నారు.

**జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీగా వెలుగు శ్రావణ్ :** ఎఐటియుసి గార్లలో జరిగిన జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీగా మానుకోట పట్టణం బస్టాండ్ ప్రాంతానికి చెందిన వెలుగు శ్రావణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత 15 సంవత్సరాలుగా సిపిఐ ఉద్యమంలో అనేక పోరాటాలు చేస్తూ ఏఐఎస్ఎఫ్ మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తన వంతు పాత్ర పోషిస్తూ విద్యార్థి సమస్యలపై అనేక పోరాటాలు ఉద్యమాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా గార్ల లో జరిగిన ఏఐటియుసి జిల్లా మహాసభలలో డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా ఎన్నికవ్వడం జరిగింది.

జిల్లా ఉపాధ్యక్షులుగా మేదరమెట్ల గిరిప్రసాద్, పేరబోయిన కిరణ్ ,బాధావత్ పద్మ ,తండా శ్రీనాథ్, సహాయ కార్యదర్శిలుగా మంద శంకర్, సారిక శ్రీనివాస్, వంకాయలపాటి జకరయ్య, పుచ్చకాయల రజిని, కోశాధికారిగా చిర్ర లక్ష్మి నరసమ్మ ఎన్నికయ్యారు.

## కనకదుర్గ కాలనీ పార్కును మోడల్ పార్కుగా తీర్చిదిద్దుతాం

ఎంపి డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్: కనకదుర్గ కాలనీలోని జిడబ్ల్యూఎంసీ పార్కు, కమ్యూనిటీ సెంటర్‌ను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదివారం సందర్శించారు. పార్కులోని వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, లైటింగ్, పచ్చదనం, మొక్కల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. పార్కుకు వచ్చిన వాకర్స్, స్థానికులతో మాట్లాడి అక్కడి సమస్యలు, వారి అవసరాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ కనకదుర్గ కాలనీ పార్కును ఆధునిక సౌకర్యాలతో మోడల్ పార్కుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిడబ్ల్యూఎంసీ అధికారులకు సూచించారు. వర్షాకాలంలో వాకింగ్ ట్రాక్‌పై నీరు నిలిచిపోకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.చిన్నారులకు ప్రత్యేక ఆకర్షణగా..పిల్లలు ఆడుకునేందుకు పార్కులో ప్రత్యేక ఆటస్థలాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీ, ఎమ్మెల్యే సూచించారు. చిన్నారుల వయసుకు అనుగుణంగా వివిధ ఆట పరికరాలను ఏర్పాటు చేసి, సురక్షితమైన వాతావరణం కల్పించాలని తెలిపారు. కుటుంబాలతో కలిసి పార్కుకు వచ్చేలా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని రూపొందించాలని పేర్కొన్నారు.అలాగే వరంగల్ చారిత్రక నేపథ్యాన్ని ప్రతిబింబించేలా పార్కు గోడలపై కాకతీయ కళా వైభవం, చారిత్రక కట్టడాలు, సంస్కృతి ఉట్టిపడేలా ఆకర్షణీయమైన చిత్రాలు వేయించాలని సూచించారు. కనకదుర్గ కాలనీ ప్రజలకు మరింత మెరుగైన పచ్చదనం, ఆరోగ్యం, వినోద సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా పార్కును సమగ్రంగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గుజ్జుల వసంత, జిడబ్ల్యూఎంసీ అడిషనల్ కమిషనర్, మున్సిపల్ అధికారులు, స్థానిక వాకర్ అసోసియేషన్ సభ్యులు, రిటైర్ ఉద్యోగులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర 9వ మహాసభలు




ప్రజాపక్షం/నర్సంపేట: అఖిలభారత రైతుకుల సంఘం రాష్ట్ర తొమ్మిదవ మహాసభలు మంచిర్యాల జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 8, 9 తేదీలలో నిర్వహిస్తున్న ఈ సభలకు రైతు కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షులు జక్కుల తిరుపతి, జిల్లా సహ కార్యదర్శి గట్టి కృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక అంబేద్కర్ సెంటర్లో అఖిలభారత రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభల పోస్టర్స్ ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్బాంగా వారు మాట్లాడుతూ దేశంలో మూడోసారి అధికారులు చేపట్టిన బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజా పాలన పేరుతో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగ సమస్యలను పరిష్కారం చేయకుండా వ్యవసాయ రంగం దివాలా తీసే విధంగా వ్యవహరిస్తున్నారని, అందులో భాగంగానే రైతులు పండించిన పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు గిట్టుబాటు ధరలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉన్నప్పటికీ ఆ కమిషన్ సిఫార్సులను తుంగలో తొక్కారని వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెట్టి తమ బాధ్యత నుండి వైదొలుగుతున్నారని, నిత్యం రైతాంగానికి ఉపయోగపడే ఎరువుల పూల పురుగుమందుల ధరలను విపరీతంగా పెంచుకుంటూ పోతున్నారన్నారు. అమ్మ పోతే అడివి కొనబోతే కొరివి చందంగా వ్యవసాయ రంగం పూర్తిగా దివాలా తీస్తున్నారన్నారు. దేశంలో గాని ప్రపంచవ్యాప్తంగా కానీ రైతులు లేనటువంటి సమాజం లేదని ఆ రైతులు పండించిన పంటలు లేకపోతే మనిషికి ఆహారం లేదని, అనేక పరిశ్రమలకు ముడి సరుకులు లేకుండా పోతున్నాయని, సామ్రాజ్యవాదుల నుండి భౌల జాతి కార్పొరేట్ శక్తుల నుండి వేశా రంగాన్ని కాపాడుకోవాల్సినటువంటి ఒక గురుతరమైన బాధ్యత ఈ దేశ ప్రజలపై, రైతు కూలీలపై ఉన్నదని అన్నారు. మంచిర్యాలలో జరిగే మహాసభలలో రైతంగ సమస్యలపై మేధావుల ప్రసంగాలు చర్చలు ఉంటాయని భవిష్యత్ కార్యక్రమం కూడా రూపొందించుకోవడం జరుగుతుందని దేశాన్ని కాపాడుకుందాం రైతాంగాన్ని కాపాడుకుందాం అనే పిలుపుతో మా సభలు జరగబోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు ఎల్లబోయిన ఐలన్న, సలుపాల రమేష్, ఆకుతోట రాజు, ఆకారపు రాజు, రాజబోయిన ఐలయ్య, ప్రదీప్ పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



ప్రజాపక్షం/పాలకుర్తి: మండలంలోని మల్లంపల్లి గ్రామానికి చెందిన మండల మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి హేమలత దంపతుల ఏకైక కుమార్తె ప్రియాంక సాయికుమార్‌ల వివాహ మహోత్సవం మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వర స్వామి కళ్యాణ మండపంలో జరిగిన వివాహ వేడుకలకు ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వధూవరులు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందమైన దాంపత్య జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగు శ్రీనివాస్, ఏఎంసీ చైర్‌పర్సన్ మంజుల భాస్కర్, నాయకులు మహేందర్ రెడ్డి, భాస్కర్, ఎల్లయ్య, యాకన్న, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## పంజాల అశోక్‌ను సత్కరించిన ఎమ్మెల్యే నాగరాజు




ప్రజాపక్షం/కాజీపేట : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘంగా 34 సంవత్సరాలు విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన పంజాల అశోక్ కు వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఆదివారం ఘనంగా సన్మానించారు. మడికొండ శివారులోని ఏ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఉద్యోగ విరమణ అభినందన సన్మానోత్సవ కార్యక్రమానికి విచ్చేసి పంజాల అశోక్ ను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పదవి విరమణ చేసి మరో జీవితంలో అడుగుపెడుతున్న క్రమంలో కుటుంబ సభ్యులతో సమయాన్ని వెచ్చిస్తూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, అలాగే ఆరోగ్యకరమైన అలవాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు.ఎన్నో సవాళ్లతో కూడుకుని వున్న పోలీస్ ఉద్యోగం సంపూర్ణంగా పూర్తి చేసి పదవి విరమణ పొందడం గొప్ప విషయం అన్నారు.పంజాల అశోక్ కు శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు,పోలీస్ అధికారులు, టీపీసీసీవో అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## యువత రాజకీయాల్లోకి రావాలి

ప్రజాపక్షం/ములుగు: యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రజాసేవలో చురుకైన పాత్ర పోషించాలని జింక వేణు పిలుపునిచ్చారు. నేటి సమాజంలో యువతకు అపారమైన శక్తి, ఆలోచన సామర్థ్యం ఉందని, వాటిని సమాజ అభివృద్ధికి వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయాలు కేవలం పదవులు, అధికారం కోసం కాకుండా ప్రజలకు సేవ చేసే వేదికగా ఉండాలని సూచించారు. గ్రామ స్థాయి నుండే ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని యువతకు సూచించారు. నిరుద్యోగం, విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, మౌళిక వసతుల వంటి సమస్యలపై అవగాహన పెంచుకొని ప్రజల తరుపున నిలబడాలని అన్నారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి చొరవ చూపాలని పేర్కొన్నారు. రాజకీయాల్లోకి వచ్చే యువత నిజాయితీ, నిబద్ధత, సేవాభావంతో ముందుకు సాగాలని జింక వేణు అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయాల్లో యువత ప్రాతినిధ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్ మీడియాకు మాత్రమే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు.

## గంజాయి విక్రేతల అరెస్టు



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** పోలీసులు వల పన్ని గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశారు. వారి నుండి 430 గ్రాముల గంజాయి, 3 సెల్ ఫో న్‌లు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి స్థానిక ఎస్ఐ జె. కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆదివా రం ఉదయం జగదేవ్‌పూర్ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. జగదేవ్‌పూర్ శివారులో భారత్ పెట్రోల్ బంకు వద్ద ద్వీచక్ర వాహనంపై అనుమానస్పదంగా వెళ్లుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు గుర్తించారు. ఈ క్ర మంలో పోలీసులను గమనించిన వారు అక్కడి నుండి పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు విచారణలో మండల పరిధిలోని మునిగడప గ్రామానికి చెందిన దేవుని న వీన్ కుమార్ (25) ఏ1,ఏ2 చీలసాగర్ పవన్ కళ్యాణ్ (26) కొంపల్లిగా గు ర్తించారు. వీరు ఒడిశా రాష్ట్రంలోని సిలేరు గ్రామం సరిహద్దు ప్రాంతం నుం డి గంజాయి తీసుకు వచ్చినట్లు తెలిపారు. కాగా నిందుతులపై కేసు నమో దుచేసి ఎన్‌డిపిఎ యాక్ట్ ప్రకారం కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపా రు.

## చేయూత పెన్షన్ దరఖాస్తుల గడువు పొడగించాలి: సిపిఐ పట్టణ కార్యదర్శి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** చేయూత పెన్షన్ దరఖాస్తుల గడువు పొడగించాలని సిపిఐ పట్టణ కార్యదర్శి పంత రవి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం సుభాష్ నగర్ సిపిఐ కార్మిక భవనంలో లాల్ బాహుట చేనేత పవర్లూమ్ కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చేనేత జౌళి శాఖ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న కార్మికులందరికీ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.జౌళి శాఖ కార్డుల విషయంలో కార్మికులకు అన్యాయం జరిగితే జౌళి శాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ 31 వ తేదీ లోపు చేయూత పింఛన్ దరఖాస్తు గడువు ముగుస్తుందని చెప్పినప్పటికీ జౌళి శాఖ అధికారులు మాత్రము నేతన్న చేయూత పథకానికి అవసరమైన చేనేత జౌళి శాఖ కార్డులను జారీ చేయడంలో తీవ్రంగా విఫలం చెందారని విమర్శించారు. సుమారుగా 110 దరఖాస్తులు వస్తే ఇప్పటివరకు 100 కార్డులు మాత్రమే జారీ చేయడం చాలా దుర్మార్గమై చర్య అని మండిపడ్డారు. ఇప్పటికైనా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి దరఖాస్తు గడువులోగా అర్హులైన కార్మికులందరికీ జౌళి శాఖ కార్డులను జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అజ్జ వేణు, సోమ నాగరాజు, హరికృష్ణ, రాజమల్లు పాల్గొన్నారు.

## షికార్ గంగాధర్‌కు ఘన నివాళులు



**ప్రజాపక్షం/కోరుట్ల :** వృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక నేత సిపిఐ సీనియర్ నాయకులు షికారి గంగాధర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని సిపిఐ నేత ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడురాచకొండ పెద్ద దేవయ్య తెలిపారు. ఆదివారం రోజున షికారి గంగాధర్ సంతాప సభ సి.ప్రభాకర్ భవన్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సిపిఐ నేతలు మాట్లాడుతూ వృద్ధుల సామాజిక సమస్యల పరిష్కారం కోసం తమకంటూ సంక్షేమ సంఘం ఉండాలని సంఘం ఏర్పాటు చేసి దీర్ఘకాలంగా ఉపాధ్యక్షుడిగా పని చేస్తూ అనారోగ్యంతో మృతి చెందాడని ఆయన మృతి సంఘానికి కమ్యూనిస్టు పార్టీకి తీరనిలోటని ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కవి రచయిత రాస భూమయ్య,సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు చింతా భూమేశ్వర్,రాడం అశోక్,జాగిలం భూమయ్య, గూడూరి చంద్రకాంత్, తోటరాజ్యం, జాప లింగయ్య, మేకల రాజం,బింగి లక్ష్మి కాంతం,వ్యాపారవేత్త దొడ్డికి కండే శివ,నాగరాజు,షికారి శ్రీనివాస్, షికారి దత్తాత్రి కూతురు,పుష్పలత వీణ,తదితరులు పాల్గొన్నారు.

## చోటా 'ఠాకూర్'... బడా 'రికార్డ్'!



**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ తనయుడు నిధిష్ ఠాకూర్ ప్రతిష్టాత్మకమైన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ టైటిల్ అందుకున్నారు. ఈనెల 9న హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన అతిపెద్ద తైక్వాండో కరాటే ప్రదర్శనలో జయంత్‌రెడ్డి ఇంటర్‌నేషనల్ తైక్వాండో అకాడమీ, సుమన్ ఆర్ట్ థియేటర్స్‌కు చెందిన 533 మంది విద్యార్థులు పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సాధించారు. ఈ చారిత్రాత్మక రికార్డులో భాగస్వామి అయిన నిధిష్ ఠాకూర్‌కు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్ లభించింది. ఈ సందర్భంగా ఆదివారం నిధిష్‌ను తల్లిదండ్రులు మక్కాన్‌సింగ్, మనాలి ఠాకూర్‌లతోపాటు కరాటే శిక్షకులు, నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** మండలంలోని నారాయణపూర్ గ్రామశివారు వద్ద ఆదివారం రోజున ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుకున్నామని ఇసుకట్రాక్టర్‌ను యజమాని శీతల నరేష్,డ్రైవర్ కుడెల్లిరాజు అనువ్యక్తులపై కేసునమోదు చేస్తున్నమని ఎల్లారెడ్డిపేట ఎస్సై నరేష్‌గౌడ్ మీడియా ప్రకటనలో తెలిపారు.ఎవరైన అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని పోలీస్‌లు హెచ్చరించారు.

## రాష్ట్రపతిని కలిసిన ఇఎంఆర్ఐ విద్యార్థిని



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** మండలంలోని ఏకలవ్య గురుకులం పాఠశాల దుమాల విద్యార్థిని భారత రాష్ట్రపతిని కలిశారు.ఆమె ఎనిమిదో తరగతి చదువుతోంది.రక్షాబంధన్ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదిముర్మును కలిసినట్లుగా ఎల్లారెడ్డిపేట ఎంఇఒ కృష్ణహరి తెలిపారు.

# సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్

### ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణా రావు



**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన నిరుపేద కుటుంబాలకు సొంత గృహాలను అందిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. పేదల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి, సామాజిక భద్రతకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.సుల్తానాబాద్ మండలం కందునూరిపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఐదు లక్షల ఆర్థిక సహాయంతో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ఆదివారం స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు ప్రారంభించారు. నూతన గృహాల వద్దకు చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ, సొంత ఇల్లు ప్రతి కుటుంబానికి ఒక భద్రత, ఒక భరోసా అని, ఆ కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని చెప్పారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యమైన గృహాలను నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.అనంతరం నూతన గృహాల లబ్ధిదారులతో ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. నూతన గృహ ప్రవేశంతో కుటుంబాల్లో నెలకొన్న ఆనందాన్ని చూసి వారిని అభినందించారు. లబ్ధిదారులు కూడా ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పన్నాల రాములు, స్థానిక సర్పంచ్,ఉపసర్పంచ్, వార్డు సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు,లబ్ధిదారులు,గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు..


## ఆలయాలను దర్శించుకున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/రామగిరి:** రామగిరి మండలంలో ఆదివారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పర్యటించారు. సెంటనరి కాలనీ మార్కెట్ చౌరస్తాలోని శ్రీరామాంజనేయ మేకల మండీ గల మైసమ్మ ఈ ఆలయం ఇటీవల పదవ వార్షికోత్సవం జరుపుకున్న సందర్భంగా అమ్మవారికి టెంకాయ కొట్టి పూజలు చేసి నాగేపల్లి గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకొని ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వెంకటేశ్వర స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజల సంక్షేమం,తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి స్వామివారి ఆశీస్సులు ఉండాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆకాంక్షించారు.తధాంతరంనాగేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు గొల్లపల్లి. నరేష్ ఏర్పాటు చేసిన (గదా టాటూ అండ్ పియర్సింగ్) స్టూడియోను రిబ్బన్ కట్ చేసి స్టూడియోను ప్రారంభించి మంత్రి శ్రీధర్ బాబు నరేష్‌కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.తదనంతరం మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన ఈ స్టూడియో దినదినాభివృద్ధి చెందాలని, వ్యాపారంలో యువత మంచి గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల.తిరుపతి యాదవ్,రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి సమస్యలపై మాట్లాడే నైతిక హక్కు బిజెపికి లేదు

### 'సుడా' మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**ప్రజాపక్షం /కరీంనగర్ టౌన్:** రాష్ట్ర ప్రభుత్వానికి రావలసిన నిధుల విషయంలో కేంద్రంలో ఉన్న బిజెపి మోకాలడ్డుకుంటూ విద్యార్థుల పై మొసలి కన్నీరు కారుస్తుందని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి విమర్శించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పేరు మార్చి అంతకుముందున్న వంద శాతం నిధులను 60 శాతానికి కుదించి మిగితా 40 శాతం రాష్ట్రం పై భారం వేస్తున్నారని కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులు గతంలో లాగా 100 శాతం ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వానికి 20 శాతం భారం వేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం నుండి కేంద్రానికి రావాల్సిన పన్నులను ముక్కు పిండి వసూలు చేస్తున్నారని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.విద్యార్థుల సమస్యలపై మాట్లాడే నైతిక హక్కు బిజెపికి లేదని విద్యార్థులపై దమనకాండకు పాల్పడిన వారు విద్యార్థులపై మొసలి కన్నీరు కార్చుతున్నారని నరేందర్ రెడ్డి అన్నారు.అనంతరం బి ఆర్ ఎస్ పై మాట్లాడుతూ పదేళ్లు మోసం చేసింది చాలక ఛార్జిషీట్ పేరుతో బయలుదేరుతున్నారని, ప్రజలకిచ్చిన ఏఒక్క హామీ అమలు చేయలేదని డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టివ్వకుండానే ఓట్లు దండుకున్నారని బిఆర్ఎస్ చార్జిషీట్ పై మండిపడ్డారు.

## నీట్ పిజి పరీక్షకు 1471 మంది హాజరు

### పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం



**ప్రజాపక్షం/కరీంనగర్:** జిల్లాలో నిర్వహించిన నీట్ పిజి పరీక్ష ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది. పరీక్ష నిర్వహణను ఆదివారం కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం సంయుక్తంగా పర్యవేక్షించారు. జిల్లాలోని తిమ్మాపూర్ మండలం వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ పోలీస్ కమిషనర్ ఏర్పాట్లు, భద్రతా చర్యలను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థుల ప్రవేశం, భద్రతా తనిఖీలు, సిసి కెమెరాల పర్యవేక్షణ, బయోమెట్రిక్ ధృవీకరణ, తాగునీరు, విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాలు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. పరీక్ష సజావుగా జరిగేలా పోలీసు శాఖ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయగా, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేశాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ నీట్ పిజి పరీక్ష నిర్వహణలో భాగస్వాములైన అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయడం వల్ల నీట్ పరీక్ష విజయవంతంగా పూర్తయిందని తెలిపారు. పరీక్ష సజావుగా సాగేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టామని చెప్పారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ పరీక్ష పారదర్శక నిర్వహణకు అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపట్టామని, విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పరీక్షలు రాసేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని మొత్తం 7 పరీక్షా కేంద్రాల్లో 1505 మంది అభ్యర్థులకు గాను 1471 మంది హాజరుకాగా, 34 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష నిర్వహణలో జిల్లా విద్యాశాఖ అధికారులు, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, పోలీసు అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తిరుమల ఇండస్ట్రీస్‌పై టాస్క్‌ఫోర్స్ దాడులు



**ప్రజాపక్షం / హుజురాబాద్ :** కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం రాంపూర్ గ్రామంలోని తిరుమల ఇండస్ట్రీస్ రైస్ మిల్లుపై సివిల్ సప్లైస్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, సివిల్ సప్లై అధికారులు ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భారీ ఎత్తున నిల్వ ఉంచిన సుమారు 340 టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మిల్లు యజమాని ఉపేందర్‌కు సమీప బంధువైన శీల శీను అనే వ్యాపారి ఈ అక్రమ దందాకు సూత్రధారిగా వ్యవహరించినట్లు విచారణలో తేలింది. జమ్మికుంట, ఇల్లంతకుంట, హుజురాబాద్ మండలాల్లో ఈ రేషన్ బియ్యాన్ని సేకరించినట్లు ట్రాలీ డ్రైవర్లు వెల్లడించారు. హుజురాబాద్ మండలంలోని ఇప్పల నర్సింగాపూర్ గ్రామ రేషన్ డీలర్ నుండి రేషన్ బియ్యం తీసుకొచ్చినట్లు ట్రాలీ డ్రైవర్ తిరుపతి సురేష్ వెల్లడించారు. ఆయా గ్రామాల్లోని రేషన్ డీలర్లు, స్థానిక చిన్న వ్యాపారుల నుండి ఈ బియ్యాన్ని తక్కువ ధరకు సేకరిస్తున్నారు.అనంతరం ఆ బియ్యాన్ని తిరుమల ఇండస్ట్రీస్‌కు తరలించి, రీసైక్లింగ్ చేసి కస్టమ్ మిల్లింగ్ రైస్(సిఎంఆర్) కింద ప్రభుత్వానికి లెక్క చూపిస్తూ భారీ మోసానికి పాల్పడుతున్నట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. తనిఖీల సమయంలో ఎవరికి అనుమానం రాకుండా పరదాలు కప్పి మిల్లుకు తరలిస్తున్న సుమారు 50 క్వింటాళ్ల రేషన్ బియ్యం లోడుతో ఉన్న రెండు ట్రాలీలను అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ట్రాలీ డ్రైవర్లు తిరుపతి సురేష్, అంగిడి తిరుపతిలను సివిల్ సప్లై టాస్క్ ఫోర్స్ పోలీసులు, సివిల్ సప్లై అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ వ్యవహారంలో ప్రమేయమున్న డీలర్లు, రేషన్ దందా చేస్తున్న శీల శీను అనే వ్యాపారితో పాటు, ఇండస్ట్రీ యజమాని ఉపేందర్‌పై కేసు నమోదు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. లోతుగా విచారణ జరిపితే మరిన్ని అక్రమాలు భారీగా రేషన్ బియ్యం నిల్వలు బయటపడే అవకాశం ఉందని టాస్క్‌ఫోర్స్ అధికారులు వెల్లడించారు.

## కాంగ్రెస్ మోసాలపై ఉద్యమిద్దాం

### మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** ఎన్నికల ముందు అడ్డగోలుగా హామీలు ఇచ్చి అధికారంలోకివచ్చివంద రోజుల్లోనే 6 గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పితర్వాత అన్ని వర్గాల ప్రజలను నట్టేట ముంచుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వెయ్యి రోజులు నిండుతున్న సందర్భంగా ఆ పార్టీ మోసాన్ని ప్రజల్లో ఎండగట్టేందుకు బిఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున కార్యాచరణకు సిద్ధమైందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటి ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు అన్నారు. ఆదివారం సాయంత్రం సిద్దిపేట ఎమ్మెలే క్యాంపు కార్యాలయం లో పార్టీ శ్రేణులకు హరీష్ రావు దిశా నిర్దేశం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు సమాజంలోని అన్ని రంగాలకు కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాన్ని ప్రజల్లోకి పెద్ద ఎత్తున వినూత్నంగా తీసుకెళ్లేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టనుందని చెప్పారు. 100 రోజుల్లో అమలు చేస్తామన్న హామీలేవీ సంపూర్ణంగా నెరవేర్చలేదన్నారు.. రాష్ట్ర ప్రజలకు అనేక హామీలు ఇచ్చి, 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీ ల పేరుతో ప్రతి ఒక్క మాటను 100 రోజుల్లోనే నెరవేరుస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని హరీష్ రావు అన్నారు. అయితే 1000 రోజులు పూర్తయిన తర్వాత కూడా ఒక్కటంటే ఒక్క హామీని సంపూర్ణంగా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని చెప్పారు.. నాడు కెసిఆర్ సబ్బండ వర్గాలకు భరోసా నిచ్చే కార్యక్రమలు సంక్షేమ ఫలాలు అందిస్తే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఆగం చేస్తుందని ఈ విషయం పై ప్రజల్లో ఎండగట్టాలన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చోటుచేసుకున్న వైఫల్యాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ప్రధానంగా ప్రస్తావించాలని సూచించారు. సెప్టెంబర్ 2న కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణి చేయాలన్నారు. 4వ తేదీన పెన్షన్ దారులకు, మహిళలకు 2500,కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ఇతర కార్యక్రమాల పై వంట వార్పు కార్యక్రమం చేపట్టాలన్నారు. 5వ తేదీన జాబ్ క్యాలెండర్, నిరుద్యోగం పై నిరసన, 6వ తేదీన సిద్దిపేట పట్టణం లో ఆటో ర్యాలీ నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాయకులు పాల్గొన్నారు.

## ఎన్‌టిపిసి రామగుండంలో 3కె రన్!



**ప్రజాపక్షం/గోదావరిఖని :** జాతీయ క్రీడా దినోత్సవ ం సందర్భంగా ఎన్‌టిపిసి జ్యోతినగర్ మహాత్మాగాం ధీ స్టేడియంలో ఎన్‌టిపిసి స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యం లో 3కే రన్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఎన్‌టిపిసి ఈ.డి.(ఆర్అండ్‌టి) చందన్ కుమార్ సమ ంత పరుగును ప్రారంభించారు. 226 మంది ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ప్రతిఒక్కరూ శారీరక ధృఢత్వం, క్రీడలు, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ఈ.డి. తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఉద్యోగులు, వారి కుటుంబసభ్యుల్లో శారీరక వ్యాయామం, స్నేహభావం, చురుకైన జీవన సంస్కృతిని ప్రోత్సహించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో ఎమ్మెల్యే



**ప్రజాపక్షం / సారంగాపూర్ :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం నాగునూరు గ్రామానికి చెందిన లబ్దిదారులు జంగిలి జల అంజన్న ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ హాజరైయ్యారు. లబ్దిదారులకు నూతన వస్త్రాలు కానుకగా అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రుషేంద్ర శంకర్ రెడ్డి, జంగిలి మహేష్, బిట్ల రమేష్, ఆకుల తిరుపతి, అత్తినేని శ్రావణ్ కుమార్, దేవయ్య, బేతి శంకర్, బొమ్మన తిరుపతి, రాజన్న, శేఖర్, ఒగ్గు రమేష్, గంగారెడ్డి, ఇతడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గన్నేరువరంలో ఉద్రిక్తత

### పోలీసు వలయాన్ని ఛేదించుకొని యువకుల దీక్ష..
### దీక్షకు మద్దతుగా బిఆర్ఎస్ ,బిజెపి, సిపిఐ, కుల సంఘాలు, మండల ప్రజలు



**ప్రజాపక్షం /గన్నేరువరం:** కరీంనగర్ జిల్లా గన్నేరువరంలో డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ మండల యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం తలపెట్టిన 24 గంటల నిరాహార దీక్ష ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసులు ఉదయం 6 గంటల నుండి గన్నేరువరం మండల కేంద్రాన్ని అడుగడుగున బందోబస్తు ఏర్పాటు చేసి అదనపు బలగాలతో పర్యవేక్షించినప్పటికీ యువజన సంఘాల నాయకులు అనుకున్న సమయానికి గన్నేరువరంలోని వివేకానంద విగ్రహం వద్దకు చేరుకొని వారి దీక్షకు ప్రయత్నించారు. ఒక్కసారిగా యువజన సంఘాలు దీక్ష ప్రదేశానికి చేరుకోగానే పోలీసులు వారిని చెదరగొట్టి బలవంతంగా పోలీసు వాహనాల్లోనికి ఎక్కించారు. ఈ క్రమంలో పోలీసులకు యువజన సంఘాల నాయకులకు పెనుగులాట జరిగింది. పలువురు యువజన సంఘాల నాయకులకు గాయాలయ్యాయి. పోలీసులు బలవంతంగా యువజన సంఘాలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. యువజన సంఘాల అధ్యక్షుడు కాలువ నాగరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ రోడ్డు వేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడిచినప్పటికీ రోడ్డు వేయకపోగా రోడ్డు అని ప్రశ్నించిన వారిని బెదిరింపులకు గురి చేస్తూ పోలీసుల సహకారంతో అక్రమ కేసులు బనాయిస్తూ అణిచి వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరాహార దీక్ష చేపడదామని పోలీస్ శాఖను అనుమతులు అడుగితే అధికార బలంతో అనుమతులు రాకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. రోడ్డు వేయడం చేతగాని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వెంటనే రాజీనామా చేయాలని డిమా ండ్ చేశారు. వెంటనే రోడ్డు పనులు ప్రారంభించకుంటే రాబోయే రోజుల్లో యువజన సంఘాల ఆధ్వర్యంలో ఉ ద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యువజన సంఘాలు నిరాహార దీక్ష చేస్తున్నారని కా ంగ్రెస్ నాయకులు దానికి పోటీగా అదే సమయానికి మాదకద్రవ్యాలపై చైతన్య ర్యాలీ నిర్వహించడం దానికి పోలీసుల మద్దతు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. డబుల్ రోడ్డు నిర్మాణం కోసం యువజన సంఘాల నాయకులకు వివిధ గ్రామాల ప్రజలు మద్దతుగా పలికారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువజన సంఘాల సభ్యులు వివిధ రాజకీయ పార్టీల మండల నాయకులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నుండి అల్లూరి శ్రీనాథ్ రెడ్డి సస్పెన్షన్

యువజన సంఘాల ఆధ్వర్యంలో జరిగిన నిరాహార దీక్ష కార్యక్రమానికి మద్దతు పలికి దీక్షలో పాల్గొన్న మాజీ యూత్ కాంగ్రెస్ జాయింట్ సెక్రెటరీ కాంగ్రెస్ నాయకుడు అల్లూరి శ్రీనాథ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్టు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్డు సునీల్ ఒక ప్రకటనను సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ తనకు రోడ్డు సమస్య ప్రధానమని రోడ్డు కోసం ఇకముందు మరింత ఉద్యమిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల నాయకుడు అల్లూ రి శ్రీనాథ్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి మడుగుల రవీందర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, సిపిఐ మండల కార్యదర్శి చోక్కల్ల శ్రీశైలం, గూడూరి సురేష్, తాడూరి వంశీకృష్ణ రెడ్డి, బోయిని కుమార్, మచ్చ సాయి కృష్ణ, మీసాల ప్రభాకర్, కాంతాల అంజిరెడ్డి, మీసం లచ్చన్న, బొమ్మ కంటి ఆంజనేయులు యువజన సంఘం నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 'శుద్ధీకరణ' సిగ్గుచేటు

ఈ చర్య అత్యంత భయంకరం : ప్రియాంకాగాంధీ



**న్యూఢిల్లీ :** బిజెపిపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానిలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రసంగించిన వేదిక వద్ద 'శుద్ధీకరణ' కార్యక్రమం నిర్వహించడం నేరమన్నారు. ఈ చర్యకు పాల్పడిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు అయ్యేలా చూడాలని, ప్రధాని నరేంద్ర మోదీకి నిజంగానే రాజ్యాంగం పట్ల గౌరవం ఉంటే ఆయన ఈ చర్య తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ నెల ప్రారంభంలో 'శుద్ధీకరణ' కార్యక్రమాన్ని నిర్వహించిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి చట్టం కింద చర్యలు తీసుకునేలా మోదీ చూడాలని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హల్ద్వానిలో ఒక బహిరంగ సభలో ప్రసంగించిన తర్వాత బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన వ్యక్తులు ఆ వేదికను శుద్ధి చేశారని, ఇది అత్యంత అభ్యంతరకరమైన, సిగ్గుచేటైన మనస్తత్వానికి చిహ్నం మాత్రమే కాదు, మన రాజ్యాంగం, ఎస్‌సి, ఎస్‌టి చట్టాల తీవ్ర ఉల్లంఘన అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆదివారం ఎక్స్ వేదికగా మండిపడ్డారు. 20 రోజులు గడిచినా ప్రధాని, ఆయన ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదని ప్రియాంక గాంధీ పేర్కొంటూ, దీనికి కారణం ఏమిటని ప్రశ్నించారు.

## డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లపై..

# చురుకుగా భారత న్యాయవ్యవస్థ

● లండన్‌లో 43వ అంతర్జాతీయ ఆర్థిక నేరాల సదస్సులో సిజెఐ సూర్యకాంత్ కీలక ప్రసంగం



**న్యూఢిల్లీ :** డిజిటల్ అరెస్ట్ కుంభకోణాల వంటి కొత్తగా వెలుగులోకి వస్తున్న మోసపూరిత పథకాలపై పార్లమెంట్ పరిష్కరించే వరకూ వేచి ఉండకుండా, భారత న్యాయ వ్యవస్థ చురుకుగా స్పందించిందని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ పేర్కొన్నారు. లండన్‌లో శనివారం జరిగిన 43వ అంతర్జాతీయ ఆర్థిక నేరాల సదస్సులో తన ముగింపు ప్రసంగం లో, వీడియో కాల్స్ ద్వారా పోలీస్ అధికారులు, న్యాయాధికారులు, లేదా బ్యూరోక్రాట్స్‌గా నటిస్తూ మోసగాళ్లు పౌరులను మోసం చేసే డిజిటల్ అరెస్ట్ కుంభకోణాన్ని సుప్రీంకోర్టు ఇటీవల సుమోటోగా స్వీకరించిందని సూర్యకాంత్ చెప్పారు. 'దీనికి ప్రతిస్పందనగా, ఈ సమస్య తీవ్రతను అంచనా వేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోర్టు ఆదేశించింది. అలాగే జరిగిన నష్టానికి అనుపాతంగా ఉండే శిక్షలతో ఒక ప్రత్యేక నేరాన్ని నమోదు చేయాలని పిలుపునిచ్చింది' అని సిజెఐ తెలిపారు. 'పార్లమెంట్ ఇలాంటి డిజిటల్ అరెస్ట్ నేరాలను పరిష్కరించే వరకు వేచి చూడకుండా , కొత్తగా వెలుగులోకి వస్తున్న మోసపూరిత పథకాలకు భారత న్యాయ వ్యవస్థ చురుకుగా స్పందిస్తోంది అనడానికి ఇది ఒక విస్తృత నమూనాలకు నిదర్శనం' అని సిజెఐ అన్నారు. ఆర్థిక నేరాల పట్ల భారతదేశం ఆధునిక ప్రతిస్పందనను పరిశీలించినప్పుడు, దానిని ఒకే చట్టంగా కాకుండా, వరుస దశాబ్దాలుగా ఉద్దేశ పూర్వకంగా నిర్మించిన ఒక బహుళ అంచెల నిర్మాణంగా ఉత్తమంగా అర్థం చేసుకోవాలని, ఇందు లో శాసనాలు, సంస్థలు, న్యాయ సిద్ధాంతాలు ఒక్కొక్కటి విభిన్నమైన పనిని చేసేలా రూపొందించబడ్డాయని ఆయన వివరించారు. మనీ ల్యాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ), 2002, పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తుల చట్టం, 2018ల గురించి సిజెఐ సూర్యకాంత్ ఈ సందర్భంగా ప్రస్తావించారు.'ఇవి లోపరహితమైన యంత్రాంగాలు కావు అని నేను తప్పక పేర్కొనాలి. దర్యాప్తు సంస్థలు పిఎంఎల్ఎ ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నాయని అనేక మంది ఆరోపించారు. ఇందులో స్పష్టమైన కారణాలు చేయకుండానే అరెస్ట్‌లు చేయడం, వాస్తవ పరిస్థితులు సమర్థించే దానికంటే ఎక్కువ కాలం కస్టడీని పొడిగించడం వంటి అంశాలు ఉన్నాయి.ఇలాంటి ప్రతీ సందర్భంలోనూ పరిస్థితిని సరిదిద్దడానికి న్యాయవ్యవస్థ జోక్యం చేసుకుంది' అని ఆయన అన్నారు. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అత్యున్నత న్యాయస్థానం తీర్పును ఈ సందర్భంగా ప్రస్తావించారు.అరెస్ట్‌కు గల కారణాలను నిందితుడికి కేవలం బిగ్గరగా చదివి వినిపించకుండా, రాతపూర్వకంగా అందించాలి. 'అంతేకాకుండా, నేను తీర్పు రాసే అవకాశం లభించిన అరవింద్ కేజ్రీవాల్ వర్సెస్ సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ ) కేసులో సుదీర్ఘ విచారణ పూర్వ నిర్బంధాన్ని వేరొక రూపంలో శిక్షగా మార్చకూడదనే సూత్రం ఆధారంగా, కోర్టు అరెస్ట్ చట్ట బద్ధతను సమర్థించినప్పటికీ బెయిల్ మంజూరు చేసింది' అని సిజెఐ సూర్యకాంత్ వివరించారు. చట్టపరమైన, సాంకేతికపరమైన పరిణామాలు ఉన్నప్పటికీ, దశాబ్దాలుగా స్థిరంగా నిలిచి ఉన్న విషయమేమిటంటే, చట్టబద్ధమైన ప్రక్రియ, అనుపాతత, నిర్దోషిత్వ భావన అనేవి తమ న్యాయశాస్త్రానికి మార్గదర్శక సూత్రాలుగా ఉండాలని సుప్రీంకోర్టు పట్టుబట్టడమేనని సిజెఐ అన్నారు. క్రీ.పూ. రెండవ శతాబ్దంలో భారతీయ రాజనీతిజ్ఞుడు, గురువు అయిన కౌటిల్యుడు రాజ్యాధికారి దాని ఖజానాను ఏయే విభిన్న మార్గాలలో దోచుకోగలడో తన 'అర్థ శాస్త్రం' అనే రాజనీతి గ్రంథంలో రాసారని సిజెఐ వివరించారు. 'అప్రమత్తత, సహకారం, చట్టబద్ధమైన పాలన మోసాన్ని సమాన స్థాయిలో ఇంకా చెప్పాలంటే పెరుగుతున్న స్థాయిలో అడ్డుకుంటాయనదే ఈ సదస్సు సమాధానం కావాలి' అని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ఆకాంక్షించారు.

# సిజెపికి రాజకీయ లక్ష్యాలు ఉండొచ్చు..


రాజకీయాలకు అతీతంగా ఉంటేనే మేలు: సోనమ్ వాంగ్‌చుక్



**న్యూఢిల్లీ:**కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి)కి బహుశా రాజకీయ లక్ష్యాలు ఉండి ఉండవచ్చని ఉద్యమకారుడు, పర్యావరణ వేత్త సోనమ్ వాంగ్‌చుక్ అన్నారు. తాజాగా ఆయన ఒక పాడ్‌కాస్ట్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా సిజెపితోపాటు, గత నెలలో తాను చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష సహా అనేక అంశాలపై మాట్లాడారు. అయితే, సిజెపి రాజకీయాలకు అతీతంగా ఉంటేనే బాగుంటుందని సలహా ఇచ్చారు. 'సిజెపికి, దాని వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేకు రాజకీయ లక్ష్యాలు ఉన్నట్లు అనిపిస్తోంది. అయితే, ఈ విషయాన్ని వారేమీ నాకు చెప్పలేదు. ఇది నా అంచనా మాత్రమే. రాజకీయ లక్ష్యాలు ఉండటంలో తప్పులేదు. సిజెపి రాజకీయంగా మారితే యువతకు అనేక అవకాశాలు వస్తాయనేది నిజం. కానీ, ఇలాంటి ఉద్యమాన్ని రాజకీయాలకు అతీతంగా, తటస్థంగా ఉంచితేనే మంచిది. ప్రజలు సిజెపిని నిష్పక్షపాతంగా నడిచే యువత, విద్యార్థుల ఉద్యమ శక్తిగా చూస్తున్నారు. తటస్థంగా ఉంటూ, ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చే సంస్థ అని భావిస్తున్నారు. ఇలా ఉంచితేనే అనేక లక్ష్యాలు సాధించవచ్చు. రాజకీయ శక్తిగా కంటే ఉద్యమ శక్తిగా ఉంచడమే మంచిది. అయితే, సమాజం నుంచి ఏమీ ఆశించకపోవడానికి సిజెపి నేతలేమీ సన్యాసులు కాదు. నేను విశ్లేషించినంత వరకు వాళ్లు రాజకీయ శక్తిగా మారుతారు' అని వ్యాఖ్యానించారు. అభిజీత్ దీప్కే గతంలో ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా ఉన్న విషయంపై తనకు అవగాహన లేదన్నారు. ఇక, తాను ఆమరణ దీక్ష చేస్తున్న సమయంలో దీక్ష విరమింపజేసే అంశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని సంప్రదించామని, కానీ, ఈ విషయంలో ఆయన నుంచి సరైన స్పందన రాలేదన్నారు. ఈ విషయం పార్లమెంట్‌కు చేరాలని తాము భావించామన్నారు. రాహుల్ గాంధీ తమ దీక్షాస్థలికి వచ్చుంటే, అప్పుడు విషయానికి చాలా ప్రాధాన్యం దక్కేదని సోనమ్ వాంగ్‌చుక్ వివరించారు. కానీ, దీక్ష చేస్తున్నప్పుడు, ముగిసిన తర్వాత ఆయన తనను సంప్రదించలేదని వెల్లడించారు.

## రాహుల్ మాటలా? భాగవత్ వ్యాఖ్యలా?


ఆమెరికాలో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ చేసిన ప్రసంగంపై కపిల్ సిబల్ విమర్శ



**న్యూఢిల్లీ :** అమెరికాలో వైవిధ్యం గురించి ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్యలు చేయడంపై రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ తీవ్ర విమర్శలు గుప్పించారు. భాగవత్ మాట్లాడుతుంటే అది కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మాటలా లేక సంఘ్ చీఫ్ మాటలా అని తనకు సందేహం కలిగిందని, విదేశాల్లో ఉన్నప్పుడు ఆయన భిన్నమైన వైఖరిని అవలంబిస్తున్నారని సిబల్ ఆరోపించారు. 'మీరు విదేశాల్లో వైవిధ్యాన్ని అంగీకరిస్తారు, కానీ స్వదేశంలో మాత్రం వైవిధ్యాన్ని సహించరు' అని సీనియర్ న్యాయవాది, స్వతంత్ర రాజ్యసభ ఎంపి అయిన సిబల్ భాగవత్‌ను ఉద్దేశించి అన్నారు. 'హిందుత్వ వాస్తవికత ఇదే. ప్రజలను బతకనివ్వండి, బతకండి అనే సూత్రంతో జీవించడానికి మీరు అనుమతించడం లేదని, దురదృష్టవశాత్తు 2014 నుండి ఇప్పటి వరకు ఈ దేశంలో జరుగుతున్న పోరాటం ఇదేనన్నారు. ఉదాహరణకు జంతర్ మంతర్ ఘటనను తీసుకుంటే, ఈ ప్రభుత్వం ఏం చేసింది? అప్పుడు మీరు గొంతు విప్పారా? లేదు, ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మీరు ఒక్క మాట కూడా అనలేదు అని సిబల్ ఆదివారం ఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో అన్నారు. వైవిధ్యంలో ఏకత్వం అనేది భారత్ డిఎన్ఎలో అంతర్భాగమని, దానిని గౌరవించి, ఆచరించి, అంగీకరించాలని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ పేర్కొన్న నేపథ్యంలో సిబల్ ఈ విమర్శలు చేశారు. న్యూయార్క్‌లోని ప్రసిద్ధ మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లోని ఇన్ఫోసిస్ థియేటర్‌లో శనివారం జరిగిన భారీ సభలో, 6,000 మందికి పైగా భారతీయఅమెరికన్ కమ్యూనిటీ సభ్యులు మరియు వివిధ మతాల నాయకులను ఉద్దేశించి ప్రసంగించిన భాగవత్, వైవిధ్యాన్ని స్వీకరించాలని మరియు వివిధ వర్గాలకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. భాగవత్ వ్యాఖ్యలపై సిబల్ స్పందిస్తూ 'అది రాహుల్ గాంధీ ప్రసంగమా లేక భాగవత్ జీ ప్రసంగమా అని నాకు సందేహం కలిగింది. ఎందుకంటే భారతీయులు ఒకరి పట్ల ఒకరు ఎలా స్పందిస్తారు అనే విషయం గురించి ఆయన మాట్లాడినప్పుడు, భాగవత్ దేని గురించి మాట్లాడుతున్నారు? సరిగ్గా ఇదే విషయాన్ని రాహుల్ గాంధీ ఎప్పుడూ చెబుతుంటారన్నారు. మూక దాడులు జరిగినప్పుడు, బాధితుల పట్ల మీకు ఏమైనా బాధ కలుగుతుందా? వారి గురించి ఎప్పుడైనా మాట్లాడారా? నా దేశంలో ఇలా ఎందుకు జరుగుతోందని ఎప్పుడైనా ప్రశ్నించారా లేదా విమర్శించారా?' అని సిబల్ భాగవత్‌ను తీవ్రంగా విమర్శించారు.

## 'కేరళం'గా మార్పులో అనవసర ఖర్చు వద్దు

అన్ని విభాగాలకు సర్క్యులర్ జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి




**తిరువనంతపురం:** కేరళ రాష్ట్ర పేరు ను 'కేరళం'గా మారుస్తూ ఇటీవల రాష్ట్రపతి కార్యాలయం గెజిట్ విడుదల చేసింది. దీంతో పేరు మార్చే ప్రక్రియలో అనవసరమైన ఖర్చులను నివారించాలని రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖలు, ప్రభుత్వ సంస్థలను ఆదేశించింది. ప్రస్తుతం ఉన్న సామగ్రిని అనవసరంగా పారవేయకుండా ఈ మార్పును అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ సిన్హా ఒక సర్క్యులర్ ద్వారా ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, బోర్డులు, కార్పొరేషన్లు, స్థానిక స్వపరిపాలన సంస్థలు, ప్రభుత్వ నియంత్రణలో ఉన్న ఇతర సంస్థలకు సూచించారు. 'కేరళ' అని ముద్రించి ఉన్న లెటర్ హెడ్లు, కవర్లు, ఫారమ్‌లు, రిజిస్టర్లు, ఫైళ్లు, ప్రచురణలు, ఇతర స్టేషనరీలను ప్రస్తుతం ఉన్న నిల్వలు అయిపోయే వరకు ఉపయోగించాలని, అవసరమైన చోట సిరాతో సవరణలు చేయాలని ఆ సర్క్యులర్ పేర్కొన్నారు. కేవలం రాష్ట్రం పేరు మారిన కారణంతోనే ప్రస్తుత సామగ్రిని పారవేయడం లేదా కొత్తగా ముద్రించడం చేయకూడదని అందులో స్పష్టంగా పేర్కొన్నారు. ప్రస్తుతం వాడుకలో ఉన్న అధికారిక ముద్రలు, రబ్బరు స్టాంపులు, ఇతర వస్తువులను కూడా సాధారణ ప్రక్రియలో భాగంగా మార్చాల్సిన అవసరం వచ్చే వరకు ఉపయోగించవచ్చని, ఆచరణ సాధ్యమైన చోట, కొత్త ముద్రలను వెంటనే తయారు చేయడానికి బదులుగా సిరాతో అవసరమైన సవరణలు చేయవచ్చన్నారు. కేవలం పేరు మార్పు కారణంగానే ప్రస్తుతం ఉన్న సైన్‌బోర్డులు, కార్యాలయ నామఫలకాలు, మైలురాళ్లు, దిశా సూచికలు, ఇతర శాశ్వత లేదా పాక్షికశాశ్వత బోర్డులను మార్చాల్సిన అవసరం లేదని కూడా ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. సాంకేతికంగా సాధ్యమైన చోట, ఆంగ్లం, మలయాళ భాషలలో ఉన్న సైన్‌బోర్డులపై సంబంధిత భాషలలో అవసరమైన అక్షరాలను చేర్చడం ద్వారా 'కేరళ' అనే పదాన్ని మార్చవచ్చన్నారు. బోర్డులకు సాధారణ పెయింటింగ్, మరమ్మత్తు లేదా మార్పు అవసరమైనప్పుడు అటువంటి సవరణలు చేయవచ్చని సర్క్యులర్ తెలిపారు. ప్రభుత్వ వెబ్‌సైట్లు, ఇతర ఐటి ఆధారిత వ్యవస్థలలో కూడా అదనపు ఆర్థిక భారం లేకుండా సవరించిన పేరును చేర్చాలని, దీనికి సంబంధించి సమాచార సాంకేతిక శాఖ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

## సిపిఐ డిమాండ్‌లో మార్పు లేదు

అసెంబ్లీలో ప్రతిపక్ష ఉపనేత పదవిపై సిపిఐ ఎమ్మెల్యే అనిల్ పునరుద్ఘాటన



**తిరువనంతపురం :** కేరళం అసెంబ్లీలో ప్రతిపక్ష ఉపనేత పదవికి సంబంధించి తమ పార్టీ డిమాండ్‌లో ఎలాంటి మార్పు లేదని సిపిఐ ఎమ్మెల్యే జి.ఆర్. అనిల్ పునరుద్ఘాటించారు. ఈ సమస్యను బహిరంగ వివాదంగా కాకుండా, పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఆదివారం అనిల్ విలేకరులతో మాట్లాడుతూ సిపిఐ వైఖరిని పార్టీ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం ఇప్పటికే స్పష్టం చేశారని, ఈ అంశంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం వామపక్ష ఐక్యతకు ఏమాత్రం ప్రయోజనకరం కాదని అనిల్ పేర్కొన్నారు. ఈ సమస్య పరస్పర చర్చల ద్వారా పరిష్కారం అవుతుందని తాను ఆశిస్తున్నానన్నారు. 'ఇక్కడ ఇతర పదవులు సమస్య కాదు. అసలు ఈ పదవికి ఏమైనా ప్రత్యేక అధికారాలు ఉన్నాయా? శత్రుత్వాన్ని పెంచే విధంగా తమను తాము సమర్థించుకునే అవకాశంగా దీనిని మార్చుకోకూడదు' అని అనిల్ అన్నారు. మరోవైపు, సీనియర్ సిపిఐ(ఎం) నాయకుడు ఎ.కె. బాలన్ మీడియాతో మాట్లాడుతూ, ఎల్‌డిఎఫ్‌లో విభేదాలు ఉన్నాయన్న వార్తలను కొట్టిపారేశారు. సిపిఐ(ఎం), సిపిఐ కూటమిలో భాగంగానే కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్ష నాయకుడు చెప్పినదే సిపిఐ(ఎం) వైఖరి అని, బినోయ్ విశ్వం, సత్యన్ మోకేరి చెప్పినదే సిపిఐ వైఖరి అని, వారు దానినే చెబుతూ ఉంటారు అని బాలన్ అన్నారు. అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ, రెండు పార్టీలు ఐక్యంగా ఉంటాయని, ఎల్‌డిఎఫ్‌లో భాగంగానే కొనసాగుతాయని ఆయన చెప్పారు.

## ప్రధాని నరేంద్ర మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పురస్కారం



**తాష్కెంట్:** ఉజ్బెకిస్థాన్ విదేశీ నేతలకు అందించే అత్యున్నత పురస్కారం 'ఒలీ దరజాలి దోస్టిక్' ఆర్డర్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం అందుకున్నారు. ఉజ్బెక్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. భారత్–ఉజ్బెకిస్థాన్ మధ్య స్నేహ సంబంధాలను బలోపేతం చేసినందుకు మోదీకి ఈ గౌరవం లభించింది. ఈ పురస్కారాన్ని 140 కోట్ల మంది భారతీయులకు, ఇరు దేశాల శతాబ్దాల స్నేహానికి అంకితం చేస్తున్నట్లు మోదీ తెలిపారు. ప్రధాని పర్యటనలో భాగంగా ఇరు దేశాలు తమ సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచాలని నిర్ణయించాయి. వాణిజ్యం, స్వచ్ఛ ఇంధనం, అనుసంధానత వంటి రంగాల్లో సహకారంపై చర్చలు జరిగాయి.

**సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం**

భారత్, ఉజ్బెకిస్థాన్ తమ సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచాలని నిర్ణయించాయి. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 500 కోట్ల డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ప్రస్తుతం ఇరు దేశాల వాణిజ్యం 100 కోట్ల డాలర్లకు పైగా ఉంది. పౌర అణుశక్తి రంగంలో సహకారంలో భాగంగా ఉజ్బెకిస్థాన్ నుంచి భారత్‌కు దీర్ఘకాలికంగా యురేనియం సరఫరా చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించాయి. ప్రధాని నరేంద్ర మోదీ, ఉజ్బెక్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ చర్చల్లో వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, కీలక ఖనిజాలు, వ్యవసాయం, ఔషధాలు, ఆరోగ్యం, ఐటి, యుపిఐ తదితర అంశాలపై దృష్టి పెట్టారు. రక్షణ ఉత్పత్తుల అభివృద్ధి, తయారీలో ఇరు దేశాల పరిశ్రమలు కలిసి పనిచేయాలని నిర్ణయించారు. ఉగ్రవాదం, తీవ్రవాదం, వేర్పాటువాదంపై 'సహన శూన్యత' విధానాన్ని కొనసాగించాలని ఇరువురు నేతలు స్పష్టం చేశారు. సంబంధాలకు దిశానిర్దేశం చేసేందుకు విదేశాంగ మంత్రుల స్థాయిలో సమన్వయ మండలిని ఏర్పాటు చేయనున్నారు.

## 12లోగా సమస్య పరిష్కరించాలి

● మహారాష్ట్ర ప్రభుత్వానికి జారంగే డిమాండ్ ● మరాఠాలకు కున్బీ కుల ధృవీకరణ పత్రాలు జారీకి తగిన చర్యలు తీసుకోకపోతే ముంబయికి పాదయాత్ర చేస్తానని హెచ్చరిక



**జాల్నా :** మరాఠాలందరికీ కున్బీ కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వాలన్న తన డిమాండ్‌కు కట్టుబడి ఉంటానని ఉద్యమకారుడు మనోజ్ జారంగే స్పష్టం చేశారు. తన నిరవధిక నిరాహార దీక్ష ఆదివారం రెండవ రోజుకు చేరుకుంది. ఈ తరుణంలో మహారాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోతే ముంబయికి పాదయాత్ర చేస్తానని ఆయన హెచ్చరించారు. మరాఠా రిజర్వేషన్ డిమాండ్ల సాధన కోసం జాల్నా జిల్లాలోని తన స్వగ్రామమైన అంతర్వాలి సరతిలో జారంగే శనివారం నిరాహార దీక్షను ప్రారంభించారు; ఈ ఉద్యమానికి మద్దతుగా వేలాది మంది సంఘ సభ్యులు అక్కడ తరలి వచ్చారు. విద్య, ప్రభుత్వ ఉద్యోగాలలో ఇతర వెనుకబడిన తరగతుల (ఒబిసి) విభాగం కింద రిజర్వేషన్ ప్రయోజనాలను పొందుతున్న వ్యవసాయ ఆధారిత కున్బీ సామాజిక వర్గంగా, అర్హులైన మరాఠాలను గుర్తించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం మరాఠాలందరినీ కున్బీలుగా ప్రకటించాలని ఆదివారం జారంగే విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించకపోతే ముంబయికి పాదయాత్ర చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తానని జారంగే పేర్కొన్నారు. ముంబయిలో చేపట్టబోయే నిరాహార దీక్షపై నిర్ణయం తీసుకునేందుకు, ఆయన నేతృత్వంలోని మరాఠా సంఘం కోర్ కమిటీ సమావేశం సెప్టెంబర్ 12న అంతర్వాలి సరతిలో జరగనుంది. సెప్టెంబర్ 12 నాటికి ప్రభుత్వం మా డిమాండ్లను అంగీకరిస్తే, ముంబయిలో ప్రతిపాదించిన దీక్షను చేపట్టాల్సిన అవసరం ఉండదు అని ఆయన చెప్పారు. 58 లక్షల చారిత్రక రికార్డుల ఆధారంగా అర్హులైన మరాఠా సామాజిక వర్గ సభ్యులకు తక్షణమే కున్బీ ధృవీకరణ పత్రాలను జారీ చేయాలని జారంగే డిమాండ్ చేస్తున్నారు. ఇకపై అదనపు సమయం ఇచ్చేది లేదని ఆయన స్పష్టం చేశారు.

రాజకీయ పార్టీల నగదు విరాళాలు సంబంధిత పిటిషన్‌పై

## 'నేడు' సుప్రీంకోర్టు విచారణ

**న్యూఢిల్లీ :** రాజకీయ పార్టీలు రూ.2,000లోపు విరాళాలను 'అజ్ఞాతంగా' స్వీకరించడానికి అనుమతించే ఆదాయపు పన్ను చట్టంలోని ఒక నిబంధన చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం విచారణ జరపనుంది. ఈ పారదర్శకత లోపం ఎన్నికల ప్రక్రియ పవిత్రతను దెబ్బతీస్తుందని, ఎందుకంటే ఇది ఓటర్లకు రాజకీయ నిధుల మూలం, దాతల, వారి ఉద్దేశాల గురించిన కీలక సమాచారాన్ని అందకుండా జేస్తుందని, తద్వారా, వారు తమ ఓటు వేసేటప్పుడు హేతుబద్ధమైన, తెలివైన, సంపూర్ణ సమాచారంతో కూడిన నిర్ణయం తీసుకోకుండా నిరోధిస్తుందని పిటిషన్‌లో పేర్కొన్నారు. సుప్రీంకోర్టు కాజ్ లిస్ట్ ప్రకారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ విషయాన్ని విచారించే అవకాశం ఉంది. అంతకు ముందు, సుప్రీంకోర్టు కేంద్రం, ఎన్నికల సంఘాని(ఇసి)కి నోటీసులు జారీ చేస్తూ, పిటిషన్‌పై వారి స్పందనలు కోరింది. రాజకీయ పార్టీ నమోదుకు, ఎన్నికల గుర్తు కేటాయింపునకు ఏ రాజకీయ పార్టీ కూడా నగదు రూపంలో ఎలాంటి మొత్తాన్ని స్వీకరించకూడదనే నిబంధనను విధించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ పిటిషనర్ ఖేమ్ సింగ్ భాటి తన పిటిషన్‌లో అభ్యర్థించారు. ఆదాయపు పన్ను చట్టం 1961 యొక్క సెక్షన్ 13ఎ లోని క్లాజ్ (డి)ని రాజ్యాంగ విరుద్ధమని కొట్టివేయాలని పిటిషనర్ కోరారు. ఎలక్టోరల్ బాండ్లను రద్దు చేసిన అత్యున్నత న్యాయస్థానం 2024 తీర్పును కూడా పిటిషనర్ ప్రస్తావించారు. 'రాజకీయ నిధులలో పారదర్శకతను పాటించేందుకు రాజకీయ పార్టీలు, తమకు డబ్బు చెల్లించే వ్యక్తి పేరు, ఇతర వివరాలను అన్నింటినీ తప్పనిసరిగా వెల్లడించాలని, ఎలాంటి మొత్తాన్ని నగదు రూపంలో స్వీకరించరాదని ఆదేశాలు జారీచేయాలని పిటిషనర్ కోరుతున్నారు' అని దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. చట్టంలోని సెక్షన్ 13ఏను ప్రవేశపెట్టారని, దీని ప్రకారం, రాజకీయ పార్టీలకు సెక్యూరిటీలపై వడ్డీ రూపంలో వచ్చే ఆదాయం, గృహ ఆస్తి నుంచి వచ్చే ఆదాయం, లేదా ఇతర వనరుల నుంచి వచ్చే ఆదాయం, స్వచ్ఛంద విరాళాలు మొత్తం ఆదాయం లెక్కింపు నుంచి మినహాయించబడతాయని పిటిషన్‌లో తెలిపారు.

## మహోన్నత 'శిఖర' స్ఫూర్తి.. శివాని మెహ్రోత్రా

యూరప్‌లోని మౌంట్ ఎల్బ్రస్‌పై 'త్రివర్ణపతాకం' ఎగురవేసిన ధీర మహిళ



**లక్నో:** ఆమె 43 ఏళ్ల పర్వతారోహకురాలు మాత్రమే కాదు. ఒక మహోన్నత స్ఫూర్తి శిఖరం. ఓ 18ఏళ్ల కూతురుకు అన్నీ తానైన ఒక తల్లిగా, కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న ఒక గృహిణిగా, పర్వతారోహణ ఆశయాన్ని అసలే వీడని ఒక ఒక మహిళగా అన్నీ ఏకకాలంలో కొనసాగిస్తున్న ధీర మహిళ. ఆమె ప్రపంచంలోని అత్యంత ఎత్తైన శిఖరాలలో కొన్నింటిపై తన పరిమితులను పరీక్షిస్తూనే ముందడుగు వేస్తున్న పర్వతారోహకురాలిగా ప్రశంసలందుకుంటున్న శివాని మెహ్రోత్రా. ఉత్తర్‌ప్రదేశ్‌లోని సీతాపూర్ జిల్లాకు చెందిన మెహ్రోత్రా 24ఏళ్ల వయసులోనే లక్నోలో వివాహం చేసుకుంది. ప్రస్తుతం ఈమె తన కుటుంబంతో ముంబైలో నివసిస్తున్నారు. మెహ్రోత్రా ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవాన్ని యూరప్‌లోనే ఎత్తైన శిఖరమైన రష్యాలోని మౌంట్ ఎల్బ్రస్ పైన త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి వేడుకలు జరుపుకున్నారు. రష్యా నుంచి భారత్‌కు తిరిగివస్తున్న సమయంలో ఆమె 'పిటిఐ'తో ఫోన్‌లో మాట్లాడారు. ఆగస్టు 15న జరిగిన శిఖరాగ్ర ప్రయాణం తనకు ఒక శారీరక ఓర్పుతోపాటు మానసిక బలానికి కూడా ఒక పరీక్ష అని మెహ్రోత్రా తన అనుభవాలను పంచుకున్నారు. 'వయస్సు అనేది కేవలం ఒక సంఖ్య మాత్రమేనని నేనెప్పుడూ నమ్ముతాను' అని ఆమె అన్నారు. ఉన్నత లక్ష్యాలను సాధించే క్రమంలో వయస్సు కన్నా పట్టుదల, క్షమశిక్షణే ముఖ్యమని శివాని మెహ్రోత్రా నొక్కిచెప్పారు. మెహ్రోత్మాకు ఈ ప్రయాణంలో తన ఆశయాలను భార్యగా, తల్లిగా తన బాధ్యతలను సమతుల్యం చేసుకోవడం ఇమిడి ఉంది. పర్వతారోహణను ఒక వృత్తిగా చేపట్టమని తనను ప్రోత్సహించనందుకు ఆమె తన తల్లిదండ్రులకు, భర్తకు, కుమార్తెకు, స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపింది. ట్రెక్కింగ్, పర్వతారోహణ చేసే మహిళలు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారని, ముఖ్యంగా, 'పర్వతాలపై 40 ఏళ్లు పైబడిన మహిళలను నేను చాలా అరుదుగా చూస్తాను' అని శివాని మెహ్రోత్రా చెప్పారు. 'నా కుటుంబం ఎల్లప్పుడూ నన్ను ప్రోత్సహిస్తూ, ఇది చేయడానికి నాకు ధైర్యాన్నిచ్చింది' అని ఆమె వ్యాఖ్యానిస్తూ, నా అతి పెద్ద యాత్రకు నా సొంత పొదుపుతో నిధులు సమకూర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాను' అని శివాని మెహ్రోత్రా వివరించారు. 2019లో తన ప్రాణ స్నేహితురాలితో కలిసి మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ ట్రెక్కింగ్‌కు వెళ్లాలని పణాళిక వేయడంతో ఆమెకు పర్వతారోహణపై మక్కువ పెరిగింది. ఒకే ఒక్క ట్రెక్కింగ్ ప్రణాళికతో ప్రారంభమైనది త్వరలోనే ఒక అభిరుచిగా మారి, ఆమెను హిమాలయలలో భాగంగా ఉన్నటువంటి కశ్మీర్, లడాఖ్, హిమాచల్ ప్రదేశ్ సహా అనే క ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లింది. కొవిడ్ –19 మహమ్మారి సమయంలో మెహ్రోత్రా అభిరుచి యోగా వైపు మళ్లి, ఆ తర్వాత ఉన్నత స్థాయి యోగా అభ్యాసకురాలిగా, థెరపిస్ట్‌గా శిక్షణ పొందారు. అంతేకాకుండా, శివాని మెహ్రోత్రా ఆరు సంవత్సరాలుగా యోగా బోధిస్తున్నారు. ఇందులో ప్రసవానికి ముందు, ప్రసవం తర్వాత మహిళలకు, అలాగే కేన్సర్ రోగులకు ప్రత్యేక కార్యక్రమాలు కూడా ఉన్నాయి. ఆమె ప్రతీరోజూ ఉదయం 3–30గంటలకే నిద్రలేచి, యోగా, జిమ్ వర్కౌట్లు, పరుగు, ట్రెక్కింగ్ సన్నాహాలు చేస్తూ, కఠినమైన ఫిట్ నెస్, ఆహార నియమాలను పాటిస్తోంది. ఎవరెస్ట్ శిఖరం అధిరోహణ కోసం సిద్ధమవుతున్న ఆమె తన తదుపరి లక్ష్యాలలో నేపాల్‌లోని ఎత్తైన శిఖరాలను అధిరోహించాలని అనుకుంది. 'ఎవరెస్ట్ నా ప్రధాన లక్ష్యం. నేను దానిని సాధించాల్సిందే' అని శివాని మెహ్రోత్రా నొక్కి చెప్పారు.


## దేశాన్ని డ్రగ్స్ రహితంగా మారుద్దాం

'మన్ కీ బాత్'లో ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు

**న్యూఢిల్లీ:** మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా ఏకం కావాలని, యువతకు బలమైన భవిష్యత్తును నిర్మించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం దేశ పౌరులకు విజ్ఞప్తి చేశారు. వ్యసనం కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా యావత్ సమాజాన్ని ప్రభావితం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. తన నెలవారీ రేడియో ప్రసంగం 'మన్ కీ బాత్'లో ఆయన మాట్లాడుతూ, 'అభివృద్ధి చెందిన భారతదేశం కోసం మాదకద్రవ్య రహిత యువత' ప్రచారం దేశ వ్యాప్తంగా వేగంగా ఊపందుకుంటోందని, లక్ష్యం స్పష్టంగా ఉందని 'మాదకద్రవ్య రహిత యువత, మాదకద్రవ్య రహిత భారతదేశం' అని అన్నారు. ఈ ప్రచారం కేవలం ఒక లాంఛనప్రాయంగా మిగిలిపోకుండా, చాలా మంది ప్రజలు, ముఖ్యంగా యువత పెద్ద సంఖ్యలో ఇందులో భాగమవుతున్నందుకు సంతోషంగా ఉన్నానని ప్రధానమంత్రి అన్నారు. 'అన్నింటికంటే ముఖ్యంగా, ఇది భారతదేశ యువత ఆరోగ్యం, ఆనందం, ఉజ్వల భవిష్యత్తు కోసం మనందరి సమష్టి సంకల్పం. భారతదేశ యువతను మాదకద్రవ్యాలకు దూరంగా, వ్యసనం నుండి విముక్తిగా ఉంచే ఈ గొప్ప కార్యక్రమంలో మనమందరం మన వంతు పాత్ర పోషిద్దాం' అని ఆయన అన్నారు. వీధి వ్యాపారుల కోసం ఉద్దేశించిన పిఎం స్వానిధి యోజన సంక్షేమ పథకాన్ని కూడా ప్రధానమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, దీని ద్వారా లక్షలాది మంది మహిళలు బలం పుంజుకుంటున్నారని పేర్కొన్నారు. నగరాలు, పట్టణాల వీధుల్లో లక్షలాది మంది మహిళలు కూరగాయలు లేదా పండ్లు అమ్ముతూ, టీ స్టాల్స్ నడుపుతూ, మరికొందరు పువ్వులు, మట్టి దీపాలు, పూజా సామాగ్రిని అమ్ముతున్నారని ఆయన గమనించానన్నారు. 'పిఎం స్వనిధి యోజన' లబ్ధిదారులలో సుమారు 46 శాతం మంది మహిళలే ఉన్నందున, మహిళా సాధికారత అనే ఈ అంశంపై తగినంతగా చర్చ జరగడం లేదని మోదీ అన్నారు. ఈ సమయంలో ప్రతి ఒక్కరి హృదయంలోనూ దేశం పట్ల ప్రేమ భావం మరింత బలపడుతుందని మోదీ అన్నారు. 'జాతీయ చేనేత దినోత్సవం', 'క్విట్ ఇండియా ఉద్యమ' వార్షికోత్సవం, 'విభజన భయానక జ్ఞాపకాల దినోత్సవం' ఈ నెలను ప్రత్యేకంగా మారుస్తాయని, అలాగే 'స్వాతంత్ర్య దినోత్సవం', 'జాతీయ అంతరిక్ష దినోత్సవం' ప్రతి భారతీయుడిలోనూ గర్వకారణంగా నిలుస్తాయని ఆయన చెప్పారు.

### విశ్వ రహస్యాల అన్వేషణకు బయలుదేరిన

# నాసా కొత్త టెలిస్కోప్ 'రోమన్'



**కేప్ అఏఆవెరల్ (అమెరికా):** అమెరికా అంతరిక్ష సంస్థ నాసా రూపొందించిన కొత్త తరం టెలిస్కోప్ 'నాన్సీ గ్రేస్ రోమన్ స్పేస్ టెలిస్కోప్' ఆదివారం విజయవంతంగా అంతరిక్షంలోకి దూసుకెళ్లింది. స్పేస్ఎక్స్‌కు చెందిన ఫాల్కన్ హెవీ రాకెట్ ద్వారా కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి ప్రయోగించిన ఈ టెలిస్కోప్ విలువ 430 కోట్ల డాలర్లు. భూమికి 16లక్షల కిలోమీటర్ల దూరంలోని పరిశీలనా ప్రాంతానికి చేరుకోవడానికి దీనికి మూడు నెలలకు పైగా పడుతుంది. రోమన్ ప్రధాన ప్రత్యేకత దాని విస్తృత పరిశీలనా సామర్థ్యం. హబుల్ టెలిస్కోప్‌తో పోలిస్తే రోమన్ ఒకేసారి 100 రెట్లకుపైగా విశాలమైన ఆకాశ ప్రాంతాన్ని పరిశీలించగలదు. కోట్లాది నక్షత్రాలు, గెలాక్సీలు, వేలాది సూపర్‌నోవాలు, పదివేలకుపైగా గ్రహాలను గుర్తించే సామర్థ్యం దీనికి ఉంటుంది. రోమన్ కనుగొనే ఆసక్తికరమైన గ్రహాలను మరింత శక్తివంతమైన జేమ్స్ వెబ్ టెలిస్కోప్ తదుపరి దశలో పరిశీలించగలదు. విశ్వంలో ఎక్కువ భాగాన్ని ఆక్రమించినట్లు భావిస్తున్న డార్క్ మ్యాటర్, డార్క్ ఎనర్జీపై అవగాహన పెంచడం రోమన్ ప్రధాన లక్ష్యాల్లో ఒకటి. గెలాక్సీల విస్తరణను పరిశీలించడం ద్వారా విశ్వం ఎంత వేగంగా విస్తరిస్తోందో శాస్త్రవేత్తలు అంచనా వేస్తారు. నాన్సీ గ్రేస్ రోమన్ పేరుతో రూపొందిన ఈ టెలిస్కోప్‌కు అత్యంత వేగంగా పరిశీలించే సామర్థ్యం ఉంది. హబుల్ ఒక శతాబ్దంలో సేకరించేంత సమాచారాన్ని రోమన్ దాదాపు నెల రోజుల్లో సేకరించగలదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 1959లో నాసాలో చేరిన రోమన్ అంతరిక్ష పరిశీలనా కేంద్రాల అభివృద్ధికి కీలకంగా పనిచేశారు. ఆమె పేరుతో నాసా ప్రయోగించిన తొలి అంతరిక్ష టెలిస్కోప్ ఇదే.

# నైజర్‌లో సైనిక తిరుగుబాటు యత్నం

### పలువురు సైనికులు మృతి, అరెస్టు



**నియామే :** నైజర్ రాజధాని నియామేలో యువ సైనికుల బృందం తిరుగుబాటుకు ప్రయత్నించిన ఘటనలో పలువురు సైనికులు మరణించగా, మరికొందరిని భద్రతా బలగాలు అరెస్టు చేశాయి. దాదాపు 24 గంటలపాటు కొనసాగిన ఉద్రిక్తతలతో కీలక సైనిక స్థావరం వద్ద కాల్పులు, పేలుళ్లు చోటుచేసుకున్నాయి. అధ్యక్ష భవనానికి సమీపంలోని ఈ స్థావరాన్ని ప్రభుత్వ అనుకూల బలగాలు తిరిగి తమ ఆధీనంలోకి తెచ్చుకున్నట్లు అధికారిక టీవీ తెలిపింది. రష్యాకు చెందిన ఆఫ్రికా కారప్స్ స్థానిక బలగాలకు వైమానిక, భూతల సహాయం అందించినట్లు విశ్లేషకులు, దౌత్యవేత్తలు వెల్లడించారు. తిరుగుబాటుదారుల్లో కొందరు దేశంలోని తీవ్ర హింసకు గురవుతున్న ప్రాంతాల నుంచి వచ్చినవారని సమాచారం. సైనికాధికారులను బందీలుగా పట్టుకుని, కీలక ప్రాంతాలపై కాల్పులు జరపడంతో తిరుగుబాటు ప్రారంభమైందని రక్షణ మంత్రి జనరల్ సలీఫు మొడీ తెలిపారు. సైనిక పాలకుడు అబ్దురహమానేత్చియాని ఆచూకీ మాత్రం స్పష్టంగా తెలియలేదు. 2023లో సైనిక తిరుగుబాటు ద్వారా అధికారంలోకి వచ్చిన జుంటా, జిహాదీ హింసను అరికట్టడంలో విఫలమైందన్న విమర్శలు ఎదుర్కొంటోంది. పాశ్చాత్య భద్రతా భాగస్వాములతో సంబంధాలు తెంచుకుని రష్యాతో సన్నిహితమైంది. అయినప్పటికీ సాయుధ దాడులు కొనసాగుతుండటంతో సైన్యంలో అసంతృప్తి పెరుగుతోంది. ఈ ఏడాదిలోనే నియామే విమానాశ్రయంలోని సైనిక స్థావరంపై ఇది మూడో దాడి. తాజా పరిణామం జుంటా ప్రభుత్వంపై ఒత్తిడిని మరింత పెంచింది.

### ఇయులో తిరిగి చేరికపై చర్చలకు

# ఐస్‌లాండ్ ఓటర్ల తిరస్కారం



**రేక్యావిక్ :** ఐరోపా సమాఖ్య (యూరోపియన్ యూనియన్/ ఇయు)లో చేరేందుకు చర్చలను పునఃప్రారంభించాలన్న ప్రతిపాదనను ఐస్‌లాండ్ ఓటర్లు తిరస్కరించారు. శనివారం జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో 52.8 శాతం మంది ప్రతిపాదనకు వ్యతిరేకంగా, 47.2 శాతం మంది అనుకూలంగా ఓటేశారు. సుమారు 2.65 లక్షల మంది ఓటర్లకు ఈ అంశంపై ఓటు హక్కు ఉంది.
రాజధాని రేక్యావిక్‌లో మాత్రమే మెజారిటీ ప్రజలు చర్చల పునఃప్రారంభానికి మద్దతు ఇచ్చారు.
దశాబ్దం క్రితం యూరో వ్యతిరేక ప్రభుత్వం ఇయుతో చర్చలను నిలిపివేసింది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమీపంలోని గ్రీన్‌లాండ్‌పై నియంత్రణ సాధించాలంటూ చేస్తున్న వ్యాఖ్యలు ఐస్‌లాండ్‌లో యూరప్‌తో మరింత సన్నిహిత సంబంధాలపై చర్చకు ఊతమిచ్చాయి. అయితే, ఇయు సభ్యత్వాన్ని వ్యతిరేకించినవారు మత్స్య పరిశ్రమ, దేశ సార్వభౌమాధికారాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. ఇప్పటికే ఇయు సింగిల్ మార్కెట్, షెంగెన్ ప్రాంతం ప్రయోజనాలు పొందుతున్నందున పూర్తి సభ్యత్వం అవసరం లేదని వారు వాదించారు.
అనుకూల వర్గాలు మాత్రం యూరో కరెన్సీ ఆర్థిక స్థిరత్వాన్ని పెంచుతుందని, ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లను తగ్గించేందుకు ఇయు సభ్యత్వం దోహదపడుతుందని పేర్కొన్నాయి.

## మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు

### వెస్ట్‌బ్యాంక్‌లో సెటిలర్ల హింసను నెతన్యాహు ఖండన

**కైరో :** ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెల్ సెటిలర్ల హింసపై ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పందించారు. కొద్దిమంది అల్లరి మూకల చర్యలు చట్టాన్ని గౌరవించే సెటిలర్లకు అపకీర్తి తెస్తున్నాయని ఆయన అన్నారు. ఖుస్రా పట్టణంలో రెండు వారాలుగా కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు వచ్చాయి. పలువురు సెటిలర్లు పాలస్తీనీయుల ఇళ్లను చుట్టుముట్టారు. అమెరికా రాయబారి మైక్ హకబీ వారిని 'ఉగ్రవాదులు'గా అభివర్ణించారు.
మరోవైపు గాజా మధ్య ప్రాంతంలో ఇజ్రాయెల్ దాడులు, ట్యాంకు కాల్పుల్లో ముగ్గురు పాలస్తీనీయులు మరణించారు. గాజా సిటీలో మోటార్‌సైకిల్‌పై జరిగిన దాడిలో ఇద్దరు మరణించగా, దెయిర్ అల్ బలాహ్‌లో ట్యాంకు కాల్పులకు ఓ రైతు బలయ్యాడు. అల్‌అక్సా మార్టియర్స్ ఆసుపత్రి సమీపంలో జరిగిన మరో వైమానిక దాడిలో ముగ్గురు గాయపడ్డారు. దాడుల్లో హమాస్ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. ఇలావుంటే, ఇరాన్‌లో కొత్త నాయకత్వం అమెరికాతో దీర్ఘకాలిక ఘర్షణకు సిద్ధమవుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. కొత్త సుప్రీం నేత అయతొల్లా మొజ్తబా ఖమేనీ ప్రజా కార్యక్రమాలకు దూరంగా ఉన్నప్పటికీ, భద్రతా వ్యవస్థలో తనకు సన్నిహితులైన సీనియర్ నేతలకు కీలక బాధ్యతలు అప్పగించారు. దేశంలో అంతర్గత అసమ్మతిని అణచివేయడంపై కూడా నాయకత్వం దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

### పిఒకెలో నిరసనకారులపై

# పాక్ ప్రభుత్వ తీరు అమానుషం

### హెచ్ఆర్‌సిపి విమర్శ

**లాహోర్ :** పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె)లో నిరసనకారులపై ప్రభుత్వం అమానుషంగా వ్యవహరించిందని, అణచివేసేందుకు బలప్రయోగం చేసిందని పాకిస్థాన్ మానవ హక్కుల సంఘం (హెచ్ఆర్‌సిపి) ఆరోపించింది. హింస, భారీ అక్రమాలకు సంబంధించిన ఆరోపణలతో జరిగిన ఎన్నికల విశ్వసనీయతపైనా సంస్థ సందేహాలు వ్యక్తం చేసింది. హెచ్ఆర్‌సిపి విడుదల చేసిన నిజనిర్ధారణ నివేదిక ప్రకారం, పిఒకెలో నెలకొన్న అశాంతికి దీర్ఘకాలిక రాజకీయ, సామాజికఆర్థిక సమస్యలు, ప్రభుత్వ సంస్థలపై విశ్వాసం లేకపోవడం, పాలనా వైఫల్యాలే కారణం. నిరసనలను అణచివేయడానికి భద్రతా బలగాల అధిక బలప్రయోగం పరిస్థితిని మరింత తీవ్రతరం చేసింది. నిరసనల్లో పలువురు మరణించారని, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారని కుటుంబాల నుంచి తమకు సమాచారం అందిందని హెచ్ఆర్‌సిపి తెలిపింది. ఈ ఏడాది జులై 27 నుంచి ఆగస్టు 10 వరకు మూడు దశల్లో పిఒకె అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. భద్రతా పరిస్థితుల కారణంగా 45 ప్రత్యక్ష ఎన్నికల స్థానాల్లో ఏడు స్థానాలకు పోలింగ్ జరగలేదు. భారీగా భద్రతా బలగాల మోహరింపు, సమాచార వ్యవస్థలపై ఆంక్షలు, ప్రధాన రాజకీయ పార్టీల బహిష్కరణ, ఎన్నికల వాయిదాలు ఎన్నికల విశ్వసనీయతపై ప్రశ్నలు రేకెత్తించాయని హెచ్ఆర్‌సిపి పేర్కొంది.
నిరసనకారులు, రాజకీయ కార్యకర్తలు, జర్నలిస్టులపై నమోదైన కేసులను స్వతంత్రంగా సమీక్షించాలని, శాంతియుత రాజకీయ కార్యకలాపాలకు సంబంధించిన కేసులను ఉపసంహరించాలని కోరింది. జర్నలిజంపై ఆంక్షలు, కమ్యూనికేషన్ వ్యవస్థల నిలిపివేత వల్ల మరణాలు, అరెస్టులు, ఎన్నికల అక్రమాలపై స్వతంత్రంగా సమాచారం సేకరించడం కష్టమైందని తెలిపింది.

## వెయ్యి రోజులు

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణంతో 335 కోట్లకుపైగా ఉచిత ప్రయాణాల ద్వారా మహిళలకు దాదాపు రూ.11 వేల కోట్ల ప్రయాణ వ్యయం ఆదా జరగింది. గృహజ్యోతి కింద 53 లక్షలకు పైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును 43 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్‌ను ప్రభుత్వం అందిస్తున్నది. రాష్ట్రంలోని 4.54 లక్షల మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.60,487 కోట్ల రుణాలు. రూ.1,900 కోట్ల వడ్డీ రాయితీ కల్పించింది.

**ఆహార భద్రత ప్రతి పేద కుటుంబానికి భరోసా**

ఎన్నో ఏళ్ల నిరీక్షణకు తెర దించుతూ 15 లక్షలకుపైగా కొత్త రేషన్ కార్డుల జారీ చేసింది. దాదాపు 3.38 కోట్ల మందికి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఆహార భద్రత కల్పించింది. రేషన్ కార్డుదారులకు నాణ్యమైన సన్న బియ్యం పంపిణీతో దేశానికి కొత్త నమూనాగా తెలంగాణ నిలిచింది. ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, సులభంగా మార్చేందుకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసింది. సామాజిక భద్రతను మరింత విస్తరిస్తూ కొత్తగా 2.25 లక్షల మందికి పింఛన్లు మంజూరు చేసింది. మొత్తం 43 లక్షలకుపైగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులకు సామాజిక భద్రతా పింఛన్లు అందిస్తున్నది.

**ఇందిరమ్మ ఇండ్లు పేదవాడి సొంతింటి కలకు భరోసా**

తొలి దశలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం. అర్హమైన ప్రతి కుటుంబానికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సహాయం అందిస్తున్నది. గిరిజనులు, చెంచులు, అత్యంత వెనుకబడిన కుటుంబాలకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పిస్తున్నది. హైదరాబాద్ క్యూర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇండ్ల టవర్ల నిర్మాణానికి భారీ ప్రణాళికను రూపొందించింది.

**సామాజిక న్యాయంలో చారిత్రాత్మక నిర్ణయాలు**

రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే నిర్వహించి కులాల వారీ సామాజిక స్థితిగతులను వెల్లడించింది. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం 59 ఎస్‌సి ఉపకులాలను మూడు గ్రూపులుగా వర్గీకరించి, ఎస్‌సి వర్గీకరణ అమలు చేసిన దేశంలోని తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. బిసిలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులకు శాసనసభ ఆమోదం తెలిపింది. 12 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల సవరణతో దాదాపు కోటి 11 లక్షల మంది కార్మికులకు ప్రయోజనం చేకూర్చింది. గిగ్ కార్మికులకు చట్టబద్ధ గుర్తింపు, సంక్షేమ బోర్డు, సామాజిక భద్రత కల్పించే ప్రత్యేక చట్టం తీసుకు వచ్చింది.

**విద్యలో సంస్కరణలు.. ప్రభుత్వ బడులకు కొత్త రూపం**

కేంద్ర ప్రభుత్వం ప్రకటించే పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో తెలంగాణ 28వ స్థానం నుంచి 18వ స్థానానికి పురోగతిని సాధించింది. ప్రతి నియోజకవర్గంలో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌సను మంజూరు చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లతో ప్రభుత్వ విద్యకు కొత్త రూపం తీసుకువచ్చింది. ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు 22 లక్షలకు పైగా విద్యార్థులకు అల్పాహారం, పాలు, పోషకాహారం. రూ.720 కోట్ల కేటాయించింది. సంక్షేమ హాస్టళ్లలో డైట్ ఛార్జీలు 40 శాతం, కాస్మొటిక్ ఛార్జీలు 212 శాతం పెంపు జరిగింది. మెగా డీఎస్సీ ద్వారా 10,006 మంది ఉపాధ్యాయుల నియామకం చేసింది. దాదాపు 11 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉస్మానియా విశ్వవిద్యాలయానికి రూ.1,000 కోట్ల కేటాయింపు జరిగింది.

**యువతకు ఉద్యోగాలు నైపుణ్యాలకు కొత్త వేదిక**

ప్రజా ప్రభుత్వ తొలి వెయ్యి రోజుల్లో 72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, గ్రూప్1 నుంచి డీఎస్సీ వరకు కీలక నియామకాల పూర్తి చేసింది. టీజీపీఎస్సీ ద్వారా మరో 456 పోస్టులు, పోలీసు నియామక బోర్డు ద్వారా 7,437 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేసింది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో 1,190 మంది శిక్షణ పూర్తి చేయగా 838 మందికి ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు లభించాయి. 65 ప్రభుత్వ ఐటిఐలు, 57 పాలిటెక్నిక్ కాలేజీలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా తీర్చిదిద్దారు. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్స్‌తో క్రీడా రంగానికి కొత్త దిశను తీసుకువచ్చింది.

**వైద్య రంగంలో భారీ విస్తరణ సిఎంఆర్ఎఫ్‌తో పేదలకు అండ**

రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు జరిగింది. గోషామహల్లో రూ.2,700 కోట్లతో 2,000 పడకల నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం చేపట్టింది. సనత్‌నగర్‌లో టిమ్స్ ప్రారంభం కాగా అల్వాల్, ఎల్‌బి నగర్‌లో రెండు టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మాణం, తొమ్మిది కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, మరో 17 కాలేజీల నిర్మాణం కొనసాగుతున్నది. నిమ్స్‌లో 2,000 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల మైలురాయి దాటింది. 2023 డిసెంబర్ 7 నుంచి 2026 ఆగస్టు 12 వరకు సిఎం సహాయనిధి ద్వారా 5,18,186 మందికి రూ.2,526.12 కోట్ల సాయం చేసింది. సిఎంఆర్ఎఫ్ వైద్య రీయింబర్సమెంట్ ద్వారా 4,78,789 మంది పేద రోగులకు రూ.1,635.34 కోట్లు, 39,712 మందికి రూ.798.41 కోట్ల ఎల్ఓసిలు ఇచ్చింది.
ఆహార కల్తీపై తనిఖీలు, శాంపిల్ పరీక్షలు, కఠిన చర్యలను, ఆహార కల్తీ, డ్రగ్స్ ముప్పును సమగ్రంగా ఎదుర్కొనేందుకు కొత్తగా టిజి సేఫ్ సంస్థ ఏర్పాటు చర్యలను చేపట్టింది.

**ప్రజల వద్దకే పాలన మండల స్థాయికి ప్రజావాణి**

రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయి ప్రజావాణి విజయవంతమైన నేపథ్యంలో ప్రజల సమస్యలను వారి మండలంలోనే పరిష్కరించేలా అన్ని ఎంపీడీవో కార్యాలయాలకు మండల ప్రజావాణి విస్తరించింది. ప్రతి సోమవారం మండల స్థాయి అధికారులంతా ఒకేచోట అందుబాటులో ఉండి అర్జీల పరిష్కారానికి, చిన్న సమస్యల కోసం ప్రజలు జిల్లా, రాష్ట్ర స్థాయికి వెళ్లాల్సిన అవసరం తగ్గింది. త్వరలో ఆన్‌లైన్ ప్రజావాణి పోర్టల్, రాష్ట్రంలోని ఏ ప్రాంతం నుంచైనా ఆన్‌లైన్‌లో అర్జీల నమోదుకు చర్యలు చేపట్టింది.
అర్జీల పరిష్కార పురోగతిపై ప్రత్యేక డాష్‌బోర్డ్. ముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నది. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో 12,758 గ్రామసభలు, 3,175 వార్డుసభల నిర్వహణ జరిగింది.

**భూ పరిపాలన ఉద్యోగులకు భరోసా డిజిటల్ గవర్నెన్స్**

భూ భారతి చట్టం, భూధార్, ఏఐ ఆధారిత భూమిత్ర సేవలు. 3.76 లక్షల కొత్త పట్టాదార్ పాస్‌బుక్ జారీ జరిగింది. ప్రభుత్వ, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు అందించేలా ఆర్థిక క్రమశిక్షణకు చర్యలు చేపట్టింది. కొన్నేళ్లుగా పేరుకుపోయిన రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల్లో వంద రోజుల్లో రూ.600 కోట్ల చెల్లింపుచేసింది. ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు ఎంప్లాయీ హెల్త్ స్కీమ్‌ను తీసుకువచ్చింది.

**ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు**

హైదరాబాద్ చుట్టూ దాదాపు 360 కిలోమీటర్ల రీజనల్ రింగ్ రోడ్డు, రాష్ట్రవ్యాప్తంగా 6,092 కిలోమీటర్ల హ్యామ్ రోడ్ల ప్రణాళిక, హైదరాబాద్ మెట్రో రెండో దశలో ఏడు కారిడార్లతో 122.9 కిలోమీటర్ల విస్తరణ, మామునూరు విమానాశ్రయం, ఆదిలాబాద్ ఎయిర్‌ఫీల్ అభివృద్ధికి చర్యలు చేపట్టింది. మూసీ పునరుజ్జీవనంలో 55 కిలోమీటర్ల సమగ్ర అభివృద్ధి, 39 కొత్త ఎస్టీపీల ఏర్పాటు, గోదావరి నుంచి 2.5 టీఎంసీల స్వచ్ఛమైన నీటిని మూసీకి తరలించే ప్రణాళికను రూపొందించింది.

**పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణ**

బిజినెస్ రిఫామ్స్ యాక్షన్ ప్లాన్‌లో కీలక రంగాల్లో తెలంగాణ టాప్ అచీవర్‌గా నిలిచింది. టీజీఐపాస్ ద్వారా రూ.1.29లక్షల కోట్ల పెట్టుబడులను సాధించింది. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్2025లో రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడి ఒప్పందాలు జరిగాయి. టీజీఐఐసీ భూముల్లో రూ.92,281 కోట్ల పెట్టుబడులకు, 78 వేలకుపైగా ఉద్యోగ అవకాశాలకు మార్గం ఏర్పడింది. నెక్స్‌జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీతో రూ.73,360 కోట్ల పెట్టుబడులు, 3.5 లక్షల ఉద్యోగ అవకాశాల లక్ష్యంగా నిర్ణయించింది.

**ఐటి, ఎఐ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లలో దూసుకెళ్తున్న తెలంగాణ**

2025–26లో తెలంగాణ ఐటి ఎగుమతులు రూ.3.97 లక్షల కోట్లు. 12.14 లక్షల ప్రత్యక్ష ఐటి ఉద్యోగాలు సాధ్యమయ్యాయి. హైదరాబాద్‌లో 355కి పైగా గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు, 2026లోనే మరో 40 కొత్త కేంద్రాలు హైదరాబాద్‌ను ఎంచుకోవడం జరిగింది. డేటా సెంటర్లు, క్లౌడ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో దేశంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న గమ్యస్థానాల్లో తెలంగాణ నిలిచింది. అమెజాన్ నుంచి తెలంగాణకు అదనంగా 7 బిలియన్ డాలర్ల పెట్టుబడి, దేశంలో తొలి స్టేట్ ఎఐ డేటా ఎక్స్ఛేంజ్ టీజీడెక్స్ ఏర్పాటు జరిగింది.

**పర్యాటకం తెలంగాణ సంస్కృతికి కొత్త గుర్తింపు**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలి సమగ్ర టూరిజం పాలసీ–2025 విడుదలైంది. ఐదేళ్లలో రూ.15 వేల కోట్ల పెట్టుబడుల లక్ష్యం పెట్టుకోగా తొలి ఏడాదిలోనే రూ.23,174 కోట్ల పెట్టుబడులు సాధించింది.

**తెలంగాణ రైజింగ్2047.. వెయ్యి రోజుల తర్వాత మరింత పెద్ద లక్ష్యం**

వెయ్యి రోజుల ప్రజాపాలనలో సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయానికి వేసిన పునాదులపై భవిష్యత్తు తెలంగాణ నిర్మాణం లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించింది. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.
క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి వలయాలతో హైదరాబాద్ నుంచి గ్రామీణ తెలంగాణ వరకు సమగ్ర అభివృద్ధికి చర్యలు చేపట్టింది. భారత్ ఫ్యూచర్ సిటీని దేశంలో తొలి నెట్‌జీరో స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దే ప్రణాళికను రూపొందించింది. ఎఐ సిటీ, డేటా సెంటర్లు, రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో రెండో దశ, మూసీ పునరుజ్జీవనం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీతో భవిష్యత్తు తెలంగాణకు బలమైన పునాదులను ప్రభుత్వం వేస్తున్నది.

## ఎక్కడికి వెళ్లాయి!

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చకు వస్తున్న ప్రశ్నలివి. జీ గ్రూప్ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్ర వ్యక్తిగత దివాలా వ్యవహారంలో సుమారు రూ.22,006.57 కోట్ల క్లెయిమ్‌లకు కేవలం రూ.6.25 కోట్ల చెల్లింపు ప్రణాళికకు ఎన్‌సిఎల్‌టి ఆమోదం తెలపడంపై జెన్‌జీలు ప్రశ్నిస్తున్నారు. ప్రతిపాదిత చెల్లింపు మొత్తం క్లెయిమ్‌లలో సుమారు 0.028 శాతం మాత్రమే. ఈ పరిణామంపై హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకుతో పాటు పలువురు రుణదాతలు అభ్యంతరం వ్యక్తం చేయగా, హెడ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఎన్‌సిఎల్ఎటిను ఆశ్రయించే అవకాశాన్ని పరిశీలిస్తోంది. వేల కోట్ల రూపాయల రుణాలు ఒక్కరోజులో మంజూరు కావు. సంస్థల ఆర్థిక పరిస్థితి, ఆస్తులు, నగదు ప్రవాహం, వ్యాపార సామర్థ్యం, ప్రమోటర్ల హామీలు, రుణ భద్రత వంటి అనేక అంశాలను పరిశీలించిన తర్వాతే బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయి. అయితే ఆ స్థాయిలో పరిశీలన జరిగినప్పటికీ రుణం తిరిగి రాకపోతే, బ్యాంకుల రిస్క్ అంచనా ప్రక్రియలో లోపం ఎక్కడ జరిగింది? అని జన్‌జీలు ప్రశ్నిస్తున్నారు.
ఇక్కడ మరో ముఖ్యమైన అంశం ఉంది. ఈ కేసులో పేర్కొంటున్న రూ.22,006.57 కోట్లు మొత్తం సుభాష్ చంద్ర వ్యక్తిగతంగా తీసుకున్న రుణం కాదు. ఎస్సెల్, జీ గ్రూప్‌కు చెందిన పలు సంస్థల రుణాలకు ఆయన వ్యక్తిగత హామీదారుగా ఉన్న నేపథ్యంలో, ఆయనపై ఉన్న క్లెయిమ్‌ల మొత్తం అది. ప్రధాన రుణం మంజూరు చేసేటప్పుడు కోట్ల రూపాయల విలువైన ఆస్తులు, వ్యాపార విలువలు, హామీలు చూపిస్తారు. కానీ రుణం డిఫాల్ట్ అయిన తర్వాత వాటి వాస్తవ విలువ ఎంత? వాటిని ఎంత వేగంగా నగదుగా మార్చగలరు? రుణదాతకు ఎంత తిరిగి వస్తుంది? అనే అంశాలు కీలకంగా మారతాయి. సుభాష్ చంద్ర కేసులో రుణదాతలకు ప్రతిపాదించిన రికవరీ అత్యంత తక్కువగా ఉండటంతో రుణం ఇచ్చే సమయంలో చేసిన అంచనాలు, డిఫాల్ట్ తర్వాత లభిస్తున్న రికవరీ మధ్య ఇంత భారీ అంతరం ఎందుకు ఏర్పడింది? అనే ప్రశ్న ముందుకొస్తోంది.

**బ్యాంకులకు నష్టం అయితే భారం ఎవరిది..?**

బ్యాంకుల డబ్బు అంటే కేవలం బ్యాంకు యాజమాన్యానికి చెందిన మూలధనం మాత్రమే కాదు. ప్రజలు, ఉద్యోగులు, చిన్న వ్యాపారులు, పెన్షనర్లు దాచుకునే డిపాజిట్లు కూడా బ్యాంకింగ్ వ్యవస్థకు కీలక నిధులు. అందువల్ల భారీ రుణాలు నిరర్థక ఆస్తులుగా మారినప్పుడు, చివరకు ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం పడుతుంది. అయితే ఈ ఒక్క కేసు వల్లే ప్రజల డిపాజిట్లకు రూ.22 వేల కోట్ల నష్టం వాటిల్లిందని చెప్పడం వాస్తవం కాదు. అలాగే కేంద్ర ప్రభుత్వం నేరుగా రూ.22 వేల కోట్ల రుణాన్ని మాఫీ చేసిందని చెప్పడానికి కూడా ఆధారం లేదు. ఇది సుభాష్ చంద్ర వ్యక్తిగత హామీకి సంబంధించిన దివాలా పరిష్కార ప్రక్రియ.

**సామాన్యుడికి కఠిన నిబంధనలు.. కార్పొరేట్‌కు 'హెయిర్‌కట్'..?**

ఇక్కడే సామాన్య ప్రజల ఆగ్రహానికి కారణమయ్యే ప్రధాన అంశం ఉంది. ఒక చిన్న వ్యాపారి బ్యాంకు రుణం చెల్లించడంలో విఫలమైతే అతని ఆస్తులు వేలం వేయడం, నోటీసులు ఇవ్వడం, క్రెడిట్ చరిత్ర దెబ్బతినడం వంటి పరిణామాలు వేగంగా ఎదురవుతాయి.
అదే సమయంలో భారీ కార్పొరేట్ రుణాల విషయంలో దివాలా చట్టం కింద 'హెయిర్ కట్', 'రిజల్యూషన్', 'సెటిల్‌మెంట్' వంటి ప్రక్రియల ద్వారా రుణదాతలు తమ క్లెయిమ్‌లో భారీ భాగాన్ని వదులుకోవాల్సిన పరిస్థితి వస్తే, సహజంగానే చట్టం అందరికీ సమానమేనా?అనే ప్రశ్న తలెత్తుతుంది. అయితే నిపుణుల దృష్టిలో ఐబిసి ఉద్దేశ్యం ప్రతి సందర్భంలో 100 శాతం రుణాన్ని వసూలు చేయడం కాదు. సాధ్యమైనంత మెరుగైన రికవరీతో ఆస్తుల విలువను కాపాడటం, రుణ పరిష్కారాన్ని వేగవంతం చేయడం కూడా దాని లక్ష్యాల్లో భాగమే. ఈ కేసు ప్రత్యేకంగా వ్యక్తిగత హామీదారుకు సంబంధించిన అసాధారణ వ్యవహారం** అని కూడా అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి.

**ప్రభుత్వ విధానాలపై ప్రశ్నలు..**

ఈ వ్యవహారం నేపథ్యంలో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై రాజకీయ విమర్శలు కూడా పెరుగుతున్నాయి. బ్యాంకింగ్ వ్యవస్థలో భారీ కార్పొరేట్ రుణాలకు ఎవరు బాధ్యత వహించాలి? రుణాలు మంజూరు చేసిన అధికారులపై ఎలాంటి జవాబుదారీతనం ఉండాలి? డిఫాల్ట్ తర్వాత రికవరీలో విఫలమైతే బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు కావాలనే డిమాండ్ వినిపిస్తోంది. మరోవైపు, ఈ కేసును ఆధారంగా చేసుకుని మోదీ ప్రభుత్వం రూ.22 వేల కోట్లను మాఫీ చేసింది అని నేరుగా నిర్ధారించడం వాస్తవ పరిస్థితిని అతిశయోక్తిగా చూపడమే అవుతుంది. అసలు చర్చ జరగాల్సింది వ్యవస్థలోని రుణ మంజూరు, రిస్క్ అంచనా, హామీలు, ఆస్తుల మూల్యాంకనం, డిఫాల్ట్ తర్వాత రికవరీ, దివాలా ప్రక్రియలో జవాబుదారీతనంపై.

**అసలు తేలాల్సిన ప్రశ్నలు ఇవే..**

* వేల కోట్ల రుణాలు మంజూరు చేసే ముందు బ్యాంకులు ఎంత లోతుగా పరిశీలించాయి?
* ప్రమోటర్ల వ్యక్తిగత హామీల వాస్తవ విలువను ఎవరు అంచనా వేశారు?
* రుణం డిఫాల్ట్ అయిన తర్వాత రికవరీ ఇంత తక్కువగా ఎందుకు మారింది?
* భారీ కార్పొరేట్ డిఫాల్టర్లపై జవాబుదారీతనం ఎంతవరకు ఉంది?
* బ్యాంకుల నష్టానికి చివరకు ఎవరు బాధ్యత వహించాలి?
* సామాన్య రుణగ్రహీతకు, భారీ కార్పొరేట్ రుణగ్రహీతకు దివాలా వ్యవస్థ ఒకే విధంగా పనిచేస్తుందా?

# జార్ఖండ్‌లో ముగ్గురు స్మగ్లర్లు అరెస్ట్

**హజారీబాగ్:** జార్ఖండ్‌లోని హజారీబాగ్ జిల్లాలో కాల్పుల అనంతరం ముగ్గురు స్మగ్లర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం శనివారం సాయంత్రం చౌపారన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హతియబాబా ఆలయం సమీపంలో పోలీసులు సోదాలు నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తులు గంజాయి విక్రయిస్తూ కనిపించారు. అందులో ఇద్దరిని అదుపులోకి తీసుకోగా మరొకరు తప్పించుకోవడానికి ప్రయత్నిస్తూ తనను వెంబడిస్తున్న పోలీసుల పైకి కాల్పులు జరిపాడు. పోలీసులు జరిపిన కాల్పుల్లో నిందితుడికి పొట్టలో గాయాలయ్యాయని చౌపారన్ పిఎస్ ఇన్‌చార్జి ఎస్‌హెచ్ఒ పంకజ్ కుమార్ తెలిపారు. నిందితుడిని హుటాహుటిన బర్హిసబ్ డివిజనల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి రాంచీ రిమ్స్‌కు తరలించారు. గాయపడిన నిందితుడు బిహార్‌లోని గయకు చెందిన అజయ్‌కుమార్ సింగ్‌గా, మిగతా ఇద్దరిలో ఒకరు జార్ఖండ్ చాత్ర జిల్లాకు చెందిన ఆకాశ్ రాజ్, మరొకరు బిహార్ గయకు చెందిన సోనుకుమార్‌గా గుర్తించారు. నిందితుల నుంచి పది కేజీల గంజాయి, నాటు తుపాకి, రెండు క్యాట్రిడ్జ్‌లు, ఒక ఖాళీ షెల్, కారు, నెంబర్ ప్లేట్ లేని బైక్ స్వాధీనం చేసుకున్న పోలీసులు, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# 15 ఏళ్లకే కెప్టెన్సీ.. చరిత్ర సృష్టించిన వైభవ్

పదిహేనేళ్లకే అంతర్జాతీయ క్రికెట్లో అడుగుపెట్టిన వైభవ్ సూర్యవంశీ మరో ఘనత సాధించాడు. అత్యంత పిన్నవయస్కుడిగా పలు రికార్డులు నెలకొల్పిన వైభవ్.. ఈసారి కెప్టెన్సీ చేపట్టాడు. దేశవాళీ టోర్నీ దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ వైస్ కెప్టెన్‌గా ఎంపికైన ఈ కుర్రాడు.. సెమీఫైనల్లో సారథిగా వ్యవహరించాడు. కెప్టెన్ ఇషాన్ కిషన్ గాయపడడంతో.. డిప్యూటీ అయిన వైభవ్ ఈస్ట్ జోన్ పగ్గాలు అందుకున్నాడు. తద్వారా ఫస్ట్ క్లాస్ క్రికెట్లో అతి చిన్నవయస్కుడైన సారథిగా చరిత్ర సృష్టించాడీ డాషింగ్ ఓపెనర్.

విధ్వంసక ఆటకు కేరాఫైన వైభవ్ పదిహేనేళ్లకే కెప్టెన్‌గా జట్టును నడిపించాడు. 2024లో ఫస్ట్ క్లాస్ క్రికెట్లో అరంగేట్రం చేసిన వైభవ్.. రెండేళ్లకే సారథిగా అవకాశం దక్కించుకున్నాడు. దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ వైస్ కెప్టెన్‌గా ఉన్న అతడు.. ఆదివారం సౌత్ జోన్‌తో సెమీఫైనల్ మ్యాచ్‌లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. కెప్టెన్ ఇషాన్ కిషన్ చేతికి గాయమవ్వడంతో అతడు మైదానం వీడగా.. వైభవ్ బాధ్యతలు తీసుకున్నాడు. తనకంటే



రెండింతలు వయసులో పెద్దవారైనా మహమ్మద్ షమీ, అభిమన్యు ఈశ్వరన్, ముకేశ్ కుమార్లకు 15 ఏళ్ల వైభవ్ నాయకత్వం వహించడం విశేషం. మొదటిసారి దులీప్ ట్రోఫీ ఆడుతున్న వైభవ్ నాయకుడిగా తొలి మ్యాచ్‌లోనే బౌలింగ్, ఫీల్డింగ్ మార్పులతో ఆకట్టుకున్నాడు. ముకేష్ కుమార్ ఓవర్లో ఆర్యన్ జుయల్ ఆడిన బంతి..ఎడ్జ్ తీసుకోగా వికెట్ ఒడుపుగా అందుకున్నాడు. అయితే.. అంపైర్ నాటౌట్ ఇవ్వగా.. తటపటాయిస్తూనే రివ్యూ తీసుకొని విజయవంతమయ్యాడు వైభవ్. దాంతో, తొలి రోజే సెంట్రల్ జోన్ జట్టు 266 పరుగులకే ఆలౌటైంది. రింకూ సింగ్(60), అర్యన్ జుయల్(46)లు మాత్రమే పర్వాలేదనిపించారు. ఈస్ట్ జోన్ బౌలర్లలో అభిజిత్(3–38), ముకేశ్ కుమార్(3–56)లు మూడేసి వికెట్లు తీయగా.. షమీ, ఖురేషిలు రెండేసి వికెట్లతో రాణించారు.

ఐపిఎల్‌లో రికార్డు శతకాలతో జాతీయ జట్టులోకి వచ్చిన వైభవ్ జింబాబ్వే పర్యటనలో మెరిశాడు. ఇప్పుడు దేశవాళీలోనూ అదరగొడుతున్నాడీ కుర్ర సంచలనం. ప్రతిసారి తుఫాన్ ఇన్నింగ్స్‌లతో వార్తల్లో నిలిచే వైభవ్ ఈసారి బంతితో మ్యాజిక్ చేశాడు. ఎడమ చేతివాటం స్పిన్నరైన అతడు.. నార్త్ ఈస్ట్ జోన్‌పై నాలుగు బంతుల్లోనే రెండు వికెట్లతో ఔరా అనిపించాడు. బ్యాటుతో 8 పరుగులే చేసినా ఆ రెండు వికెట్లతో ఈస్ట్ జోన్ సెమీస్ చేరడంలో తనవంతు పాత్ర పోషించిన అతడు.. తాను బౌలింగ్ చేస్తాననే విషయం కెప్టెన్ ఇషాన్ కిషన్‌కు తెలియదని చెప్పాడు. నార్త్ ఈస్ట్‌జోన్ జట్టుపై నాలుగు బంతుల్లోనే 2వికెట్లు తీసి ఆశ్చర్యపరిచాడు. ఈమ్యాచ్‌లో ఈస్ట్ జోన్ ఇన్నింగ్స్ 210 పరుగులతో గెలుపొంది సెమీస్‌కు దూసుకెళ్లింది.

## కౌంటీల్లో భారత పేస్ అస్త్రం..

### స్వదేశానికి తిరిగి వచ్చేది అప్పుడే



రంజీ ట్రోఫీలో సంచలన ప్రదర్శనతో భారత జెర్సీ ధరించిన అకీబ్ నబీ విదేశాల్లో సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతున్నాడు. టెస్టుల్లో మరింత బౌలింగ్ అనుభవం కోసం ఇంగ్లండ్‌కు వెళ్లిన అతడు అక్కడ కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో ఆడేందుకు సిద్ధమవుతున్నాడు. మూడు కౌంటీ మ్యాచుల్లో ఆడనున్న ఈ స్పీడ్‌స్టర్.. సర్రే జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. అనంతరం.. సెప్టెంబర్‌లో మూడో వారంలో నబీ స్వదేశానికి తిరిగి రానున్నాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో కీలకమైన న్యూజిలాండ్ పర్యటనలో యువపేసర్ అకీబ్ నబీ ని అస్త్రంగా ప్రయోగించాలనుకుంటోంది భారత జట్టు. అందుకని.. కివీస్ సిరీస్‌ను దృష్టిలో పెట్టుకొని అతడిని ఇంగ్లండ్‌లో కౌంటీలు ఆడేందుకు పంపింది బిసిసిఐ. టెస్టు బౌలర్‌గా నబీ మరింత రాటుదేలడం కోసం, ఇంగ్లండ్ పరిస్థితు ల్లో అతడి స్వింగ్ నైపుణ్యాన్ని పరీక్షించడం కోసం ఈ నిర్ణయం తీసుకుంది .

**సెప్టెంబర్ 2న అరంగేట్రం...** దేశవాళీ టోర్నీ దులీప్ ట్రోఫీలో నార్త్ జోన్ స్క్వాడ్ నుంచి వైదొలిగిన నబీ.. యూకే వీసాతో ఇంగ్లండ్ చేరుకున్నాడు. అక్కడ సర్రే జట్టు తరఫున మూడు కౌంటీ మ్యాచ్‌ల్లో ఆడనున్నాడీ బారాముల్లా ఎక్స్‌ప్రెస్. సెప్టెంబర్ 2వ తేదీన యార్ జట్టును సర్రే ఢీకొట్టనుంది. ఈ మ్యాచ్‌తో కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో నబీ అరంగేట్రం చేయనున్నాడు. అనంతరం సెప్టెంబర్ 8న ససెక్స్ జట్టుతో, సెప్టెంబర్ 15న గ్లమోర్గాన్ జట్టుతో సర్రే తలపడనుంది. ఈ మూడు మ్యాచులు పూర్తయ్యాక పుదుచ్చేరిలో సెప్టెంబర్ 22న ఆస్ట్రేలియా ఏతో మ్యాచ్ కోసం నబీ భారత్‌కు రానున్నాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్లో 43 మ్యాచుల్లోనే 162 వికెట్లు తీసిన ఈ పేస్‌గన్.. రాబోయే రోజుల్లో టీమిండియా బౌలింగ్ దళంలో కీలకం కానున్నాడు.

## ఆసియాకప్‌కు భారత మహిళల జట్టు



టి–20 వరల్డ్‌కప్‌లో నిరాశ పరిచిన భారత మహిళల జట్టు తమకు అచ్చొచ్చిన ఆసియా కప్‌లో మరో ట్రోఫీ వేటకు సిద్ధమైంది. మెగా టోర్నీలో అత్యంత విజయవంతమైన జట్టుగా నిలిచిన భారత్ ఆదివారం రాత్రి దుబాయ్ వేదికగా థాయ్‌లాండ్‌తో జరిగే గ్రూప్‌ఏ మ్యాచ్‌తో తమ పోరును ప్రారంభించనుంది. గత దశాబ్దకాలంలో టి–20 ఫార్మాట్ ఆసియా కప్‌ను శాసించిన జట్టుగా ఘన చరిత్ర ఉన్నప్పటికీ ప్రస్తుత ఫామ్, నిలకడలేమి రూపంలో భారత్‌ను పలు ప్రశ్నలు వేధిస్తున్నాయి. ఈ ఏడాది ఆడిన 16 టీ20 మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం 9 మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది. ఇటీవలి టి–20 ప్రపంచకప్‌లోనూ ఓడి గ్రూప్ దశలోనే నిష్క్రమించడం జట్టు ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసింది. ముఖ్యంగా కెప్టెన్ హర్మన్ ఫామ్, జట్టులో ఆమె భవిష్యత్తుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బ్యాటింగ్ విభాగంలో ఓపెనర్లు స్మృతి మంధాన, షఫాలీ వర్మ ధాటిగా ఆడుతుండటం జట్టుకు ప్లస్ పాయింట్. అయితే, వికెట్ పడిన తర్వాత ఇన్నింగ్స్ వేగాన్ని కొనసాగించడంలో మిడిలార్డర్ బ్యాటర్లు తరచూ విఫలమవుతున్నారు. నమ్మకమైన బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ గాయం కారణంగా ఈటోర్నీతో పాటు రాబోయే ఆసియా గేమ్‌కు కూడా దూరం కావడం పెద్ద లోటు. ఆమె స్థానంలో జట్టులోకి వచ్చిన ప్రతీకా రావల్ మిడిలార్డర్ లోటును ఎంతవరకు భర్తీ చేస్తుందో చూడాలి. గత టోర్నీల్లో క్యాచులు నేలపాలు చేయడం భారత్ విజయావకాశాలను దెబ్బతీసింది. ఈసారి ఫీల్డింగ్ లోపాలను సరిదిద్దుకోవడంపై జట్టు యాజమాన్యం ప్రత్యేకదృష్టి సారించింది. అనుభవజ్ఞురాలైన ఆల్రౌండర్ దీప్తి శర్మ స్పిన్ విభాగానికి నాయకత్వం వహిస్తుండగా, టీ20 ప్రపంచకప్‌లో అత్యధిక వికెట్లతో చెలరేగిన శ్రీచరణికి రాధా యాదవ్, ప్రేమ రావత్ ఆమెకు జతకలిశారు. పేస్ బాధ్యతలను రేణుకా సింగ్ ఠాకూర్, క్రాంతి గౌడ్ అరుంధతి రెడ్డి, నందని శర్మ పంచుకోనున్నారు.

# ఆరోగ్యం

## ఊబకాయాన్ని దీర్ఘకాలిక వ్యాధిగా చూడాలి



ఊబకాయాన్ని కేవలం ఎక్కువగా తినడం, తక్కువగా కదలడం వల్ల వచ్చే సమస్యగా చూసే పాత దృక్పథాన్ని మార్చాల్సిన అవసరం ఉం దని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఊబకాయం ఒక దీర్ఘకాలి క, క్రమంగా ముదిరే వ్యాధి. అందువల్ల దీనికి సకాలంలో గుర్తింపు, శాస్త్రీయ చికిత్స, దీర్ఘకాలిక పర్యవేక్షణ అవసరం. వ్యక్తిని నిందించ డం కంటే అతని లేదా ఆమె ఆరో గ్య పరిస్థితిని అర్థం చేసుకుని చికిత్సను నిర్ణయించాలి. ఊబకాయం వెనుక జన్యుపరమైన లక్షణాలు, జీవక్రియ, హార్మోన్ల మార్పులు, ఆహార పరిసరాలు, మానసిక స్థితి, ఆర్థికసామాజిక పరిస్థితులు, జీవనశైలి వంటి అనేక అంశాలు పనిచేస్తాయి. అందుకే అధిక బరువు ఉన్నవారిని 'సంకల్పబలం లేదు' అని విమర్శించడం సమస్యను మరింత క్లిష్టం చేస్తుంది. అపరాధ భావన, అవమానం పెరిగితే వైద్య సహాయం కోరడానికి కూడా వారు వెనుకడుగు వేయవచ్చు. ఊబకాయాన్ని అంచనా వేయడంలో బాడీ మాస్ ఇండెక్స్ (బిఎంఐ) ఒక్కటే ప్రమాణం కాకూడదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. భారతీయుల్లో తక్కువ బిఎంఐ స్థాయిల వద్దనే శరీరంలో కొవ్వు శాతం అధికంగా ఉండటం, టైప్2 మధుమేహం, గుండెరక్తనాళాల వ్యాధుల వంటి జీవక్రియ సంబంధిత సమస్యలు తక్కువ వయసులోనే కనిపించే అవకాశం ఉంది. బరువుతో పాటు మొత్తం ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలి. ఆరోగ్యకరమైన ఆహారం, క్రమబద్ధమైన శారీరక వ్యాయామం ఊబకాయం నియంత్రణలో కీలకమే. అయితే అందరికీ ఒకే విధమైన చికిత్స సరిపోదు. వ్యాధి తీవ్రత, ఇతర ఆరోగ్య సమస్యలు, వ్యక్తిగత అవసరాలను బట్టి మానసిక సహాయం, ఔషధ చికిత్స, ఎండోస్కోపిక్ విధానాలు, మెటబాలిక్ లేదా బేరియాట్రిక్ శస్త్రచికిత్స వంటి మార్గాలను వైద్యులు పరిగణించవచ్చు. ఊబకాయం తగ్గించే ప్రతి చికిత్సను పరస్పర ప్రత్యామ్నాయాలుగా చూడకుండా, అవసరాన్ని బట్టి వివిధ దశల్లో ఉపయోగించే వైద్య సాధనాలుగా చూడాలి. చికిత్సను ఆలస్యం చేస్తే వ్యాధితో పాటు దానికి సంబంధించిన మధుమేహం, గుండెజబ్బులు వంటి సమస్యలు కూడా తీవ్రమయ్యే అవకాశం ఉంది. అందువల్ల ఊబకాయం విషయంలో సమాజం కూడా తన దృక్పథాన్ని మార్చుకోవాలి. స్పష్టమైన ఆహార లేబుళ్లు, ఆరోగ్యకరమైన పాఠశాల వాతావరణం, ప్రజల్లో అవగాహన పెంపు వంటి చర్యలు కూడా ఊబకాయం నివారణలో కీలక పాత్ర పోషిస్తాయి.

## జీవనశైలి మార్పులతో డిమెన్షియాకు చెక్



ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) డిమెన్షియా (మతిమరుపు వ్యాధి) ప్రమాదాన్ని తగ్గించడానికి లేదా దాని ప్రారంభాన్ని ఆలస్యం చేయడానికి తాజా మార్గదర్శకాలను విడుదల చేసిం ది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 5.7 కోట్లకు పైగా ప్రజలు డిమెన్షియాతో జీవిస్తుండగా, ప్రతి ఏడాది దాదాపు కోటి కొత్త కేసులు నమోదవుతున్నాయి. వీటిలో 60–70 శాతం కేసులు అల్జీమర్స్ వ్యాధికి సంబంధించినవే. డబ్ల్యుహెచ్‌ఒ ప్రకారం, డిమెన్షియాకు ప్రస్తుతం పూర్తిస్థాయి చికిత్స లేకపోయినా, 45 శాతం వరకు ప్రమాదాన్ని నివారించగలిగే లేదా ఆలస్యం చేయగలిగే అవకాశం ఉంది. పొగాకు వినియోగం, అధిక మద్యపానం, శారీరక శ్రమ లేకపోవడం, సామాజిక ఒంటరితనం, వాయు కాలుష్యం, అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్ వంటి అసంక్రమణ వ్యాధులు డిమెన్షియాను పెంచుతున్నాయి. తాజా మార్గదర్శకాలలో క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, పొగాకు, మద్యం వినియోగాన్ని మానేయడం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం, మెదడుకు వ్యాయామం కలిగించే కార్యకలాపాలు (కాగ్నిటివ్ ట్రైనింగ్), వాయు కాలుష్యానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవడం వంటి సూచనలు ఉన్నాయి. రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్‌ను నియంత్రించడం కూడా డిమెన్షియా ప్రమాదాన్ని తగ్గించడంలో కీలకమని డబ్ల్యుహెచ్‌ఒ పేర్కొం ది. వినికిడి లోపం ఉన్నవారికి హియరింగ్ ఎయిడ్స్ వినియోగాన్ని కూడా ప్రమాద నివారణ వ్యూహంలో భాగంగా సూచించింది. అయితే, విటమిన్ 'బి', విటమిన్ 'ఇ', ఒమెగా3 ఫ్యాటీ యాసిడ్లు లేదా మల్టీవిటమిన్ సప్లిమెంట్లు శరీరంలో లోపం నిర్ధారణ కాకపోతే డిమెన్షియా నివారణ కోసం తీసుకోవాలని డబ్ల్యుహెచ్‌ఒ సిఫారసు చేయలేదు. వాటి ప్రయోజనాలకు తగిన శాస్త్రీయఆధారాలు లేవని స్పష్టం చేసిం ది. డిమెన్షియా వ్యక్తుల స్వతంత్ర జీవనాన్ని దెబ్బతీయడమే కాకుండా కుటుంబాలపై, సంరక్షకులపై భారీ భారం మోపుతోంది. అందువల్ల ప్రమాద కారకాలను ముందుగానే గుర్తించి జీవనశైలిలో మార్పు లు చేసుకోవడం ద్వారా మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని డబ్ల్యుహెచ్‌ఒ పేర్కొంది.

## అమెరికాను భయపెడుతున్న 'సైక్లోస్పోరియాసిస్'



ఇటీవల కాలంలో అమెరికాను 'సైక్లోస్పోరియాసిస్' భయపెడుతున్నది. ఆహార సంబంధిత ఈ అంటువ్యాధి అత్యంత వేగంగా వ్యాపిస్తుండటం తో అక్కడి ఆరోగ్య అధికారులు ప్రజలకు అప్రమత్తతమయ్యారు. ఈ వ్యాధికి 'సైక్లోస్పోరా కయెటానెన్సిస్' అనే సూక్ష్మ పరాన్నజీవి కారణం. ఇది మలంతో కలుషితమైన ఆహారం లేదా నీటిని తీసుకోవడం వల్ల సోకుతుంది. ఈ వ్యాధి ప్రధాన లక్షణం చాలా రోజుల పాటు కొనసాగే నీళ్ల విరేచనాలు. వీటితో పాటు కడుపు నొప్పి, అలసట, బరువు తగ్గడం వంటి సమస్యలు కనిపిస్తాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఇది తీవ్రమైన ప్రమాదంగా మారవచ్చు. చికిత్స ఆలస్యమైతే పేగులు పోషకాలను గ్రహించలేకపోవడం, పిత్తాశయ వాపు, కీళ్ల వాపు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఈ పరాన్నజీవిని సాధారణ పరీక్ష ల్లో గుర్తించడం కష్టతరం కావడంతో ప్రత్యేక మల పరీక్షలు అవసరమవుతాయి. నిర్ధారణ అయిన తర్వాత యాంటీబయోటిక్ మందులతో పాటు శరీరంలో నీటి లోపం రాకుండా తగినంత ద్రవా లు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అందువల్ల కూరగాయలు, పండ్లను శుభ్రమైన ప్రవహించే నీటితో బాగా కడిగివాడడం, భోజనానికి ముందు చేతులను పరిశుభ్రంగా కడుక్కోవడం వంటి జాగ్రత్తలు పాటించడం అత్యంత అవసరం.

# ఢిల్లీకి తరలుతున్న 'ఎర్రసైన్యం'













**కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ పిలుపు మేరకు ఢిల్లీ రామ్ లీలా మైదాన్‌లో సెప్టెంబర్ 1న జరుగనున్న 'బద్లావ్ జరూరీ హై' మహాధర్నాలో పాల్గొనేందుకు రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ నాయకులు బయలుదేరారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, ప్రజాస్వామ్య హక్కుల హననం, కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని సిపిఐ చేపట్టింది.**




**హనుమకొండ :** దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, విపరీతమైన ధరల పెరుగుదల, ప్రజాస్వామ్య హక్కుల హననం మరియు కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టినట్లు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. సిపిఐ పిలుపు మేరకు, సెప్టెంబర్ 1న న్యూఢిల్లీలోని చారిత్రాత్మక రాంలీలా మైదాన్‌లో తలపెట్టిన ప్రతిష్టాత్మక బద్లావ్ జరూరీ హై (మార్పు తప్పనిసరి) మహాసభలో పాల్గొనేందుకు సిపిఐ హనుమకొండ జిల్లా నాయకులు, కార్యకర్తల బృందం సోమవారం ఢిల్లీకి పయనమైంది. ఈ సందర్భంగా కాజీపేట రైల్వే స్టేషన్‌లో వారి ప్రయాణాన్ని తక్కళ్లపల్లి జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, విద్వేషపూరిత విధానాల వల్ల కార్మికులు, కర్షకులు, యువత, నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తూ జరిగే బద్లావ్ జరూరీ హై సభ చారిత్రాత్మక మలుపు కానుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు మునిగాల బిక్షపతి, ఎన్‌ఏ.స్టాలిన్, ఉట్కూరి రాములు, ఎదునూరి వెంకట్రాజం, నేదునూరి రాజమౌళి, కొట్టెపాక రవి, యేషబోయిన శ్రీనివాస్, మాలోత్ శంకర్ నాయక్, నకీర్త ఓదెలు, కండె నర్సయ్య, గుంటి రాజేందర్, రాసమల్ల దీన, గడ్డం లలిత, తిరుమల, నిమ్మల మనోహర్ పాల్గొన్నారు.

**పెద్దపల్లి :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాన్ని తిప్పి కొట్టాలని సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సెప్టెంబర్ 1 న సిపిఐ ఆధ్వర్యంలో ఢిల్లీ రామ్ లీలా మైదాన్‌లో జరిగే మహాధర్న కార్యక్రమానికి పెద్దపల్లి నుండి జిల్లా కార్యదర్శి జిల్లా కమిటీ సభ్యులు, సిపిఐ రామగుండం ఫ్లోర్ లీడర్ మార్కపూరి సూర్యతోపాటు పలువురు సిపిఐ నాయకులు బయలుదేరారు.

**వరంగల్ :** బద్లావ్ జరూరీ హై కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చలో ఢిల్లీ కార్యక్రమానికి వరంగల్ జిల్లా సిపిఐ శ్రేణులు సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ బాష్ మియా ఆధ్వర్యంలో బయలుదేరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గుండె బద్రి, కందిక చెన్నకేశవులు, వీరగోని శంకరయ్య, నాయకులు మియాపురం గోవర్ధన చారి, ఓర్సు రాజు, ఎండి అక్బర్ పాషా, సుంకరి భవాని, శ్వేత, నల్లతీగల కుమార్, దూమాల పద్మ, దామెర కృష్ణ, ఆర్ ఎల్లి రవి, సంద్ర కుమార్, జన్ను రాజు, శాంతి, మనోహర్, వినయ్, సరిత పాల్గొన్నారు.

**నాగర్‌కర్నూల్ :** ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణ కోసం సిపిఐ ఇచ్చిన పిలుపులో భాగంగా సెప్టెంబర్ 1న నిర్వహించనున్న మార్పు కావాలి చలో ఢిల్లీ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలు, తరలివెళ్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్ తెలిపారు. హైదరాబాద్‌లోని నాంపల్లి రైల్వేస్టేషన్ నుంచి తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌తో పాటు ఇతర మార్గాల ద్వారా పార్టీ శ్రేణులు ఢిల్లీకి బయలుదేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు బండి లక్ష్మి పతి, బిజ్జా శ్రీనివాసులు, తుమ్మల శివుడు, వి.రవీందర్, ఈ.మల్లయ్య, టి.కిరణ్‌కుమార్, డి.ఆంజనేయులు, జె.రమేష్, కే.వెంకటమ్మ, ప్రేమ్‌కుమార్ బయలుదేరారు.

**ఎల్కతుర్తి :** కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ చలో ఢిల్లీ సెప్టెంబర్ 1న కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎల్కతుర్తి మండలం నుండి సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రే భిక్షపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉట్కూరి రాములు, మారుపాక అనిల్ కుమార్, నిమ్మల మనోహర్, మర్రి విజయ్,మరిపెల్లి తిరుమల, గడ్డం లలిత కాజీపేట రైల్వే స్టేషన్‌లో తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరారు.

## ప్రతి జిల్లాలో ప్రభుత్వ పరిశ్రమలు ఏర్పాటు

### ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీ ఉల్లాహ్ ఖాద్రీ డిమాండ్




**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రతి జిల్లాలో ప్రభుత్వ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లాహ్ ఖాద్రీ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ నక్కలగుట్ట అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో ఎఐవైఎఫ్ హనుమకొండ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో సంఘం తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలకు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమానికి డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లాహ్ ఖాద్రీ హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతిజిల్లాలో ప్రభుత్వరంగ పరిశ్రమలను ఏర్పాటు చేసినప్పుడే స్థానిక యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ విధానాలను తక్షణమే నిలిపివేయాలని ఆయన కోరారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ప్రభుత్వ విద్య, వైద్యం అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎఐవైఎఫ్ నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తోందని తెలిపారు. యువత సమస్యలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. సెప్టెంబర్ 8,9,10 తేదీల్లో యాదగిరిగుట్టలో జరగనున్న తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలకు యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నోముల కిషోర్, జిల్లా కార్యదర్శి గన్నారపు రోహిత్, నాయకులు మాస్క శుదీర్, పెనుకుల మధు, జెట్టి కృష్ణ, రాచపుడి యువన్, అల్లం శివ, విజయ్, జగదీశ్, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

## పాలకులు అనుసరిస్తున్న కార్మిక విధానం లోపభూయిష్టం

### తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి గన్నారపు రమేష్




**ప్రజాపక్షం/వరంగల్ :** పాలకులు అనుసరిస్తున్న కార్మిక పాలసీ లోపభూయిష్టంగా వుందని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి గన్నారపు రమేష్ విమర్శించారు. సెప్టెంబర్ 6, 7, 8 తేదీలలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరగనున్న ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి) రాష్ట్ర నాలుగవ మహాసభల విజయవంతం చేయాలని ఆదివారం ఇఎస్‌ఐ హాస్పిటల్‌లో పోస్టర్లు విష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇఎస్‌ఐ హాస్పటల్లో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని దీని ద్వారా కార్మికులకు లబ్ధి చేకూరుతుందని బూటకపు ప్రచారం చేస్తుందని విమర్శించారు. 8 గంటల పని దినం హక్కులను ఉల్లంఘిస్తూ కార్మికవర్గాన్ని బానిసలుగా తయారు చేసే ప్రయోగశాలగా దేశంలో 12 గంటల పని విధానానికి ఆజ్యం పోస్తున్నారని మండిపడ్డారు. కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కనీసవేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు గుండె బద్రి, దామెర కృష్ణ, ఎండి యాకోబ్, బస్కర్ల సతీష్, మధుసూదనాచారి, సికిందర్ కాల్, భవితవ్య, ఆనంద్, అనిల్, ప్రభాస్, సుమలత, రజిత, రేణుక, పుష్ప లీల, రమ, మానస, సృజన, అనిత, స్వప్న, శృతి, జోష్న, రజిత, రజిత, సరిత, శ్యామల తదితరులు పాల్గొన్నారు.


TELANGANA POLICE

Commendation

Rc.No.123/Rewards-1/2026

Dated : 28.08.2026

THIS IS TO CERTIFY THAT

The services of Sri K. Narasimha, IPS, Superintendent of Police, Suryapet are hereby commended for securing first Rank in Cluster-IV in overall performance.

The overall cluster-wise performance is assessed based on the following (8) performance heads:

- Charge Sheet Rate
- Detection Rate
- Conviction Rate
- Average Investigation time
- On-Site FIRs
- e-Petty cases
- e-Challans
- Drunken Drive

For demonstrating exemplary dedication, professionalism, and outstanding performance in Policing service.

C.V. Anand, IPS
Director General of Police,(HoPF)
Telangana

## జిల్లా పోలీసు శాఖకు రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంక్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ శాంతి భద్రతల పరిరక్షణతో పాటు పనితీరులో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచింది. క్లస్టర్ 4 విభాగంలో జిల్లా సాధించిన సమగ్ర పనితీరును గుర్తించి జిల్లా ఎస్‌పి నరసింహకు రాష్ట్ర డిజిపి సి.వి. ఆనంద్ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. మొత్తం 8 కీలక పనితీరు సూచికల ఆధారంగా ఈ ర్యాకింగ్ కేటాయించారు. చార్జిషీట్ రేటు, నేరాల గుర్తింపు రేటు, శిక్షల శాతం, సగటు ధర్యాప్తు సమయం, బాధితుల ఇంటి వద్ద కేసుల నమోదు, ఈపెట్టి కేసులు, ఈచలాన్లు, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను ఆధారంగా చేసుకున్నారు. విధి నిర్వహణలో చూపిన అంకితభావం, నైపుణ్యం, విశిష్ట సేవలకు గాను జిల్లా పోలీసు సిబ్బందిని డిజిపి ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా ఎస్‌పి కె. నరసింహ మాట్లాడుతూ సాంకేతికతను సద్వినియోగం చేసుకుని జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని అన్నారు. నేరాలను నిరోధిస్తూ పని చేస్తున్నామని, కేసుల ధర్యాప్తు వేగంగా చేస్తున్నామన్నారు. బలమైన ఆధారాలు, సాక్ష్యాలను సేకరించి కోర్టుకు అందజేసి కేసుల్లో నేరస్తులకు జైలు శిక్షలు పడేలా చేయడం ద్వారా నేరాలు చేయాలనుకునే వారిలో భయం కలిగేలా చేస్తున్నామన్నారు.


## కాంగ్రెస్‌తోనే సొంతింటి కల సాకారం



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్** : కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కృషి చేస్తోందని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు రాయినిగూడెంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను వారు ప్రారంభించి మాట్లాడారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. కొనతం వెంకట్ రెడ్డి తన తదనంతరం తనకు చెందిన 330 గజాల ఇంటి స్థలాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి అందజేస్తానని ప్రకటించడం అభినందనీయమని అన్నారు. అనంతరం రాయినిగూడెంలో నూతనంగా ఏర్పాటు చేసిన యూపీబీహార్ దాబాను వారు ప్రారంభించారు. దాబా నిర్వాహకులు మలే వెంకట్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, దండు మైసమ్మ దేవాలయ చైర్మన్ తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, చింతమల్ల రమేష్, ఎడ్ల గంగాభవాని వీరమల్లు యాదవ్, నంద్యాల మహేష్ రెడ్డి, నంద్యాల కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/హాలియా:** ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని సమాజానికి ఉపయోగపడే మేధావులను తీర్చిదిద్దే ఘనత ఉపాధ్యాయులకే దక్కుతుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి అన్నారు. టి ఆర్ టి యు అనుముల మండలం అధ్యక్షుడు చెన్ను వెంకటరెడ్డి పదవి విరమణ సన్మాన కార్యక్రమం ఆదివారం హాలియాలోని ఒక ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే మేధావులైన యువతను తీర్చిదిద్ది ఘనత ఒక్క ఉపాధ్యాయులకు మాత్రమే దక్కుతుందని చెప్పారు. అనంతరం పదవీ విరమణ పొందిన వెంకట్ రెడ్డి ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళం నారాయణరెడ్డి, మేకల జాన్ రెడ్డి,కొల్లు శ్రీనివాస్ రెడ్డి,మంచి కంటి మధు,సలికంటి సైదులు,పాండరయ్య,చెన్ను వెంకటనారాయణ రెడ్డి, కంచర్ల సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం



**ప్రజాపక్షం/బీబీనగర్ :** భువనగిరి పట్టణంలోని శ్రీ ఆర్కే హాస్పిటల్, చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించు పల్లె పల్లెకి వైద్యం కార్యక్రమం లో భాగంగా 142 వ ఉచిత మెగా వైద్య శిబిరం ఆత్మకూరు మండలం సింగారం గ్రామం నందు నిర్వహించారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరం నందు గ్రామ ప్రజలకు ఉచితంగా జనరల్బ్ ఫిజీషియన్ డాక్టర్ చే ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద శిబిరం నుండి గ్రామ ప్రజలకు బిపి, షుగర్, న్యూరోపతి, బిఎండి పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమం నందు గ్రామ ప్రజలకు జనరల్ ఫిజీషియన్ డాక్టర్ చావా రాజ్ కుమార్ గ్రామ ప్రజలకు బీపీ షుగర్ థైరాయిడ్ మొదలగు దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన లక్షణాలు మరియు వాటి నివారణకు తీసుకొని వలసిన తగు జాగ్రత్తలను గురించి వివరించారు. ఈ ఉచిత వైద్య శిబిరం నందు 200 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు గ్రామ సర్పంచ్ తెలియజేశారు.

## వృద్ధురాలు ఆత్మహత్య

**ప్రజాపక్షం/నిడమనూరు:** అనారోగ్యంతో ఆందోళనకు గురైన వృద్ధురాలు వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధి ఎర్రబెల్లి గ్రామంలో చోటుచేసుకుంది, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధి ఎర్రబెల్లి గ్రామానికి చెందిన పెదమాము ముత్త(62)తీవ్రమైన చర్మ వ్యాధి, కీళ్ల నొప్పులతో బాధపడుతూ ఎంతకు నయం కాకపోవడంతో గ్రామానికి సమీపంలో ఉన్న పాతవ్యవసాయ బావిలో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు, మృతురాలి బావ కుమారుడు పెదమాము ఉపేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయకుమార్ తెలిపారు.


# ఇక్కడ 'నిల్'... అక్కడ 'ఫుల్'!

నీళ్ళన్నీ కోదాడకేనా?

ఎందుకీ వివక్ష

జిల్లా కేంద్రంలోని ప్రజలకు ఏందీ ఈ శాపం

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట పట్టణం 92 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణతో మొత్తం 48 వార్డులు ఉండగా 35వేలకు పైగా నివాసాలు, ఒక లక్ష 32 వేలకు పైగా జనాభా ఉంది. ప్రజలకు 18,600 నల్లాలతో పాటు కొంత బోర్ల ద్వారా మున్సిపల్ అధికారులు నీటిని సరఫరా చేస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం ప్రతి మనిషికి రోజుకు సగటున 135 లీటర్ల అవసరం అవుతుందని చెబుతున్నారు. దీనికి అనుగుణంగా గత వేసవి ముందు వరకు పాలేరు నుండి, ఇమాంపేట మిషన్ భగీరథ నుండి నీటి సరఫరాను రోజువారిగా కాకుండా ఒక్కరోజు తప్పించి ఒక రోజు నీటిని సరఫరా చేయడం జరిగింది. ఈ నీరు సరిపోకున్నా కొంత బోర్ల ద్వారా స్థానిక ప్రజలు నీటిని వినియోగించుకోవడంతో నీటి కొరత పెద్దగా అనిపించలేదు. ఈ ఏడాది ఎలినోవా ప్రభావంతో సరైన వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటడంతో నీటి కష్టాలు తీవ్రమయ్యాయి. దీనితో 2 రోజులకు ఒక్కసారి నీటిని సరఫరా చేయడంతో ప్రజలకు నీటి కష్టాలు మరింత పెరిగాయి. సరఫరా చేసే నీరు కూడా కేవలం గంట వ్యవధిలోపే ఉండడంతో ప్రజల గొంతు ఎండుతుంది.



**అధికారులు చెప్పే దానికి వాస్తవ నీటి సరఫరాలో తీవ్ర వ్యత్యాసం...**

అధికారులు చెప్పే దానికి వాస్తవ నీటి సరఫరాలో తీవ్ర వ్యత్యాసం ఉంది. దీనిపై ప్రశ్నిస్తే వారు కూడా సమాధానాన్ని దాటవేస్తూ పొంతనలేని సమాధానాలు చెప్పుకొస్తున్నారు. సూర్యాపేట పట్టణంలో ప్రతిరోజు 21 ఎం.ఎల్.డి. నీటిని సరఫరాను చేస్తున్నామని అధికారులు చెబుతున్న దానిలో ఏ మాత్రం వాస్తవం లేదని ప్రజలు పడుతున్న నీటి కష్టాలను బట్టి చూస్తే ఇట్టే తేలిపోతుంది. రెండు రోజులకు ఒకమారు నీటిని సరఫరా చేస్తున్నామని వారు చెప్పకనే చెప్పడం దీనికి మరింత బలం చేకూరుస్తుంది. దీంతో పట్టణంలోని 48 వార్డుల్లో ప్రజలు నీటి తీవ్రతను ఎదుర్కొంటుండగా ప్రధానంగా పట్టణ ప్రథమ పౌరురాలు మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షా ది ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులోని విద్యానగర్‌తోపాటు శ్రీరాంనగర్‌తోపాటు విలీన గ్రామాలైన దురాజ్‌పల్లి, దాసాయిగూడెం, కుసుమవారిగూడెం, పిల్లలమర్రి, కుప్పిరెడ్డిగూడెం, కుడకుడ, గాంధీనగర్, బీబీగూడెంతోపాటు పట్టణంలోని శ్రీశ్రీనగర్, నెహ్రూనగర్, సుందరయ్యనగర్, స్నేహానగర్, చర్చికంపౌండ్, భగత్‌సింగ్‌నగర్, తాళ్ళగడ్డ తదితర ప్రాంతాల్లో నీటికొరతతో నిత్యం ప్రజలు తీవ్ర అవస్థ లు పడుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న వేసవి లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు భయపడుతున్నారు.

అధికారుల లెక్కల ప్రకారం సూర్యాపేట పట్టణానికి సరఫరా చేయాల్సిన నీటిని కూడా కోదాడ పట్టణానికే అక్రమంగా తరలిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదేమని అధికారులను ప్రశ్నిస్తే సమాధానాలు దాటవేస్తూ మమ్ముల్ని వదిలి పెట్టండి మీకు నిజాలను చెబితే మా ఉద్యోగాలకే ప్రమాదమంటూ తప్పించుకుంటున్నారు. ఒక లక్ష 32 వేలకు పైగా జనాభా ఉన్న సూర్యాపేట మున్సిపాలిటికి 21 ఎం.ఎల్.డి నీటిని సరఫరా చేస్తున్నామని అధికారులు చెబుతున్నా 20 లోపే అని... 50వేల జనాభా కలిగిన కోదాడ పట్టణానికి 35 నుండి 40 ఎం.ఎల్.డి ల నీటిని సరఫరా చేయడం జరుగుతుందని ఓ అధికారి మర్మగర్భంగా చెప్పడం గమనార్హం. మిషన్ భగీరథ ద్వారా ప్రతి రోజు సూర్యాపేట పట్టణానికి 20 రౌండ్ల లోపు నీటిని విడుదల చేస్తుంటే 35 నుండి 40 రౌండ్లు కోదాడకు నీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పడం సూర్యాపేట పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న నీటి కష్టాలకు అద్దం పడుతుంది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సతీమణి ఉత్తమ్ పద్మావతి రెడ్డి కోదాడకు శాసన సభ్యురాలుగా ప్రాతినిధ్యం వహించడంతోనే వారిని ప్రశ్నించే నాధుడే లేదని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు. సూర్యాపేట పట్టణ ప్రజల నీటి కొరతను తీర్చేందుకు గతంలో తాగునీరు అందించిన దోసపహాడ్ ప్రాజెక్టును ముందుకు తెచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులు గత నెల రోజుల క్రితం దానిని పరిశీలించి హడావుడి చేశారు. దానిని పునరుద్ధరించేందుకు దాదాపు రూ. 4 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేయడంతో నిధుల లేమి కారణంగా దాని ప్రస్తావన తిరిగి లేవనెత్తని పరిస్థితి.

సూర్యాపేట పట్టణ ప్రజలు వివక్షకు గురవుతున్నా ఎందుకీ ఈ వివక్ష అంటూ ఎవరూ కూడా మాట్లాడడం లేదు. పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం... అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు చేసే అధికార పార్టీ నేతలకు ప్రజల నీటి కష్టాలు కనపడడం లేదా... లేక వారి రాజకీయ ప్రయోజనాల కోసం జిల్లా కేంద్ర ప్రజలకు శాపంగా మారిందా అనే చర్చ పట్టణంలో జోరుగా సాగుతుంది. ఇప్పటికైన నాయకులు కండ్ల ముందు కనబడుతున్న తమ నీటి కష్టాలను తీర్చేందుకు చొరవ చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## నెరవేరనున్న చిరకాల వాంఛ

5న సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రి ప్రారంభం

నకిరేకల్‌తోపాటు పరిసర ఆరు మండలాల ప్రజలకు వైద్య సేవలు




**ప్రజాపక్షం/నకిరేకల్ :** నకిరేకల్ ప్రజల చిరకాల కోరిక నెరవేరనుంది. రూ.32 కోట్లతో నిర్మించిన 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రిని సెప్టెంబరు 5న సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం తెలిపారు. ఆసుపత్రి అందుబాటులోకి వస్తే నకిరేకల్‌తోపాటు పరిసర ఆరు మండలాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు చేరువ కానున్నాయి. ముఖ్యంగా జాతీయ రహదారి65పై ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులకు సకాలంలో చికిత్స అందించి ప్రాణాలు నిలబెట్టేందుకు ఇది కీలక కేంద్రంగా మారనుంది. ఐదు ఎకరాల్లో నిర్మించిన ఆసుపత్రిలో ఐదు శస్త్రచికిత్స గదులు, ట్రామా కేర్,డయాలసిస్ కేంద్రాలతోపాటు అత్యవసర వైద్య సేవలకు వసతులు కల్పించారు. ప్రస్తుతం అవసరమైన వైద్య పరికరాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి ప్రారంభానికి ముందో, అనంతరమో వాటిని సమకూర్చి త్వరలో సేవలు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. వైద్యులు, సిబ్బంది పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్యం అందిస్తే పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ ఆసుపత్రి ఎంతో ప్రయోజనకరంగా మారనుంది.ప్రస్తుతం ఉన్న 30 పడకల ఆసుపత్రిని 2022లో 100 పడకలకు అప్‌గ్రేడ్ చేశారు. జాతీయ రహదారి వెంట రూ.32 కోట్లతో నిర్మించిన నూతన భవనం పనులు పూర్తయి ఐదు నెలలు గడిచాయి. ఆసుపత్రికి 118 పోస్టులు మంజూరు కాగా 91 పోస్టులు భర్తీ అయ్యాయి. ఇంకా 27 పోస్టులు పూర్తి కావాల్సింది. ప్రస్తుతం రోజుకు 200 నుంచి 250 వరకు ఓపీ వస్తోంది. కొత్త ఆసుపత్రి ప్రారంభమై పూర్తిస్థాయి వైద్య సేవలు అందుబాటులోకి వస్తే రోగుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ ప్రాంత ప్రజలకు ఆధునిక వైద్యం చేరువ కావడం శుభ పరిణామంగా నిలవనుంది.

## అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు సాధించే వరకూ పోరాటం

టియుడబ్ల్యుజె (ఐజెయు)జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి




**ప్రజాపక్షం/నల్లగొండ(కనగల్):** వర్కింగ్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి టియుడబ్ల్యుజె (ఐజెయు) నిరంతరం కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి అన్నారు.కనగల్‌లో ఆదివారం టియుడబ్ల్యుజె మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గార్లపాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయించేందుకు సంఘం తరపున నిరంతరం పోరాడుతామని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం కనగల్ మండల ప్రెస్‌క్లబ్ (టీయూడబ్ల్యూజేయు) నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుంకిరెడ్డి జాగాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మల్లెపల్లి నరసింహ, ఉపాధ్యక్షులుగా దాసిరెడ్డి నవీన్‌రెడ్డి, మహేశ్వరం రమేష్‌కుమార్, కోశాధికారిగా రాయల సునీల్‌కుమార్, కార్యదర్శిగా పాలకూరి లింగస్వామి, సహాయ కార్యదర్శిగా తొరకొప్పుల నాగయ్య ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా చీదేటి వంశీధర్‌రెడ్డి, మాచర్ల లక్ష్మీనారాయణ తదితరులు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి దోటి శ్రీనివాస్, అక్షర కలం ఎడిటర్ పిట్టల రామకృష్ణ పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

మూత లేకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు

**ప్రజాపక్షం/మునుగోడు:** మండల కేంద్రంలోని 2వ వార్డులో మాజీ సర్పంచ్ ఇంటి సమీపంలో మ్యాన్‌హోల్‌కు మూత ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మ్యాన్‌హోల్ తెరిచి ఉండటంతో ముఖ్యంగా రాత్రివేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మ్యాన్‌హోల్ వద్ద ఎలాంటి హెచ్చరిక సూచికలు, రక్షణ చర్యలు లేకపోవడంతో ప్రమాదం మరింత పొంచి ఉందని వారు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మ్యాన్‌హోల్‌కు పటిష్టమైన మూత ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని ప్రమాదాన్ని నివారించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## బడుగు, బలహీన వర్గాలపై దాడి అమానుషం

**ప్రజాపక్షం/కోదాడ:** బడుగు, బలహీన వర్గాలపై అకారణంగా అక్రమ కేసులు బనాయించి దాడులు చేయడం అమానుషమని, ఇదేనా కాంగ్రెస్ సామాజిక న్యాయమని బిసి జనసభ, యాదవ హక్కుల పోరాట సమితి నాయకులు నిలదీశారు. ఆదివారం కోదాడ పట్టణంలో బాధితులు మాదాల ఉపేందర్ యాదవ్, గంధం కనకమ్మలకు మద్దతుగా వివిధ బిసి సంఘాల ఆధ్వర్యంలో కోదాడ పట్టణంలో నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దేశ వ్యాప్తంగా సామాజిక న్యాయం కోసం పాదయాత్రలు, జోడోయాత్రలు చేస్తుంటే తెలంగాణలో కాంగ్రెస్ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బిసిలపై దాడులు జరగడం దారుణమన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి రాఖీ పండుగ రోజు తమ సోదరితో ఎంతో సంతోషంగా రాఖీ కట్టించుకోవచ్చు. కాని మా అక్కచెల్లెళ్లు తమ సోదరుడికి రాఖీ కట్టడానికి వస్తే వారిపై దాడులు చేసి, అసభ్యకరంగా ప్రవర్తిస్తారా అని ప్రశ్నించారు. బాధితులకు తక్షణమే న్యాయం చేసి, బాధ్యుడైన శివ శంకర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని, ఉపేందర్‌పై మోపిన అక్రమ కేసులను ఎత్తివేయడంతో డిమాండ్ చేశారు. డబ్బాకొట్టును పునరుద్ధరించి, ఆమెకు జీవనోపాధి కల్పించి నష్ట పరిహారం చెల్లించాలని స్పష్టం చేశారు. డిమాండ్లను పరిష్కరించకపోతే మానవ హక్కుల కమిషన్, మహిళ కమిషన్‌ను ఆశ్రయించడంతో పాటు హైద్రాబాద్‌లోని ఇందిర పార్కు వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి జనసభ రాష్ట్ర అధ్యక్షులు రాజారాం యాదవ్, యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మేకల రాములు, లోడంగి గోవర్ధన్, మేకల కృష్ణయ్య, రవియాదవ్, జటంగి వెంకట నర్సయ్య, రేణుకయాదవ్ పాల్గొన్నారు.





## నల్లగొండలో నీట్ పిజికి ఒక్కరే గైర్హాజరు

పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ బి. చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ:** జిల్లాలో నిర్వహించిన నీట్ పీజీ పరీక్ష ఎలాంటి ఇబ్బందులు,అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా జరిగిందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు.ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎస్‌పీఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన నీట్ పీజీ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. కేంద్రంలోని మౌలిక వసతులను పరిశీలించి, పరీక్ష నిర్వహణ తీరుపై కేంద్ర ఇన్‌చార్జిని అడిగి తెలుసుకున్నారు.పరీక్షకు మొత్తం 180 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 179 మంది హాజరయ్యారని, ఒక్క అభ్యర్థి గైర్హాజరయ్యారని కేంద్ర ఇన్‌చార్జి కలెక్టర్‌కు వివరించారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులకు తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర అన్ని మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు.పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష ప్రశాంతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.కలెక్టర్ వెంట అదనపు సూపరింటెండెంట్ రమేష్, ఆర్‌డిఓ వై. అశోక్‌రెడ్డి, డీఎస్‌పి శివరామ్‌రెడ్డి,సీఐ ఆదిరెడ్డి, పరీక్షల ఇన్‌చార్జి ప్రొఫసర్ ఉపేందర్ తదితరులు ఉన్నారు.

## ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీ

రెండు తులాల బంగారం, 30 తులాల వెండి అపహరణ



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని ఖుదాబాక్స్‌పల్లి గ్రామానికి చెందిన కందుకూరి బైండ్ల యాదయ్య వైద్యం కోసం హైదరాబాద్‌కు వెళ్లగా, ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న రెండు తులాల బంగారం, 30 తులాల వెండి అపహరణకు గురైనట్లు యాదయ్య భార్య పద్మ ఆదివారం తెలిపారు.సమాచారం అందుకున్న ఎస్ఐ బి. రాంబాబు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీం సిబ్బందితో ఫింగర్‌ప్రింట్ నిపుణుల ద్వారా ఇంటిని, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్ఐ తెలిపారు.పోలీసులు దొంగతనానికి సంబంధించిన ఆధారాలను సేకరించి, నిందితులను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## భారత్ కళా వైభవ్-2026 రాష్ట్రస్థాయి అవార్డు ప్రదానం

**ప్రజాపక్షం/రామన్నపేట** : హైదరాబాద్లోని బిర్లా ప్లానిటోరియం భాస్కర ఆడిటోరియంలోప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన'ధూమ్ ధామ్ దమ్ము నీదా?నాదా?'డాన్స్ కాంపిటీషన్ కార్యక్రమంలో విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరంకు అరుదైన అత్యున్నత గౌరవం లభించింది. సాంస్కృతిక, సామాజిక సేవా రంగాలతో పాటు దివ్యాంగుల సంక్షేమం, హక్కులు,విద్య,ఉపాధి రంగాల్లో విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం చేస్తున్న విశేష కృషికి గుర్తింపుగా'భారత్ కళా వైభవ్2026'రాష్ట్రస్థాయి అవార్డును ప్రదానం చేశారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డును డాక్టర్ ఎండి ఆరిఫ్ వుద్దీన్ చేతుల మీదుగా విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నకరకంటి అశోక్,తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మారవేణి చంద్రశేఖర్ యాదవ్ అందుకున్నారు. డాక్టర్ నకరకంటి అశోక్ మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల సాధన కోసం విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం చేస్తున్న నిరంతర పోరాటానికి లభించిన ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందన్నారు.



## రూ.4 లక్షల సిఎం సహాయనిధి



ప్రజాపక్షం/జన్నారం : అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.4 లక్షల ఎల్‌ఓసి (చికిత్సా వ్యయ అనుమతి పత్రం) మంజూరైంది. జన్నారం మండలం కవ్వాల్ గ్రామానికి చెందిన దుర్గం లింగారెడ్డి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ శస్త్రచికిత్స చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రి వైద్యులు శస్త్రచికిత్సకు సుమారు రూ.4 లక్షల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన లింగారెడ్డి ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి ఎల్‌ఓసి మంజూరు చేయించారు.ఆర్థిక భరోసా కల్పించినందుకు ఎమ్మెల్యేకు లింగారెడ్డి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## వానాకాలం వరి పంట బోనస్‌కు ఆన్‌లైన్‌లో నమోదు తప్పనిసరి

వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రాజ్

ప్రజాపక్షం/పాపన్నపేట: ఖరీఫ్ సీజన్ లో వరి విత్తనాలు సాగు చేస్తున్న రైతులు 500 రూపాయల బోనస్ కోసం ఆన్లైన్ లో నమోదు తప్పకుండా చేసుకోవాలని వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రాజ్ ఆదివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.విత్తనాలు కొనుగోలు చేసిన (దుకాణం) డీలర్ వద్ద నమోదు చేసుకోవాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లు, పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు, రైతు ఫోన్ నెంబర్ సమర్పించి నమోదు చేసుకోవాలన్నారు.ప్రభుత్వం సిఫారసు చేసిన బిపిటి, కేఎన్ఎమ్ 1638, కేఎన్ఎం.7715 జైశ్రీరామ్ హెచ్ఎంటి, ఆర్ఎన్ఆర్, ఎదు రకాల వరి విత్తనాలు వేసిన రైతులు మాత్రమే సెప్టెంబర్ 10వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకొని యెడల బోనస్ పొందలేరన్నారు.

## నీట్ -పిజి పరీక్షా కేంద్రం కలెక్టర్ తనిఖీ



ప్రజాపక్షం/మావల: నలంద కళాశాలలో ఆదివారం జరిగిన నీట్‌పీజీ ప్రవేశ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షి షా ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో మౌలిక వసతులు, బయోమెట్రిక్ తనిఖీలను పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కలగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కేంద్రంలో 100 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు.అదనపు ఎస్పీ సురేందర్‌రావు, డిఎస్పీ జీవన్‌రెడ్డి, తహసిల్దార్ వేణు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో మరింత ముందుకు సాగాలి

ఎమ్మెల్యే శంకర్



ప్రజాపక్షం/మావల: సమాజ శ్రేయస్సే ధ్యేయంగా జీవిస్తున్న ముదిరాజ్ సమాజం అన్ని రంగాల్లో మరింత ముందుకు రావాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. గాంధీ పార్కులో పెద్దమ్మ తల్లి, భీమన్న దేవుని విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి జోగు రామన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, బీజేపీ నాయకురాలు సుహాసినిరెడ్డి హాజరయ్యారు. అంతకుముందు బస్టాండ్ వద్ద పండుగ సాయన్న విగ్రహాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ అనూషతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ముదిరాజ్ కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని ఆకాంక్షించారు.ముదిరాజ్ సంఘం నాయకులు దారవేణి రాము, రవి, సంతోష్, నగేష్ పాల్గొన్నారు.

## ఆలయాభివృద్ధికి తోడ్పాడతా

ధన్వంతరి ఆరాధనోత్సవంలో అర్బన్ ఎమ్మెల్యే

ప్రజాపక్షం/నిజామాబాద్ : రాఘవేంద్ర స్వామి మఠం అభివృద్ధికి తన వంతు తోడ్పాటునందిస్తామని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని సుభాష్‌నగర్‌లోని రాఘవేంద్రస్వామి మఠంలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న ధన్వంతరి ఆరాధనోత్సవాల్లో ఆదివారం ఎమ్మెల్యే ధన్‌పాల్ పాల్గొని మాట్లాడారు. గత సంవత్సరం శ్రీశ్రీశ్రీ సత్యాత్మ తీర్థ శ్రీపాదుల వారి కరకములచే ధన్వంతరి స్వామి విగ్రహ ప్రతిష్టాపన అత్యంత వైభవంగా నిర్వహించాలని గుర్తు చేశారు. దేశంలోనే రెండవ ధన్వంతరి ఆలయం కావటం ఇందూరు ప్రజల అదృష్టమన్నారు. ప్రజల ఆయురారోగ్యాల కోసం ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. నూతన ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారమందిస్తానన్నారు. కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీ నారాయణ, బీజేపీ నాయకులు పవన్, సతీష్ పాల్గొన్నారు.

## నేడు పాంచజన్య సంకల్ప సభ




ప్రజాపక్షం/నిజామాబాద్ : తెలంగాణ రక్షణ సేన పార్టీప రకటన తర్వాత మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత సోమవారం జిల్లాకు మొదటిసారి రానున్నారు. పార్టీ నాయకులు కవిత పర్యటన షెడ్యూల్‌ను ప్రకటించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఇందల్వాయి మండలం గన్నారంలో తెలంగాణ రక్షణ సేన జెండా ఎగురవేస్తారన్నారు. మధ్యాహ్నం 2.45 కు మాధవనగర్ సాయిబాబా ఆలయం నుంచి ర్యాలీ గా నిజామాబాద్ పట్టణానికి బయల్దేరుతారన్నారు. మాధవనగర్ సాయిబాబా ఆలయం నుంచి పూలాంగ్ చౌరస్తా, రాజరాజేంద్ర చౌరస్తా,పెద్దబజార్, నెహ్రూపార్క్, గాంధీచౌక్, బస్టాండ్ మీదుగా ఓల్డ్ కలెక్టరేట్ గ్రౌండ్ వరకు ర్యాలీ సభస్థలికి చేరుకోనున్నామన్నారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 3.45 మధ్య సమావేశ వేదిక వద్ద కవిత ప్రసంగం ఉంటుందని సాయంత్రం 6.30 కు నందిపేట్ మండలం సిహెచ్ కొండూర్‌లోని శ్రీలక్ష్మి నర్సింహా స్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు చేస్తారని వెల్లడించారు.

# రూ.250 కోట్ల మిల్లింగ్ దందా..

# వడ్లూ లేవు.. బియ్యమూ రావు!



● ఆరు సీజన్లుగా సిఎంఆర్ బకాయిలు ● చట్టాలకు లొంగని రైస్ మిల్లర్లు ● 42 కేసులు నమోదు



ప్రజాపక్షం/నిర్మల్ : నిర్మల్ జిల్లాలో ప్రభుత్వ కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) కేటాయింపుల్లో ఊహించని రీతిలో భారీ మాయాజాలం వెలుగుచూసింది. ఆరు పంట సీజన్లు గడుస్తున్నా ప్రభుత్వానికి అప్పగించాల్సిన వందల కోట్ల రూపాయల విలువైన బియ్యాన్ని పక్కదారి పట్టించిన మిల్లర్ల తీరుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. నిర్మల్ జిల్లాలో పౌరసరఫరాల శాఖను సీఎంఆర్ బియ్యం బాగోతం తీవ్రంగా కలవరపెడుతోంది. 2022–23 ఖరీఫ్, రబీ సీజన్ల నుంచి మొదలుకొని వరుసగా ఆరు సీజన్లుగా ప్రభుత్వానికి చెల్లించాల్సిన మిల్లింగ్ బియ్యం బకాయిపడటంతో అధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే, మిల్లర్లకు కేటాయించిన ధాన్యమే మిల్లుల్లో లేకపోవడంతో ఇక బియ్యం రికవరీ అవకాశాలు ఎక్కడివని కొందరు సూటిగా ప్రశ్నిస్తున్నారు. 2022–23 ఖరీఫ్, రబీ సీజన్ మొదలుకొని 2025–26 యాసంగి సీజన్ వరకు సుమారు రూ. 250 కోట్ల సీఎంఆర్ అక్రమాలు జరిగినట్టు జిల్లాలో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. నిర్మల్ జిల్లాలో మొత్తం 54 రైస్ మిల్లులు ఉండగా, సగానికి పైగా మిల్లులు సీఎంఆర్ బియ్యాన్ని పెండింగ్‌లో ఉంచినట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వం ప్రతి సీజన్లో మిల్లుకు కేటాయించిన ధాన్యంలో 67 కేజీల బియ్యాన్ని సీఎంఆర్ రూపంలో ప్రభుత్వానికి 60 రోజుల్లో చెల్లించవలసి ఉంటుంది. అయితే సంవత్సరా లు, సీజన్లు ముగిసిపోయినా ఇప్పటి వరకు చాలా రైస్ మిల్లులు సీఎంఆర్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయి. సీఎంఆర్ బియ్యం పెండింగ్‌పై జిల్లా కలెక్టర్, పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రతి నెలా సమీక్ష చేస్తున్నా మిల్లర్లలో మార్పు రావడం లేదు.జిల్లాలో సీఎంఆర్ బియ్యం 2022 నుంచి పెండింగ్‌లో ఉంది. 2022–23 యా సంగి సీజన్లో మొత్తం రైస్ మిల్లులకు 1,58, 566.320 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా, రైస్ మిల్లర్లు 1,06,831.956 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించా ల్సి ఉంది. కానీ కేవలం 6,303.495 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే అప్పగించడంతో ఇంకా 1,00 ,52 8.461 మెట్రిక్ టన్నుల ధాన్యం అప్పగించవలసి ఉంది. అంటే కేవలం 5.90 శాతం మాత్రమే రికవరీ అయింది. 2023–24 సీజన్లో 1,42,750.080 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా 95,942.783 మెట్రిక్ టన్ను లు అప్పగించాల్సి ఉండగా 89,995.294 మెట్రిక్ ట న్నులు అప్పగించారు. ఇంకా 5,947.429 మెట్రిక్ టన్నుల ధాన్యం పెండింగ్‌లో ఉంది. మరో విడతలో 1,08,321.640 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా 82,630.010 మెట్రిక్ టన్నులు అప్పగించాల్సి ఉండగా 63,324.674 మెట్రిక్ టన్నులు అప్పగించగా 18, 995.336 మెట్రిక్ టన్నులు పెండింగ్‌లో పడింది.202425 వానాకాలం సీజన్లో 1,14,185.081 మెట్రిక్ ట న్నుల ధాన్యం కేటాయించగా 76,866.738 మెట్రిక్ ట న్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా 61,221.260 మె ట్రిక్ టన్నులు అప్పగించడంతో 15,645.679 మెట్రిక్ టన్నులు పెండింగ్‌లో ఉంది. యాసంగి సీజన్లో 1,53, 949.120 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా 1,03,590. 373 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా 35,889.039 మెట్రిక్ టన్నులు అప్పగించా రు. ఇంకా 67, 701.334 మెట్రిక్ టన్నులు పెండింగ్ లో ఉంది. 202526 వానాకాలం సీజన్లో 59, 396. 000 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా 39,910 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉండగా 13,972.737 మెట్రిక్ టన్నులు ఇవ్వగా 25,937.422 మెట్రిక్ టన్నులు పెండింగ్‌లో మిగిలింది. యాసంగి సీజన్లో 1,71,872.600 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా 1,15,651.883 మెట్రిక్ టన్నుల బియ్యం అ ప్పగించాల్సి ఉం డగా 5,720.000 టన్నులు మాత్రమే అప్పగించగా 1,09,931.583 మెట్రిక్ టన్నులు ఇంకా పెండింగ్‌లో ఉంది.ముఖ్యంగా 2023–24 వానాకాలం, యాసంగి సీజన్‌తో పాటు 2024–25 వానాకాలం సీజన్ సీఎంఆర్ పెద్ద మొత్తంలో పెండింగ్‌లో ఉంది. అయితే ఇక్కడ వడ్లు కూడా లేకపోవడంతో బియ్యం వచ్చే అవకాశాలు తక్కువేనని అధికారులు చెబుతున్నారు. పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నా ధాన్యానికి, సీఎంఆర్ బియ్యానికి పొంతన కుదరడం లేదు. సిఎంఆర్ పెండింగ్‌లో ఉన్న 13 రైస్ మిల్లులకు కొత్తగా ధాన్యం కేటాయించలేదు. అధికారులు తనిఖీలు చేసినప్పుడు కాకి లెక్కలు చూపిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.బియ్యం బకాయిల కంటే కేవలం 20 శాతంగానే ఉండటంతో రికవరీపై ఆందోళన నెలకొంది. వ్యాపారాలు మూసేసి కొత్త వ్యాపారాలు చేపడుతున్నారు.ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుసుదర్శన్‌రెడ్డి నిర్మల్‌లో సిఎంఆర్ బియ్యంపై లోపాలను గుర్తించి చర్యలకు ఆదేశించారు.భవేష్ మిశ్రా, రెవిన్యూ కలెక్టర్ కిషోర్‌కు మార్, పౌరసరఫరాల అధికారి జిల్లా మేనేజర్ సుధాకర్ తనిఖీలు నిర్వహిస్తున్నారు.బియ్యం కేటాయించని 34 రైస్ మిల్లులపై ఆర్ ఆర్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశామని, 42 కేసులు నమోదయ్యాయని తెలిపారు. సిఎంఆర్ సకాలంలో ఇచ్చే మిల్లులకే ధాన్యం కేటాయిస్తామని స్పష్టం చేశారు.


## రూ. 56.43 లక్షల సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : నిర్మల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్‌ఎఫ్) ద్వారా మంజూరైన చెక్కులను బిజెఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు.నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన 226 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 56,43,000/– విలువైన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.నిర్మల్ పట్టణంతో పాటు నిర్మల్ రూరల్,సోన్, మామడ,లక్ష్మ ణచందా,సారంగాపూర్, దిలావర్‌పూర్, నర్సాపూర్ మండలాలకు చెందిన బాధితులకు ఈ ఆర్థిక సహాయం అందింది. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు సిఎంఆర్‌ఎఫ్ నిధులు ఎంతగానో బాసటగా నిలుస్తాయని తెలిపారు.

## ఘనంగా పులాజీ బాబా 102వ జయంతి వేడుకలు



ప్రజాపక్షం / జైనూర్ : జైనూర్ మండలంలోని పట్నాపూర్ సిద్దేశ్వర సంస్థానంలో శ్రీశ్రీశ్రీ సద్గురు పులాజీ బాబా 102వ జయంతి వేడుకలను ఆదివారం భక్తులు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఆదిలాబాద్ ఎంపి గోడం నగేష్, ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు పటేల్, కలెక్టర్ కె. హరిత, మహారాష్ట్ర మాజీ ఎమ్మెల్యేలు, విశ్రాంత కమిషనర్ సంభాజీ సర్కుండే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రముఖులు, భక్తులు బాబా సమాధి మందిరంలో ప్రత్యేక పూజలు చేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిద్దేశ్వర సంస్థాన్ కమిటీ అధ్యక్షుడు ఇంగ్లే కేశవ్ దాదా, సభ్యులు మందిర అభివృద్ధి, భక్తుల వసతుల కల్పనపై ప్రజా ప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. బాబా 50 ఏళ్లుగా ఆధ్యాత్మిక ప్రవచనాల ద్వారా సమాజానికి ఎనలేని సేవలందించారని భక్తులు కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. స్థానిక సర్పంచ్ కందారే లక్ష్మి బాలాజీ, ఆసిఫాబాద్ డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యామ్ నాయక్, బిజెపి నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్, తుడుం దెబ్బ జాతీయ అధ్యక్షుడు కోట్నాక్ విజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథరావు, గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నరసయ్య, పలువురు సర్పంచులు, భక్తులు పాల్గొన్నారు.

## సుంక్లి గ్రామంలో అన్న బాహు సాఠే విగ్రహావిష్కరణ

సుంక్లి గ్రామ అభివృద్ధికి ప్రత్యేక కృషి

ఎమ్మెల్యే రామారావు పటేల్



ప్రజా పక్షం/భైంసా : భైంసా మండలం సుంక్లి గ్రామంలో సాహిత్య సామ్రాట్ అన్న బాహు సాఠే జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన అన్న బాహు సాఠే విగ్రహాన్ని ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. అన్నభౌ సాఠే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తన రచనలు, కవితల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని కొనియాడారు.అన్న బాహు సాఠే రచనలు సామాజిక అసమానతలపై పోరాటానికి స్ఫూర్తినిచ్చాయని, అణగారిన వర్గాల హక్కుల సాధనకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాజంలోని పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే రామారావు పటేల్ తెలిపారు.సుంక్లి గ్రామ అభివృద్ధికి ఇప్పటికే సుమారు రూ.80 లక్షల వరకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ నిధులతో గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు.రానున్న రోజుల్లో బిజ్జూర్ నుండి పెంచికల్ పాడ్ వయ సుంక్లి బీటీ రోడ్డు, మరియు వంతెన నిర్మాణ పనులను ప్రారంభిస్తామని అలాగే వానల్ పాడ్ నుండి వంజర వరకు డబల్ నిర్మాణ పనులు పూర్తి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.గత పాలకుల నిర్లక్ష్యం కారణంగానే ముధోల్ నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని ఎమ్మెల్యే విమర్శించారు.ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపించిన నాటి నుంచి రెండున్నర సంవత్సరాల కాలంలో నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ఎన్నో పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వీవో భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, గోదాముల నిర్మాణాలకు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం ద్వారా మరిన్ని నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.సుంక్లి గ్రామంలో కూడా దశలవారీగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల పనులు చేపట్టి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే రామారావు పటేల్ హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని తెలిపారు.అన్న బాహు సాఠే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.సర్పంచులు,ప్రజాప్రతినిధులు, మండల సీనియర్ ఎంఆర్‌పీఎస్ నాయకులు, అన్న బాహు సాఠే అభిమానులు,గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం




సిఐ ఎం.సంజయ్

ప్రజాపక్షం/రెబ్బెన: నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని రెబ్బెన సిఐ ఎం.సంజయ్ అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా రెబ్బెన మండలంలోని ఎన్‌టిఆర్ కాలనీలో శనివారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటిపిలు, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో ఎట్టిపరిస్థితుల్లోనూ పంచుకోవద్దన్నారు. యువత బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు, అక్రమ కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో 112, డ్రగ్స్ సమాచారానికి 1908, సైబర్ నేరాల ఫిర్యాదులకు 1930 నంబర్లకు డయల్ చేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే రోడ్డు ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు లేని 40 వాహనాలను గుర్తించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై మోటారు వాహన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

## రూ. 5.35 కోట్ల ఈద్గా నిధులు..

# దుర్వినియోగంపై లోకాయుక్త విచారణ

బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్




ప్రజాపక్షం/నిర్మల్ : సారంగపూర్ మం డలం, చిన్చోలిబి గ్రామం సమీపంలోని అటవీ భూమిలో నిరుపయోగంగా మారిన ఈద్గా నిర్మాణం పేరిట సుమారు రూ. 5.35 కోట్ల ప్రజాధనం తీవ్రంగా దుర్వినియోగమైందని, దీనికి బాధ్యులైన అధికారులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సయ్యద్ హైదర్ డిమాండ్ చేశారు. ఆదివారం నిర్మల్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రజాధనాన్ని కేటాయించి, అటవీ శాఖ పరిధిలోని భూముల్లో అవసరం లేని నిర్మాణాలు చేపట్టడం వెనుక పెద్ద ఎత్తున అవినీతి చోటుచేసుకుందని ఆయన ఆరోపించారు.ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని తాము లోకాయుక్తను ఆశ్రయించామని సయ్యద్ హైదర్ తెలిపారు. తాము దాఖలు చేసిన ఫిర్యాదు (ఫిర్యాదు నెం. 411/ 2026 /బి1) పై గౌరవ లోకాయుక్త సంస్థ ఎంతో తీవ్రంగా స్పందించిందని చెప్పారు. ఈ వ్యవహారానికి సంబంధించి పూర్తిస్థాయి సమగ్ర విచారణ జరిపి, సెప్టెంబర్ 08, 2026 లోపు వివరణాత్మక నివేదికను సమర్పించాలని నిర్మల్ కలెక్టర్‌ను లోకాయుక్త ఆదేశించినట్లు ఆయన స్పష్టం చేశారు. గౌరవ లోకాయుక్త జారీ చేసిన ఉత్తర్వుల మేరకు నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఇప్పటికే వేగంగా చర్యలు ప్రారంభించిందని తెలిపారు.అటవీ అధికారి (డిఎఫ్ఒ),మున్సిపల్ కమిషనర్ సారంగపూర్ తహసీల్దార్లకు కలెక్టర్ కార్యాలయం నుంచి అధికారికంగా నోటీసులు జారీ అయ్యాయని వెల్లడించారు. నిర్మాణ పనుల మంజూరు వెనుక ఉన్న కారణాలపై సవివరమైన విచారణ నివేదికను పంపాల్సిందిగా సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ కోరినట్లు తెలిపారు. అటవీ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా ని ర్మాణాలు చేపట్టడం, ప్రజాధనాన్ని పక్కదారి ప ట్టించడం తీవ్రమైన నేరమని సయ్యద్ హైదర్ పే ర్కొన్నారు. ప్రజల పన్నుల రూపంలో వచ్చిన ని ధులను బాధ్యతారాహిత్యంగా వృథా చేసిన అధికారులపై ఎలాంటి పక్షపాతం లేకుండా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నిధుల దుర్వినియోగానికి కారణమైన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు ఆమ్ ఆద్మీ పార్టీ తరఫున పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.ప్రజాధనానికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వ వ్యవస్థలపై ఉందనే విషయాన్నిఆయన గుర్తుచేశారు.

## 40 తులాల బంగారం, 35 వేల నగదు చోరీ

ప్రజాపక్షం/నిజామాబాద్/మాక్లూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో భారీ చోరీ జరిగింది. ఈ సంఘటన ఆదివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. గ్రామ రేషన్ డీలర్ అయిన వేములపల్లి శ్రీనివాస్ గత నాలుగు రోజులక్రితం ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లాడు. కాగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలోని 40 తులాల బంగారం, 35 వేల నగదు చోరీచేసినట్లు బాధితుడు తెలిపారు. అయితే బంగారం దొంగతనం చేసిన వ్యక్తులు నగదును, ప ట్టుచీరలను, వెండి ఆభరణాలు వదిలి వెళ్లటం విశేషం. ఆదివారం ఉదయం ఇ ంటి వద్ద గల ఒకరు రోమన్ ఇంట్లోని చెట్లకు నీటిని పట్టడానికి వచ్చిన సమయంలో ఇళ్లు తాళాలు తెరిచి ఉండటాన్ని గమనించి తమ సమీప బంధువుల కు సమాచారమివ్వటంతో వారు పరిశీలించగా చోరీ జరిగినట్లు అతనికి సమాచారమందించటంతో హైదరాబాద్ నుంచి హుటాహుటిన బయల్దేరినట్లు తెలిసిందిచోరీ తర్వాత ఆనవాళ్లు దొరకకుండా ఉండేందుకు గాను పోలీస్‌డాగ్ కనిపెట్టకుండా ఉండేందుకుగాను మొత్తం ఇళ్లంతా కారం పొడిని చల్లినట్లు గుర్తించారు.75 లక్షల విలువైన బంగారం చోరీ కావటంతో పోలీసులు కేసు దర్యాప్తును సవాల్‌గా తీసుకున్నారు. బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చోరీకి పాల్పడిన వ్యక్తులను పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.





రవితేజ 'ఇరుముడి' బాక్సాఫీస్ దగ్గర సెన్సేషనల్ రన్ కొనసాగిస్తోంది. అద్భుతమైన వసూళ్లతో దూసుకెళ్తున్న ఈ సినిమా రెండో వారంలోనూ స్ట్రాంగ్ కలెక్షన్స్ నమోదు చేస్తోంది. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర తన జోరును కొనసాగిస్తోంది.

# రీల్



## 'ఏష నాగుల కట్ట కింద' సాంగ్ రిలీజ్

నాని హీరోగా నటించిన పాన్ ఇండియా సినిమా 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ ఎల్వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి తెలంగాణ ఫోక్ సాంగ్ 'ఏష నాగుల' ను రిలీజ్ చేశారు. జానపద బాణీకి అనిరుధ్ తనదైన హైఎనర్జీ మ్యూజిక్‌ను జోడించిన ఈ పాటను డల్లాస్‌లో జరిగిన అనిరుధ్ కాన్సర్ట్‌లో లైవ్‌గా విడుదల చేశారు. వేలాది మంది అభిమానుల మధ్య పాటను లైవ్‌లో ప్రదర్శించారు. కాసర్ల శ్యామ్ రాసిన లిరిక్స్ పాట మూడ్‌కు పర్ఫెక్ట్‌గా సరిపోయాయి. లైవ్లీగా, క్యాచీగా సాగుతూ పక్కా జానపద నేటివిటీని ప్రజెంట్ చేశాయి. జంగి రెడ్డి వోకల్స్ పాటకు రస్టిక్ టచ్‌ను అందించగా, ప్రభా తన వోకల్స్ పాటలోని ఎనర్జీని మరింత పెంచారు. ఆట సందీప్ రిథమ్‌కు అనుగుణంగా ఫోక్ మూవ్‌మెంట్స్, మాస్ డ్యాన్స్ స్టెప్స్‌ను మేళవిస్తూ కొరియోగ్రఫీ అందించారు. ఈ చిత్రంలో మోహన్ బాబు, కాయదు లోహర్, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి, సంపూర్ణేష్ బాబు, తనికెళ్ల భరణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. డిఓపి సిహెచ్ సాయి, ఎడిటింగ్ నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైన్ అవినాష్ కొల్లా నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 24న పాన్‌వరల్డ్ స్థాయిలో విడుదల కానుంది. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్ సహా ఎనిమిది భాషల్లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.



## 'బెత్లెహెం కుటుంబ యూనిట్' ట్రైలర్ లాంచ్


నివిన్ పోలీ, మమితా బైజు జంటగా నటించిన తాజా చిత్రం 'బెత్లెహెం కుటుంబ యూనిట్'. 'ప్రేమలు' ఫేమ్ గిరీశ్ ఎడి దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఇటీవల మలయాళంలో విడుదలై ఘన విజయాన్ని అందుకుంది. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 4న తెలుగులో విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ తాజాగా తెలుగు ట్రైలర్ ను విడుదల చేశారు. ట్రైలర్‌లో ఫన్ లవ్ ఎంటర్‌టైన్‌మెంట్ అదిరిపోయింది. నివిన్ పోలీ జస్టిన్ పాత్రలో కనిపించారు. 2005లో ఆన్‌లైన్‌లో క్యాసెట్ పాటలను కన్వర్ట్ చేసి అప్‌లోడ్ చేస్తూ తనకు తానే 'యంపి3కింగ్' అనే పేరు పెట్టుకున్న జస్టిన్ పాత్రలో పరిచయం కావడం ఆకట్టుకుంది. మమితా బైజు కాలేజీ విద్యార్థినిగా, గిటార్ వాయిస్తూ ఆల్టర్నేటివ్ రాక్ మ్యూజిక్‌ను ఇష్టపడే అమ్మాయిగా కనిపించింది. ప్రేమ, హ్యూమర్, నాస్టాల్జియా, కమ్యూనిటీ డ్రామాను కలిపిన ఈ ట్రైలర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. నిర్మాతలు: దిలీష్ పోతన్, ఫహద్ ఫాసిల్, శ్యామ్ పుష్కరన్, రచన: గిరీష్ ఎడి, కిరణ్ జోసీ, సంగీతం: విష్ణు విజయ్, సినిమాటోగ్రఫీ: అజ్మల్ సాబు, ఎడిటర్: ఆకాష్ జోసెఫ్ వర్గీస్.

## సునీల్ కీలకపాత్రలో 'ఒరిజినల్ మాన్ స్టర్'



కన్నడ చిత్రసీమ టాప్ స్టార్ శాండల్ వుడ్ కింగ్ డా.శివరాజ్ కుమార్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'ఒరిజినల్ మాన్ స్టర్'. ఈ క్రేజీ చిత్రాన్ని ఆర్ చంద్రూ రూపొందిస్తున్నారు. ఆర్‌సి స్టూడియోస్ ప్రొడక్షన్ బ్యానర్‌పై ఆనంద్ పండిట్ సమర్పణలో యమున చంద్రూ నిర్మిస్తున్నారు. టాలీవుడ్ నటుడు సునీల్ ఈ సినిమాలో ఓ కీలక పాత్రను పోషిస్తున్నారు. ఈ మోస్ట్ అవేటెడ్ మూవీ ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్ లాంఛ్ ఈవెంట్ ఘనంగా జరిగింది.'ఒరిజినల్ మాన్ స్టర్' సినిమా ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్ చూస్తే డబ్బు నింపిన బ్యాగుతో బుల్లెట్ బండి మీద వెళ్తూ చేతిలో కత్తితో శివరాజ్ కుమార్ ఫెరోషియస్ లుక్స్‌లో కనిపించి ఆకట్టుకుంటున్నారు. ఆయన ఒంటిపై నెత్తుటి మరకలు, ఆయన వెళ్తున్న దారిలో డెడ్ బాడీస్ ఉండటం ఈ సినిమాలో భారీ యాక్షన్ సీక్వెన్సులు ఉంటాయని తెలియజేస్తోంది. ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్ ఈ భారీ పాన్ ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై మరింతగా అంచనాలు పెంచుతోంది. పలు భారతీయ భాషల్లో 'ఒరిజినల్ మాన్ స్టర్' సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

## రూ.150 కోట్లు దాటిన 'ఇరుముడి'



రవితేజ 'ఇరుముడి' బాక్సాఫీస్ దగ్గర సెన్సేషనల్ రన్ కొనసాగిస్తోంది. అద్భుతమైన వసూళ్లతో దూసుకెళ్తున్న ఈ సినిమా రెండో వారంలోనూ స్ట్రాంగ్ కలెక్షన్స్ నమోదు చేస్తోంది. వీకెండ్‌లో వసూళ్లు మరింతగా పెరిగాయి. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర తన జోరును కొనసాగిస్తోంది. ఇప్పటికే 'ఇరుముడి' వరల్డ్ వైడ్‌గా రూ.150 కోట్ల గ్రాస్ మార్క్‌ను క్రాస్ చేసింది. రవితేజ కెరీర్‌లో ఇదొక మైలురాయి కావడం విశేషం. ఈ సెన్సేషనల్ రన్‌లో నైజాం ఏరియా కీలకంగా నిలిచింది. అక్కడ రూ. 50 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. మిగతా ఏరియాల్లోనూ సినిమా ఇంప్రెసివ్ కలెక్షన్స్‌తో దూసుకెళ్తోంది.ముఖ్యంగా రీజినల్ సినిమాల్లో బిగ్గెస్ట్ హిట్స్‌లో ఒకటిగా 'ఇరుముడి' నిలిచింది. పలు సెంటర్లలో హౌస్‌ఫుల్ షోలు కొనసాగుతున్నాయి. కొత్త సినిమాల నుంచి పోటీ ఉన్నప్పటికీ ఆడియన్స్ పెద్ద సంఖ్యలో థియేటర్లకు వస్తుండటంతో 'ఇరుముడి' రియల్ బ్లాక్‌బస్టర్‌గా తన స్థానాన్ని మరింత బలపరుచుకుంటోంది. మరింత భారీ కలెక్షన్స్ నమోదు చేసే దిశగా సినిమా వెళ్తోంది.

## రాజ్ తరుణ్ హీరోగా 'టార్టాయిస్'



స్లీప్ వాకింగ్ చేస్తున్న యంగ్ హీరో ఎవరు అనేది నిన్నటిదాకా సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యింది. ఆ సస్పెన్స్‌కు తెర దించుతూ మేకర్స్ ఆ యంగ్ హీరో ఎవరు ? ఆయన సినిమా ఏంటి ? అనేది అనౌన్స్ చేశారు. స్లీప్ వాకింగ్ చేస్తున్న యంగ్ హీరో రాజ్ తరుణ్, ఆయన నటిస్తున్న కొత్త సినిమా 'టార్టాయిస్' అంటూ మేకర్స్ ప్రకటించారు. ఈ మూవీ టైటిల్ అనౌన్స్ మెంట్ తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో అమృత చౌదరి, అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. టార్టాయిస్ సినిమాను ఎస్‌కె గోల్డెన్ ఆర్ట్స్ ప్రశ్విత ఎంటర్‌టైన్‌మెంట్, ఎన్‌విఎల్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై విజయ్ చౌదరి, శశిధర్ నల్ల, రామిశెట్టి రాంబాబు నిర్మిస్తున్నారు. టార్టాయిస్ సినిమాను సస్పెన్స్, డ్రామా కలిసిన ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్ కథతో దర్శకుడు రిత్విక్ కుమార్ రూపొందిస్తున్నారు. మానస కుమార్, సంతోష్ ఇమ్మడి కో–ప్రొడ్యూసర్స్‌గా వ్యవహరిస్తున్నారు. టార్టాయిస్ సినిమా టైటిల్ అనౌన్స్ మెంట్ సందర్భంగా రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై ఇంట్రెస్ట్ క్రియేట్ చేస్తోంది. ఈ పోస్టర్‌లో ఒక డెడ్ బాడీ పక్కన హీరో రాజ్ తరుణ్ రక్తపు మరకలతో కూర్చుని ఉండటం, ఆయన పక్కనే ఒక కత్తి పడి ఉండటం ఆసక్తి రేపుతోంది. రాజ్ తరుణ్ తన కెరీర్ లో ఇప్పటిదాకా చేయని ఒక కొత్త తరహా ఇంటెన్స్ క్యారెక్టర్ ఈ సినిమాలో చేస్తున్నట్లు ఫస్ట్ లుక్ పోస్టర్ తో తెలుస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు. ఈ చిత్రానికి యాక్షన్ బెమనొల శ్రీకాం త్, కొరియోగ్రఫీ రాజ్ కృష్ణ, వెంకటేష్,ఆర్ట్ డైరెక్టర్ దేవర మధుకర్,ఎడిటర్ గుళ్లపల్లి మాధవ్ కుమా ర్, డిఒపి శబరి విగ్నేష్, మ్యూజిక్ అనూప్ రూబెన్స్, పిఆర్ఒ గాండ్ల శ్రీనివాస్ (జి. ఎస్. మీడియా).

## పిల్లలు ఎంజాయ్ చేసే 'సమ్మర్ హాలిడేస్'



ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై 'సమ్మర్ హాలిడేస్' అనే చిల్డ్రన్ మూవీని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు శ్రీకర్ రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈవెంట్‌లో ఈ సినిమాలోని 'స్కూల్ సాంగ్..' రిలీజ్ చేశారు. కొరియోగ్రాఫర్ ఆట సందీప్ మాట్లాడుతూ 'స్కూల్ సాంగ్..'కు డ్యాన్స్ కంపోజ్ చేయడాన్ని ఎంజాయ్ చేశాను. ఈ పాటకు కొరియోగ్రాఫ్ చేసే ముందు డైరెక్టర్ శ్రీకర్ ఈ పాట ముందు వెనక ఉండే సీన్స్ చూపించాడు. ఆ బ్యూటిఫుల్ సీన్స్ నన్ను ఇన్స్‌పైర్ చేశాయి. సింజిత్ కంపోజ్ చేసిన సాంగ్ చూసి ఎగ్జైట్ అయ్యాను. ఆ మ్యూజిక్‌కు తగినట్లు స్టెప్స్ రూపకల్పన చేశాను. డైరెక్టర్ చెప్పినట్లు మంచి హుక్ స్టెప్స్ డిజైన్ చేశాను. పిల్లలతో పాటు తల్లిదండ్రులు అంతా చూడాల్సిన చిత్రమిది అన్నారు. ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ ఈ పాట సింజిత్ పాడినప్పుడు ఆయన ఎనర్జీని మ్యాచ్ చేసే వాయిస్‌కు ఎవరు దొరుకుతారు అని అనుకున్నాను. కానీ విశ్వదత్తా బ్యూటిఫుల్‌గా పాడాడు. ఆయన గొంతు విని నేను పెద్ద అబ్బాయి అనుకున్నా. కిట్టూ విస్సాప్రగడ మా సినిమాలోని పాటలకు మంచి సాహిత్యం అందిస్తున్నారు. నేను స్టార్స్‌తో సినిమాలు ప్రొడ్యూస్ చేశాను. కానీ నాకు ఈ పిల్లలతో సినిమా చేస్తున్నప్పుడు ఎక్కువ సంతోషం, సంతృప్తి కలిగాయి. ఇప్పుడు మూవీస్ బాగా ఆడుతున్నాయి. ఈ టైమ్‌లో బాక్సాఫీస్ దగ్గర పోటీకి దిగే జానర్ మూవీ కాదిది. పిల్లలు, పేరెంట్స్ అందరూ థియేటర్స్ కు వచ్చి సినిమా చూడగలిగితే డేట్ చూసి రిలీజ్ చేయాలని అనుకుంటున్నాము. ఈ సినిమాను అక్టోబర్ 2న రిలీజ్ చేయాలనుకున్నాము. కానీ అప్పుడు ఒక పెద్ద సినిమా వస్తోంది. అక్టోబర్‌లో మా మూవీ రిలీజ్ ప్లాన్ చేయబోతున్నాం అన్నారు.మ్యూజిక్ డైరెక్టర్ సింజిత్ యెర్రమల్లి, సింగర్ విశ్వదత్తా, నటి వాసుకి, చైల్డ్ ఆర్టిస్ట్ అరుణ్, డైరెక్టర్ శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇదే మాట్లాడతారా!

(మొదటి పేజీ తరువాయి)

అని భాగవత్‌ను ప్రశ్నించారు. అమెరికాలో ప్రకటన చేయడానికి అదే ప్రకటన మన దేశంలో చేయడానికి చాలా తేడా ఉంటుందని, ఇక్కడ అదే మాట చెబితే ఆయన నిజాయతీని ఒప్పుకుంటామని డి.రాజా అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతంపై వస్తున్న ప్రశ్నల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే భాగవత్ ఈ వ్యాఖ్యలు చేశారని సిపిఐ ఎంపి పి.సందోశ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఆర్‌ఎస్‌ఎస్ నిజమైన ఉద్దేశం ఏమిటి? 1925లోనే ఈ సంస్థను ఎందుకు ప్రారంభించారు? అని ప్రశ్నించారు. ఆర్‌ఎస్‌ఎస్ లౌకికవాదాన్ని, రాజ్యాంగాన్ని అంగీకరిస్తుందా అని నిలదీశారు. మనుస్మృతికి బదులుగా రాజ్యాంగాన్ని స్వీకరిస్తారా అని కూడా సంతోశ్ కుమార్ ప్రశ్నించారు. ఇటువంటి సూటి ప్రశ్నలకు సమాధానం కూడా సూటిగా ఉండాలని ఆయన వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే 'భారత్‌లో ముస్లింలు ఉండకూడదని ఏ హిందువైనా భావిస్తే, అతను హిందువుగా కొనసాగలేడు. మిమ్మల్ని మీరు హిందువుగా పిలుచుకోవాలంటే, అన్ని మార్గాలు ఒకే లక్ష్యానికి దారితీస్తాయని, ప్రతి మనిషికీ గౌరవం ఉంటుందని మీరు నమ్మాలి' అని భాగవత్ వ్యాఖ్యానించిన విషయం విదితమే.

## వర్కర్లు బానిసలా?

(మొదటి పేజీ తరువాయి)

కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు చేయకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం 'స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి' అనే డిమాండ్‌తో సదస్సు నిర్వహించారు. ఎఐటియుసి రాష్ట్ర నాలుగో మహాసభల సందర్భంగా జరిగిన ఈ సదస్సులో కూనంనేని హాజరై, మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ రంగాల స్కీం కార్మికులకు అనేక హామీలు ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్నా వాటిలో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని అన్నారు. దీంతో కార్మికుల్లో తీవ్ర నిరాశ, నిస్పృహ నెలకొందన్నారు. ప్రభుత్వ స్కీమ్‌లలో పనిచేస్తున్న వారిని తక్షణమే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కూనంనేని డిమాండ్ చేశారు. వివిధ స్కీమ్‌ల కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానని తెలిపారు. కార్మికులు ఐక్యంగా పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని విమర్శించారు. కనీసం వారిని కార్మికులుగా గుర్తించి పీఎఫ్, ఇఎస్ఐ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

**హామీలను అమలు చేయాలి: విజయలక్ష్మి**

ఎఐటియుసి సీనియర్ నాయకురాలు బి.వి.విజయలక్ష్మి మాట్లాడుతూ ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, ఎన్‌హెచ్‌ఎం తదితర స్కీమ్‌ల కార్మికులు గతంలో అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. వారి పోరాటాల ఫలితంగా వేతనాలు పెంచుతామని ప్రభుత్వాలు హామీ ఇచ్చినా నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. ప్రజలకు నేరుగా సేవలందిస్తున్న కిందిస్థాయి సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఎఐటియుసి రాష్ట్ర నాలుగో మహాసభల్లో వివిధ స్కీమ్‌లలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై సమగ్రంగా చర్చించి, భవిష్యత్ పోరాట కార్యాచరణ రూపొందించాలని ఆమె పిలుపునిచ్చారు. ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఎఐటియుసి సీనియర్ నాయకుడు వివిఎస్.బోస్, రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్, ఉపాధ్యక్షురాలు పి.ప్రేమ్ పావని, కార్యదర్శి ఎన్. కరుణకుమారి తదితరులతో పాటు వివిధ స్కీమ్‌ల కార్మికులు పాల్గొన్నారు.

## మా వాళ్లెక్కడ?

(మొదటి పేజీ తరువాయి)

అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్‌డిఆర్‌ఆర్‌ఎంఎ) ప్రకారం, ఈనెల 26న సంభవించిన ఆకస్మిక వరదల కారణంగా మరణించిన వారి సంఖ్య ఆదివారం నాటికి 788కి చేరగా, 2,500 మందికి పైగా ఇంకా గల్లంతయ్యారు. నేపాల్–టిబెట్ సరిహద్దు సమీపంలో మంచు, కొండచరియలు విరిగిపడడం లేదా హిమపాతం కారణంగా ఈ విపత్తు సంభవించిందని భావిస్తున్నారు. ఇది మధ్య నేపాల్‌లోని పట్టణాలు, గ్రామాలను అతలాకుతలం చేసింది. హిమాలయ సరిహద్దు ప్రాంతం నుండి దక్షిణ దిశగా ప్రవహించే భోటెకోషి నది వరద నీటిని దిగువకు తీసుకువెళ్లి, ఇళ్లు, వాహనాలు, రోడ్లు, వంతెనలను కొట్టుకుపోయేలా చేయడంతో పాటు జలవిద్యుత్ ప్రాజెక్టులను దెబ్బతీసింది. ఆకస్మిక వరదల తర్వాత 108 మందిని రక్షించగా, 275 మందికి పైగా భారతీయులు, భారతీయ మూలాలున్న 128 మంది గల్లంతయ్యారని లేదా వారితో ఎటువంటి సంప్రదింపులు సాధ్యం కాలేదని న్యూఢిల్లీలోని విదేశీ వ్యవహారాల శాఖ శనివారం తెలిపింది.

నేపాల్ విద్యా శాఖ విడుదల చేసిన ప్రాథమిక గణాంకాల ప్రకారం, గల్లంతైన వారిలో వరద ప్రభావిత మూడు జిల్లాల్లోని వివిధ పాఠశాలలకు చెందిన 238 మంది విద్యార్థులు, 18 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలు, పెరుగుతున్న నీటి మట్టాల మధ్య గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతుండగా, ఆ హిమాలయ దేశంలో మృతదేహాలను వెలికితీసే ప్రక్రియ కూడా సాగుతోంది. చాలా మృతదేహాలు శిథిలావస్థలో ఉండటం లేదా అవయవాలు తొలగించబడి ఉండటంతో ఇప్పటివరకు కేవలం 17 మృతదేహాలను మాత్రమే గుర్తించగలిగామని బాగమతి ప్రావిన్స్ పోలీస్ కార్యాలయ ప్రతినిధి రాజేంద్ర ప్రసాద్ ధమాలా తెలిపారు. అవసరమైన చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేసిన తర్వాత ఇప్పటివరకు 96 మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించినట్లు ధమాలా చెప్పారు. అంత్యక్రియలకు ముందు మృతదేహాల నుండి డిఎన్‌ఎ నమూనాలను సేకరించి, ప్రస్తుత నిబంధనల ప్రకారం నిర్దేశిత ప్రదేశాలలో భద్రపరిచామని ఆయన తెలిపారు. ధృవీకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత, గుర్తించిన మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగిస్తున్నట్లు ధమాలా తెలిపారు. ఇదిలా ఉండగా, టిమురే సరిహద్దు పట్టణంలో కూలిపోయిన భద్రతా కేంద్రం శిథిలాల నుంచి ఆరేళ్ల బాలికను సాయుధ పోలీసు బలగాలు సజీవంగా బయటకు తీశాయి. శిథిలాల కింద ఎవరూ కనిపించకపోయినా, గాలింపు సమయంలో చిన్నారి ఏడుపు వినిపించడంతో సిబ్బంది మట్టిని తొలగించి ఆమెను రక్షించారు.

అయితే, ప్రతికూల వాతావరణం కారణంగా ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించలేకపోయారు. టిమురేలో వ్యాపారం కోసం ఉన్న నిశ్చల్ త్రిపాఠి కూడా వరద నుంచి తృటిలో తప్పించుకున్నాడు. భవనం కంపించడంతో ఐదో అంతస్తు నుంచి కిందికి పరుగెత్తి, రెండో అంతస్తు సమీపం నుంచి దూకి కొండవైపు చేరుకున్నాడు. అనంతరం మరికొందరితో కలిసి అడవిలో రాత్రి గడిపాడు. తన సోదరుడు, బృందంలోని ఐదారుగురితోపాటు, ఏడుగురు ట్రక్కు డ్రైవర్లు ఇంకా కనిపించలేదని అతను తెలిపాడు.

### భోటెకోషిలో మళ్లీ పెరుగుతున్న నీటిమట్టం

భోటెకోషి నదికి సంభవించిన ఆకస్మిక వరద కారణంగా వందలాది మంది మృతి చెందగా, నేపాల్‌లోని పలు ప్రాంతాలు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటుండగా, ఆ నదిలో నీటిమట్టం మళ్లీ పెరగడం ఆందోళన కలిగిస్తున్నది. ముందు జాగ్రత్త చర్యగా, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు, సహాయక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. నేపాల్–టిబెట్ సరిహద్దు సమీపంలో మంచు, రాళ్లు కూలిపోవడం లేదా హిమపాతం కారణంగా ఈ విపత్తు సంభవించినట్లు అధికారులు భావిస్తున్నారు. భోటేకోషి నది ఉద్ధృత ప్రవాహం ఇళ్లు, వాహనాలు, రహదారులు, వంతెనలను కొట్టుకుపోగా జలవిద్యుత్ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయి. మరోవైపు చైనా వైపు ఏర్పడిన సరస్సు, కొత్తగా ఏర్పడిన మరో 'డ్యామ్ లేక్' కారణంగా తాజా వరదల ముప్పుపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. నేపాల్ ప్రభుత్వం దాదాపు 20 వేల మంది భద్రతా సిబ్బందిని సహాయక చర్యల్లో మోహరింపచేసింది. హెలికాప్టర్ల ద్వారా ప్రజలను తరలించడంతో పాటు ఆహారం, ఇతర అత్యవసర సామగ్రిని అందిస్తున్నారు. ఇప్పటివరకు 4,500 మందికి పైగా రక్షించినట్లు విదేశాంగ మంత్రి తెలిపారు.



### నేపాల్ వరద బాధితులకు భారత్, అమెరికా భారీ సాయం

నేపాల్‌లో ఇటీవల సంభవించిన విధ్వంసకర వరదలతో బాధపడుతున్న ప్రజలకు భారత్, అమెరికా సహాయాన్ని అందిస్తున్నాయి. అమెరికా 36 లక్షల డాలర్లకు పైగా విలువైన మానవతా సాయాన్ని ప్రకటించింది. ఇందులో 10 వేల వరద బాధిత కుటుంబాలకు మూడు నెలల వరకు అత్యవసర ఆహారాన్ని అందించే ఏర్పాట్లు ఉన్నాయి. అమెరికా ఇప్పటికే ఆహార పదార్థాలు, దుప్పట్లు, దోమతెరలు, తాత్కాలిక ఆశ్రయాలకు అవసరమైన సామగ్రిని రసువా జిల్లాకు పంపింది. భారత్ కూడా 68.5 టన్నుల సహాయ సామగ్రిని నేపాల్‌కు పంపింది. శోధన, సహాయక చర్యలకు సాంకేతిక నిపుణులు, ఫోరెన్సిక్ నిపుణులు, అవసరమైన పరికరాలను అందించింది. చిక్కుకున్న కార్మికులను రక్షించేందుకు భారత నిపుణుల బృందం నేపాల్‌లో పనిచేస్తోంది

## బెదిరింపులా?

(మొదటి పేజీ తరువాయి)

సుప్రీంకోర్టు న్యాయమూర్తి నొక్కిచెప్పారు. ప్రశ్నించే హక్కు ధిక్కార చర్య కాదని, 'అసహనపూరిత మనస్తత్వం' భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం ఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీకి చెందిన పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల 13వ స్నాతకోత్సవం కార్యక్రమంలో ఉజ్జల్ భుయాన్ ప్రసంగించారు. 'విద్యార్థులు భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసినప్పుడు, ప్రశ్నలు అడిగినప్పుడు వారిని శిక్షాత్మక చర్యలతో బెదిరించకూడదు. అలాచేయడం రాజ్యాంగ విరుద్ధం. అది అధికారాన్ని, పదవిని దుర్వినియోగం చేయడమే' అని జస్టిస్ భుయాన్ స్పష్టం చేశారు. 'ఇది (విశ్వవిద్యాలయం) వ్యక్తులు తమ భిన్నమైన ఆలోచనలను ఎదుర్కొనే ప్రదేశం. ఇక్కడ స్థిరపడిన అభిప్రాయాలను పరిశీలించి ప్రశ్నించవచ్చు. విద్వేషంతో కాకుండా హేతుబద్ధంగా విభేదాలు తలెత్తవచ్చు. స్వేచ్ఛను, భిన్నత్వాన్ని గౌరవించే ప్రజాస్వామ్య సమాజం మనకు కావాలంటే, ఆ సంస్కృతి విశ్వవిద్యాలయాల నుంచే ప్రారంభం కావాలి' అని ఆయన అన్నారు. తన స్నాతకోత్సవ ప్రసంగంలో జస్టిస్ ఉజ్జల్ భుయాన్ మాట్లాడుతూ 'స్వేచ్ఛాయుత సమాజంలో విభిన్న అభిప్రాయాలు, నమ్మకాలు ఉంటాయని, భిన్నాభిప్రాయాలకు ఆస్కారం ఉన్నప్పుడు ప్రజా జీవితంలో భాగస్వామ్యం అర్థవంతంగా ఉంటుందని భారత రాజ్యాంగం గుర్తిస్తుందని వివరించారు. 'సహనం ఒక రాజ్యాంగ విలువ' అని బుద్ధుడు, గాంధీల జన్మస్థలమైన భారతదేశంలో 'అసహనపరుడికి' చోటు లేదని భుయాన్ పేర్కొన్నారు. 'భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యే సందర్భాలలో కూడా స్వేచ్ఛ, సమానత్వం, గౌరవం, న్యాయం వంటి రాజ్యాంగ విలువలు చట్టాన్ని అర్థం చేసుకోవడంలో ప్రధానాంశంగా కొనసాగేలా చూడటమే న్యాయ నిపుణులు, పండితుల బాధ్యత' అని జస్టిస్ భుయాన్ నొక్కిచెప్పారు.

## రూ.2000 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఆధునిక సౌకర్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, సికింద్రాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ డాక్టర్ ఆర్. గోపాలకృష్ణన్, ఇతర ప్రజాప్రతినిధులు, రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంతో వికారాబాద్ రైల్వే స్టేషన్ రూపురేఖలు మారనున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. స్టేషన్ భవనం, ప్లాట్‌ఫారాలు, 12 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తున్న పాదచారుల వంతెన, పార్కింగ్ ప్రాంతం, స్టేషన్ ప్రాంగణం తదితర పనులను కిషన్‌రెడ్డి పరిశీలించారు. నిర్మాణ ప్రదేశంలో చేపడుతున్న భద్రతా చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వికారాబాద్ స్టేషన్ పునరాభివృద్ధిలో భాగంగా 12 మీటర్ల వెడల్పు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఆధునీకరించిన వేచి ఉండే గదులు, మెరుగైన స్టేషన్ ప్రాంగణం, ఆధునిక ప్రవేశ ద్వారాలు, ముఖభాగం అభివృద్ధి, మెరుగైన లైటింగ్ తదితర సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రయాణికుల సౌకర్యం, అందుబాటు, స్టేషన్ వాతావరణాన్ని మెరుగుపరచడమే పునరాభివృద్ధి ప్రధాన లక్ష్యమన్నారు.

**కవచ్ 4.0కు అప్‌గ్రేడ్..**

స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ సిస్టమ్ 'కవచ్'ను తొలిసారిగా తెలంగాణలో అమలు చేశామని కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం వివిధ రైల్వే మార్గాల్లో కవచ్ 4.0కు అప్‌గ్రేడ్ చేసే పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల నుంచి విశాఖపట్నం, తిరుపతి, బెంగళూరు, నాగ్‌పూర్ వంటి ప్రధాన నగరాలకు ఐదు వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయని చెప్పారు.

## నీట్ పిజి పరీక్ష

(మొదటి పేజీ తరువాయి)

రాజస్థాన్‌లోని జైపూర్‌లో 2 పరీక్ష కేంద్రాల్లో జరగాల్సిన పరీక్షలను వాయిదా వేశారు. విద్యుత్ అంతరాయంతో పరీక్షలు సజావుగా జరగలేదని, తిరిగి సెప్టెంబర్ 5న పరీక్ష నిర్వహించనున్నట్లు ఎన్‌బిఇఎంఎస్ వర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం 3 గంటలకు రీ టెస్ట్‌ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నాయి. పరీక్షా కేంద్రాలలో తగిన మౌలిక సదుపాయాలను కల్పించే బాధ్యత కలిగిన సాంకేతిక భాగస్వామి, ఏజెన్సీపై తీసుకోవాల్సిన చర్యల గురించి నిర్ణయించడానికి ఎన్‌బిఇఎంఎస్ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసిందని అధికారులు తెలిపారు. జైపూర్‌లోని సీతాపురలో ఉన్న రెండు ఐయోన్ డిజిటల్ జోన్ కేంద్రాలలో పరీక్ష నిర్వహణ ఏజెన్సీ, సాంకేతిక భాగస్వామి అయిన టిసిఎస్ లిమిటెడ్ కారణంగా తలెత్తిన అంతర్గత విద్యుత్ సరఫరా సమస్యల వల్ల 2,445 మంది అభ్యర్థుల పరీక్షను పూర్తి చేయలేకపోయామని ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. తిరిగి నిర్వహించే పరీక్షా కేంద్రం, సవరించిన అడ్మిట్ కార్డుల వివరాలను విడిగా తెలియజేస్తామని బోర్డు తెలిపింది. దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలోని 339 నగరాల్లో ఉన్న 1,111 పరీక్షా కేంద్రాలలో 2,73,096 మంది అభ్యర్థుల కోసం నీట్‌పిజి పరీక్షను నిర్వహించాలని నిర్ణయించినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. మొత్తం 2,65,980 మంది అభ్యర్థులు నీట్‌పిజి పరీక్షకు హాజరు కాగా, సుమారు 2,63,535 మంది అభ్యర్థులకు పరీక్ష విజయవంతంగా పూర్తయిందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ దేశవ్యాప్త పరీక్ష నిర్వహణలో విస్తృతమైన 'రియల్‌టైమ్' పర్యవేక్షణ, కఠినమైన భద్రతా చర్యలు అమలు చేయబడ్డాయని తెలిపింది. పరీక్ష నిర్వహణను పర్యవేక్షించడానికి మొత్తం 2,527 మంది అధ్యాపకులను స్వతంత్ర పరిశీలకులుగా నియమించారు. అదనంగా, డీన్‌లు, డైరెక్టర్లు, మెడికల్ సూపరింటెండెంట్లు, సీనియర్ ప్రొఫెసర్లతో సహా 700 మందికి పైగా సీనియర్ అధ్యాపకులను ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులుగా నియమించారు. సమన్వయం, పర్యవేక్షణను బలోపేతం చేయడానికి, దేశవ్యాప్తంగా 16 ఎన్‌బిఎంఎస్ ప్రాంతీయ కమాండ్ సెంటర్లను అందుబాటులోకి తెచ్చినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. పరీక్షా కేంద్రాలను లైవ్ సిసిటివి నిఘా పరిధిలో ఉంచారు. ఢిల్లీలోని ద్వారకలో ఉన్న ఎన్‌బిఇఎంఎస్ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ సెంటర్ నుండి దీనిని నిరంతరం పర్యవేక్షించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com